www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 16-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 181 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 8.41 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.18 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 6.36-8.00; దుర్ముహూర్తం: ఉ. 11.37-12.23; అమృతఘడియలు: మ. 3.04-4.28; రాహుకాలం: ఉ. 12.00-1.30; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు
టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ 10

కష్టాలు నిజమే

అమలులో చాలా సమస్యలు ఉన్నాయి
జనంపై రవాణా చార్జీల భారం
బ్లాక్‌మార్కెటింగ్ జరుగుతోంది
అధిక ధరలకు అమ్ముకుంటున్నారు
సమస్యలపై అధ్యయనానికి కమిటీ
మంత్రివర్గ ఉపసంఘం వేయండి
రాష్ట్ర ప్రభుత్వానికి గనుల శాఖ నివేదిక
ఇంతకాలం బాగుందంటూ నివేదికలు
సమస్యలు తీవ్రమవడంతో నేలమార్గం
తాజాగా కొత్త ప్రతిపాదనలు

ఆగస్టులో..

"సార్... ఉచిత ఇసుక విధానం సూపర్. మహాద్భుతంగా అమలవుతోంది. ప్రజలు సంతోషంగా ఉన్నారు. మీకు తిరుగులేదు. మేం కూడా బాగా కష్టపడి అమలు చేస్తున్నాం.. సోషల్ మీడియాలోనే తప్పుడు ప్రచారం జరుగుతోంది. దానిని కట్టడి చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఏ సమస్యా లేదు"

-ఆగస్టులో ముఖ్యమంత్రికి గనుల శాఖ ప్రజంటేషన్

ఇప్పుడు..

"ఉచిత ఇసుక ఆలోచన మంచిదే. కానీ అమలులో చాలా సమస్యలున్నాయి. ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయి. వారిపై అధిక రవాణా చార్జీల భారం పడుతోంది. బ్లాక్‌మార్కెటింగ్ జరుగుతోంది. అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. కాబట్టి ఇంకా అనేక సమస్యలపై అధ్యయనం చేయాలి. మంత్రివర్గ ఉపసంఘం వేయాలి"

- సీఎం చంద్రబాబుకు గనుల శాఖ తాజాగా ఇచ్చిన నివేదిక

ఇన్నాళ్లూ కళ్లకు గంతలు

ప్రభుత్వ కార్యక్రమాన్ని అభినందించడం, బాగుందని చెప్పడం తప్పు కాదు. కానీ, క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలు, ఇబ్బందులను దాచిపెట్టడమే తప్పు. ఈ పని చేసిన గనుల శాఖ ఆలస్యంగానైనా దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్లు ఇసుక దొరక్కుండా చేశారు. తీసిన ఇసుకను తీసినట్టు దారి మళ్లించేయడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇసుక దొరక్కపోవడంతోపాటు, దొరికిన చోట కూడా ధరలు దడ పుట్టించేవి. దీంతో ఇసుకను ఉచితంగా రాష్ట్ర ప్రజలకు ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన కొత్తల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆశయం మంచిదేగానీ ఉచిత ఇసుక విధానం అమలులో క్షేత్రస్థాయిలో సమస్యలు

మిగతా 13వ పేజీలో...

బరితెగింపు వద్దు బ్రదర్!



'కట్టు' తప్పుతున్న తమ్ముళ్లకు గట్టి సంకేతం
18న ఎమ్మెల్యేలు, ఎంపీలతో బాబు భేటీ
ఇసుక దందా, లిక్కర్ సిండికేట్‌పై సీరియస్
పలువురు ఎమ్మెల్యేల తీరుపై విమర్శల వెల్లువ
కార్యకర్తల నుంచీ అధిష్ఠానానికి ఫిర్యాదులు
పార్టీకి, ప్రభుత్వానికీ అప్రతిష్ఠ తెస్తే సహించం 13
దందాల్లో కుటుంబసభ్యులున్నా ఊరుకోం.. తేల్చిచెప్పనున్న ముఖ్యమంత్రి.. తీవ్ర ఆరోపణలున్న వారికి సెపరేట్‌గా క్లాసు



మీడియాతో సీఈసీ రాజీవ్‌కుమార్(మధ్యలో), కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సంధు

నవంబరు 20న మహా ఎన్నికలు

288 స్థానాలకు ఒకే దశలో పోలింగ్
ఝార్ఖండ్‌కు 2 దశల్లో నిర్వహణ
నవంబరు 13, 20 తేదీల్లో ఓటింగ్
23న లెక్కింపు.. షెడ్యూల్ ప్రకటించిన ఈసీ
దేశవ్యాప్తంగా 47 అసెంబ్లీ, 6 లోక్‌సభ నియోజకవర్గాలకు 13న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల భేరీ మోగింది. హరియాణా ఎన్నికల పర్వం ముగిసి, వారం కూడా గడవకముందే కేంద్ర ఎన్నికల సంఘం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ఝార్ఖండ్‌లో రెండు దశల్లో (నవంబరు 13, 20 తేదీల్లో) ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను నవంబరు 23న ప్రకటిస్తారు. కాంగ్రెస్ నేత రాహుల్ రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన

మిగతా 2వ పేజీలో...

ఈవీఎంలు 'పేజర్ల' వంటివి కావు!

వాటిని ఎవరూ హ్యాక్ చేయలేరు
ఎగ్జిట్‌పోల్స్ అన్ని సందర్భాల్లోనూ పూర్తి నిజం కావు
మీడియా స్వీయ నియంత్రణ పాటించాలి: సీఈసీ
వయనాడ్ బరిలో ప్రియాంక గాంధీ: కాంగ్రెస్ 2

జోడెడ్ల బండి

అభివృద్ధి, సంక్షేమం.. రెండింటికీ సమ ప్రాధాన్యం
నేడు రాష్ట్ర కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు

ఉచిత గ్యాస్ సిలిండర్లకు ఓకే చెప్పే అవకాశం
దీపావళి కానుకగా సూపర్ 6 హామీ అమలుకు సన్నాహాలు
పలు కొత్త పారిశ్రామిక పాలసీలను ఆమోదించే చాన్స్
పెట్టుబడులు, ఉద్యోగాల సాధన లక్ష్యంగా పాలసీలకు ఓకే
ముందు పెట్టుబడులు పెట్టిన వారికి అదనపు ప్రోత్సాహకాలు



అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలకూ రాష్ట్ర ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోంది. ఒకపక్క ఎన్నికల హామీల అమలుకు కసరత్తు చేస్తూనే.. మరో పక్క అభివృద్ధి చుక్కానితో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేలా పారిశ్రామిక పాలసీలకు తుదిరూపునిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం రాష్ట్ర సచివాలయంలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఆమోదం తెలపడంతో పాటు రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగాలు సృష్టించే దిశగా ఐదారు రంగాల్లో కొత్త పారిశ్రామిక విధానాలను ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది. గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఇంటికీ ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా అందిస్తామని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సూపర్ 6 హామీల్లో భాగంగా ప్రకటించిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఎంత భారం పడుతుంది? ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాల్లో ఎలా అమలు చేస్తున్నారు? తదితర అంశాలపై ఇప్పటికే కసరత్తును

మిగతా 13వ పేజీలో...

త్వరలో నూర్‌బాషా కార్పొరేషన్! 13

ఏబీవీకి ఊరట



నిఘా పరికరాల కొనుగోళ్ల కేసుల నుంచి విముక్తి

రెండు కేసులు మూసివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు 14
మరో కేసు ఫైల్ సీఎం టేబుల్‌పై!



ఆర్టీఈ చట్టం ఉల్లంఘనకే జీవో 24

జగన్ సర్కారు జీవోను రద్దు చేసిన హైకోర్టు
అవసరమైన చోట స్కూళ్లు పెట్టడం ప్రభుత్వం బాధ్యత
దానిని విస్మరించి 'ప్రైవేటు'పై మోపడం వైఫల్యమే 14
చట్టాన్ని నీరుగారుస్తోందనే రద్దు
జూన్ 24న హైకోర్టు తీర్పు... తాజాగా అందుబాటులోకి

నీట మునిగిన చెన్నై

స్తంభించిన జనజీవనం
వరద నీటిలో 300 ప్రాంతాలు
కుప్పకూలిన ప్రజా రవాణా

వరద ముప్పు భయంతో చెన్నైలోని వేళచ్చేరి ఫ్లైఓవర్‌పై కార్ల పార్కింగ్



వాయు'గండమే'!

బంగాళాఖాతంలో బలపడిన తీవ్ర అల్పపీడనం.. నేటి ఉదయం నుంచి అతి భారీ వర్షాలు
నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక. ఆరు జిల్లాలకు రెడ్ అలెర్ట్
తుఫానుగా మారే అవకాశం తప్పిపోయినట్టేనని అంచనా 12



మద్యం పన్నుల సరళీకరణ

ఇప్పటివరకూ పది రకాల పన్నులు
వాటిని ఆరుకు కుదించిన ప్రభుత్వం

కొత్తగా డ్రగ్ కంట్రోల్ పేరుతో 2% సెస్
దీని ద్వారా డీఅడిక్షన్ సెంటర్లకు 100 కోట్లు
అయినా ధరల్లో ఎలాంటి మార్పూ ఉండదు

ఏపీలోనే ధర తక్కువ!
తెలంగాణలో క్వార్టర్ 110.. ఏపీలో 99

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యంపై విధించే పన్నులను కూటమి ప్రభుత్వం సరళీకరించింది. ఇప్పటివరకూ మద్యంపై పది రకాల పన్నులు విధిస్తుంటే, వాటిని ఆరుకు కుదించింది. అలాగే కొత్తగా డ్రగ్ కంట్రోల్ అండ్ రిహాబిలిటేషన్ పేరుతో 2 శాతం సెస్ విధించనుంది. కొన్ని పన్నులు తొలగించినా, కొత్తగా ఒక పన్ను

మిగతా 2వ పేజీలో...

ఇంట్లో కూర్చొనే పని చేస్తారా?

సరిహద్దుల్లో సమస్యలొస్తే వెళ్లరా?

విజయవాడ వరదలు వంటి ఘటనల్లో బాధితులకు సేవ చేయరా?
నేడు ఎక్కడివారు అక్కడికి వెళ్లాల్సిందేనని తీర్పు
డీవోపీటీ ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరణ
క్యాడర్ వివాదంలో ఐఏఎస్‌లకు ఎదురుదెబ్బ
కౌంటర్ దాఖలుకు కేంద్రానికి ఆదేశాలు
తెలంగాణ నుంచి ఏపీకి వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీ ప్రసాద్, రొనాల్డ్ రోస్
ఏపీ నుంచి తెలంగాణకు సృజన, శివశంకర్, హరికిరణ్
క్యాట్ తీర్పుపై నేడు హైకోర్టులో లంచ్ మోషన్
కోర్టు తీర్పు ఆధారంగా అధికారుల నిర్ణయం

ఐఏఎస్ అధికారుల తీరును తప్పుబట్టిన క్యాట్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఉన్న ఏడుగురు ఐఏఎస్‌లకు కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)లో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా జరిగిన క్యాడర్ కేటాయింపులకు విరుద్ధంగా తెలంగాణ, ఏపీలో

మిగతా 14వ పేజీలో...

'స్కిల్' కేసులో ఈడీ చర్యలు

23.54 కోట్ల సీమెన్స్ స్థిరాస్తులు, డిపాజిట్లు జప్తు
చంద్రబాబుకు సంబంధం లేదని ఈడీ వర్గాల వెల్లడి
కేసులో ఆయన పాత్ర లేదని స్పష్టీకరణ 13



మహేశ్వరరావు ధనశేఖర్ గుణరంజన్

హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు

న్యాయవాదులు మహేశ్వరరావు, ధనశేఖర్, గుణరంజన్‌కు అవకాశం
కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

అమరావతి, న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు మరో ముగ్గురు కొత్త న్యాయమూర్తులు రానున్నారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టులో సేవలందిస్తున్న ముగ్గురు న్యాయవాదులు కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్ పేర్లను ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి

మిగతా 13వ పేజీలో...

లడ్డూ సిట్‌కు త్రిపాఠీ, జెట్టి

రాష్ట్రం నుంచి ఆ ఇద్దరు సీనియర్ ఐపీఎస్‌లను సభ్యులుగా వేశాం 13
అది స్వతంత్ర విచారణ.. రాష్ట్ర పోలీసుల జోక్యం ఉండదు: డీజీపీ


2

ఉచిత పథకాలపై **మీ వైఖరేమిటి?**
కేంద్రం, ఈసీలకు సుప్రీంకోర్టు నోటీసులు

8 ఔషధాల ధరల పెంపు

వాటిలో యాంటీబయాటిక్‌లు, ఆస్తమా ఔషధాలు, కంటిచుక్కలు
ఫార్మా కంపెనీల విజ్ఞప్తి మేరకే: ఎన్‌పీపీఏ 2
తప్పుబడుతున్న స్వచ్ఛంద వైద్యసంఘాలు



'హంటర్ కిల్లర్స్' **వచ్చేస్తున్నాయ్!**
అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్లు
రూ.33 వేల కోట్ల ఒప్పందం ఖరారు

భారత్‌పై కెనడా ఆంక్షలు?

విధించే అవకాశాలను తోసిపుచ్చలేం: కెనడా మంత్రి మెలానీ జోలీ
బిష్ణోయ్ గ్యాంగ్‌తో భారత్ కోవర్టు ఆపరేషన్లు.. ఖలిస్థానీలే టార్గెట్
కెనడా పోలీస్ విభాగం ఆరోపణలు.. తోసిపుచ్చిన భారత వర్గాలు
కెనడియన్లపై దాడులకు దౌత్యవేత్తల్ని వాడుతున్నారు.. ఘోర తప్పిదం: ట్రూడో 2





'హంటర్ కిల్లర్స్' వచ్చేస్తున్నాయ్!

న్యూఢిల్లీ, అక్టోబరు 15: చైనా, పాకిస్థాన్‌ల వెంబడి సరిహద్దులు, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో సైనిక శక్తిని పెంచుకునే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. దీనికోసం ఆకాశంలో నిరంతరం నిఘాపెట్టే 'హంటర్ కిల్లర్' డ్రోన్లను రంగంలోకి దించనుంది. ఈ మేరకు అత్యాధునిక ఎంక్యూ-9బీ సాయుధ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు చేసేందుకు అమెరికాతో కీలక ఒప్పందం చేసుకుంది. అమెరికన్ డిఫెన్స్ మేజర్ జనరల్ అటామిక్స్ నుంచి దాదాపు 33,615 కోట్ల వ్యయంతో 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు ఈ ఒప్పందం కుదిరింది. ఢిల్లీలో భారత రక్షణశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఈ డీల్‌పై సంతకాలు చేశారు. అమెరికా నుంచి ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల కొనుగోలుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ (సీసీఎస్) గత వారం ఆమోదం తెలిపింది. దీంతో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు కొన్ని వారాల ముందే ఈ డీల్ ఖరారైంది. ఈ 31 డ్రోన్లలో భారత నౌకాదళానికి 15, వాయుసేనకు 8, సైన్యానికి 8 చొప్పున కేటాయిస్తారు. ఎంక్యూ-9బీ డ్రోన్లు ఎక్కువ ఎత్తులోనూ ఏకబిగిన 35 గంటలకుపైగా గాల్లో ఎగరగలవు. నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులు, 450 కిలోల వరకు బాంబులను మోసుకెళ్లగలవు.

ఎనిమిది ఔషధాల ధరల పెంపు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఎనిమిది రకాల ఔషధాల ధరలను పెంచుతూ 'జాతీయ ఔషధ ధరల సాధికార సంస్థ' నిర్ణయం తీసుకుంది. వీటిలో సాల్బుటమోల్ (ఆస్తమా చికిత్సలో ఉపయోగించే ఔషధం), స్ట్రెప్టోమైసిన్ (యాంటీబయాటిక్, టీబీ), లిథియం (బై పోలార్ డిజార్డర్), పైలోకార్పిన్ కంటి చుక్కలు(గ్లకోమా), అట్రోపిన్ ఇంజెక్షన్(యాంటీబయాటిక్), డిజ్‌ఫెరాక్సామైన్(థలసీమియా), సెఫడ్రోక్సిల్(యాంటీబయాటిక్) ఉన్నాయి. ప్రస్తుత ధరలతో పోల్చితే పెరిగిన ధరలు 50 శాతం వరకూ అధికంగా ఉండటం గమనార్హం. సోమవారం నుంచే పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి.

ఉచిత పథకాలపై వైఖరేమిటి?: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలపై వైఖరేమిటో చెప్పాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు పంపించింది. ఉచిత పథకాలను నియంత్రించాలని కోరుతూ దాఖలైన మరో వ్యాజ్యాన్ని స్వీకరించిన ధర్మాసనం ఈ నోటీసులు ఇచ్చింది. బెంగళూరుకు చెందిన శశాంక్ జె శ్రీధర ఈ పిటిషన్ వేశారు. ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోందని, అందువల్ల ఇలాంటి హామీలను నియంత్రించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరారు. దీనిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం.. సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వం, ఈసీకి నోటీసులు పంపించింది.

40% వైకల్యం ఉందని సీటు నిరాకరించకూడదు

- ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లపై సుప్రీం సవివర ఉత్తర్వులు


న్యూఢిల్లీ, అక్టోబరు 15: నిపుణుల కమిటీ నివేదిక ఇస్తే తప్ప పరిమితులకు మించి అంగవైకల్యం ఉందన్న కారణంతో ఎవరికీ ఎంబీబీఎస్ సీటును నిరాకరించకూడదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 40% అంతకన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు ఎంబీబీఎస్ చదవడాన్ని అనర్హులంటూ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్-1997లోని నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఈ వివరణ ఇచ్చింది. ఈ నిబంధనను సవాలు చేస్తూ ఓంకార్ అనే విద్యార్థి వేసిన వ్యాజ్యంపై సెప్టెంబరు 18న జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం తీర్పు చెబుతూ 40 శాతం అంగవైకల్యం ఉందన్న ఒకే ఒక కారణంతో సీటు నిరాకరించకూడదని తెలిపింది. ఆ విద్యార్థికి సీటు ఇవ్వాలని ఆదేశించింది.

దౌర్జన్యంగా ఆస్తి రాయించుకున్నారు!

- జోగి రమేశ్ అనుచరులపై బాధితుడి ఫిర్యాదు
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన బాధితులు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ అనుచరులు దౌర్జన్యంగా తన ఆస్తిని రాయించుకున్నారని ఒక బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వినతుల కార్యక్రమంలో బాధితుడు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, పార్టీ నేతలు గొట్టుముక్కల రఘురామకృష్ణంరాజు, దేవినేని చందు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న జోగి రమేశ్ అండతో కటకం ప్రసాద్, మరి కొంతమంది కలిసి నన్ను ప్రసాద్ ఇంట్లో నిర్బంధించి, కొట్టి చంపుతామని బెదిరించి, నాతో సంతకాలు చేయించుకొని నా ఆస్తిని కబ్జా చేశారు. దీనిపై అప్పట్లోనే పెడన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడైనా నాకు న్యాయం చేయాలి' అని పెడనకు చెందిన మామిడి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. వైసీపీకి చెందిన మాజీ మంత్రి విడదల రజని బంధువులమని చెప్పుకొంటూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయురాలు, మాజీ ఇంగ్లీష్ టీచర్ కలిసి నాడు-నేడు పనుల పేరుతో రూ.కోటీ పది లక్షల డబ్బులు తీసుకొన్నారని, పనులు మాత్రం చేయలేదని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శ్రీ శారద జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయని, ఇతర ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామ పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలో ప్రధానోపాధ్యాయుడు వైసీపీ నేతలతో కుమ్మక్కై కొంత మంది కమిటీ సభ్యులను తరగతి గదిలో నిర్బంధించి ఎన్నికను ఏకగ్రీవం చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయల పల్లి గ్రామానికి చెందిన పసుపులేటి అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తాము టీడీపీ సానుభూతిపరులమన్న అభిప్రాయంతో తమ ఇళ్ల బిల్లులు మంజూరు చేయకుండా గత ప్రభుత్వంలో అడ్డుకొన్నారని, ఇప్పుడు వాటిని విడుదల చేయించాలని కర్నూలు జిల్లా ఆదోని మండలం దొడ్డనకేరి గ్రామ సర్పంచి, ఇతర బాధితులు కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో తన భూమిని వేరొకరి పేరుపై మార్చారని, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిష్కారం కాలేదని నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం వడ్డెపాలెం గ్రామానికి చెందిన గురవయ్య ఫిర్యాదు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ సమయంలో కంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్న 309 పోస్టులు మినహాయించి ఇచ్చేలా చూడాలని సంబంధిత సంఘ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ప్రముఖ గైనకాలజిస్ట్ కొత్త ఉషాలక్ష్మీ కన్నుమూత



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గైనకాలజిస్ట్ నిపుణులు డాక్టర్ కొత్త ఉషా లక్ష్మీ(91) మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఏపీలోని గుంటూరుకు చెందిన ఉషాలక్ష్మీ తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధ గైనకాలజిస్టుల్లో ఒకరుగా ఉన్నారు. హైద రాబాద్ నగరంలో ప్రసూతి, గైనకాలజీ ప్రొఫెసర్‌గా, నీలోఫర్ ఆస్పత్రిలో ఆమె సుదీర్ఘకాలం పాటు సేవలందించారు. అయితే 69 ఏళ్ల వయసులో ఆమె రొమ్ము కేన్సర్ బారిన పడినప్పటికీ వ్యాధికి ఎదురొడ్డి విజేతగా నిలిచారు. కాగా, రొమ్ము కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ద్వారా మహి ళలను వ్యాధి నుంచి దూరం చేయవచ్చని ఆమె పేరిట 2007లో కుమారుడు కిమ్స్ ఉషాలక్ష్మీ సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ , సీఈఓ డాక్టర్ రఘురామ్ నగరంలో ఉషా లక్ష్మీ బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్‌ను స్థాపించి అధునాతన సేవలందిస్తున్నారు.

హైదరాబాద్‌లో మహిళపై ఆటోలో అత్యాచారం

రాయదుర్గం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో దారుణం జరిగింది. ఒంటరిగా తన ఆటో ఎక్కిన మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆటోను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. సోమవారం అర్ధరాత్రి తర్వాత హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉన్న ఓ మహిళ కొండాపూర్ వెళ్లేందుకు సోమవారం అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో ఆర్‌సీ పురం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద ఆటో ఎక్కింది. ఆటో మసీద్‌బండ ప్రాంతానికి రాగానే డ్రైవర్ వాహనాన్ని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆ మహిళ కేకలు విని అటుగా వెళుతున్న వాహనదారులు ఆటో వద్దకు చేరే సరికి ఆటో డ్రైవర్ పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, నిందితుడైన ఆటో డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

'మహా' ఎన్నికలు నవంబరు 20న

(మొదటి పేజీ తరువాయి)

వయనాడ్ (కేరళ)తో పాటు నాందేడ్ (మహారాష్ట్ర) లోక్‌సభ స్థానాలు, 48 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబరు 13, 20న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నవంబరు 23న ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబరు 26న, ఝార్ఖండ్ అసెంబ్లీ గడువు 2025 జనవరి 5న ముగుస్తున్నప్పటికీ రెండు రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఈ నెల 29 వరకు గడువు ఇచ్చారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబరు 4 వరకు గడువు ఇచ్చారు. ఝార్ఖండ్‌లో నవంబరు 13న జరిగే స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 25 కాగా ఉపసంహరణకు అక్టోబరు 30 చివరి తేదీ. నవంబరు 20న జరిగే స్థానాలకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబరు 29 కాగా.. ఉపసంహరణకు నవంబరు 1 చివరి తేదీ. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో 9.63 కోట్ల మంది ఓటర్లు, 81 అసెంబ్లీ స్థానాలున్న ఝార్ఖండ్‌లో 2.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి 15లోపు జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను కూడా ఇప్పుడే జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ కోరినప్పటికీ ఈసీ పట్టించుకోలేదు. నిజానికి హరియాణా ఎన్నికలను కూడా మహారాష్ట్రతో పాటే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ జమ్మూకశ్మీర్‌తో కలిపి నిర్వహించింది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా సమస్యల వల్ల మహారాష్ట్రను హరియాణా నుంచి వేరు చేశామని సీఈసీ తెలిపారు.



మహారాష్ట్రలో హోరాహోరీ

మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడీకి; బీజేపీ, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమికి మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 105 సీట్లు, శివసేన 56 సీట్లు గెలుచుకోగా.. ఎన్సీపీ 54, కాంగ్రెస్ 44 సీట్లు గెలుచుకున్నాయి. రాజకీయ పరిణామాలు మారి.. శివసేన కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి (మహాయుతి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం శివసేన నుంచి ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ నుంచి అజిత్ పవార్‌లు తమ వర్గం ఎమ్మెల్యేలతో బయటికొచ్చి.. బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 48 సీట్లలో కేవలం 9 సీట్లే గెలుచుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. తాజాగా శిందే సర్కారులోనూ విభేదాలు బయటపడుతున్నాయి. ఈ క్రమంలో మహా వికాస్ అఘాడీ, మహాయుతి కూటముల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. ఇక 2019లో ఝార్ఖండ్‌లో జేఎంఎం 30 సీట్లు, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 25 సీట్లు సాధించింది. ఈ ఎన్నికల్లో కూడా జేఎంఎం-కాంగ్రెస్ కూటమి; బీజేపీ మధ్య గట్టి పోటీ నెలకొననుంది. కాగా, మహారాష్ట్రలో ఎన్నికలకు అతి తక్కువ సమయం ఇచ్చారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. కేవలం 35 రోజులే సమయం ఇచ్చారని విమర్శించారు. అదేసమయంలో ప్రభుత్వం భారీగా పథకాలు ప్రకటించుకునేందుకు ఈసీ అవకాశం కల్పించిందని కాంగ్రెస్ నేత విజయ్ ఆరోపించారు. అలాగే 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకే దశలో ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచనతోనే ఇలా చేశారని ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు పన్నినా తమ కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

ఈవీఎంలు 'పేజర్ల' లాంటివి కావు!

- వాటిని ఎవరూ హ్యాక్ చేయలేరు
- ఎగ్జిట్‌పోల్స్ అన్ని సందర్భాల్లో పూర్తిగా నిజం కావు
- మీడియా స్వీయ నియంత్రణ పాటించాలి: సీఈసీ

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు).. హిజ్బుల్లా ఉగ్రవాదులను పేల్చేందుకు ఇజ్రాయెల్ హ్యాక్ చేసిన పేజర్ల లాంటివి కావని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. ఈవీఎంలు హ్యాకింగ్‌కు గురికావని, పేజర్ల వంటి వాటితో ఈవీఎంలకు సంబంధం ఉండదని చెప్పారు. మంగళవారం మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈవీఎంలు హ్యాకింగ్‌కు గురవుతున్నాయంటూ కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ చేసిన ఆరోపణలకు స్పందనగా సీఈసీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఇజ్రాయెల్.. పేజర్లను, వాకీటాకీలను ఉపయోగించి జనాన్ని చంపుతున్నప్పుడు.. ఈవీఎంల పరిస్థితేంటని రషీద్ అల్వీ ప్రశ్నించారు. ఇలాంటి పనులు చేయడంలో ఇజ్రాయెల్‌కు మంచి నైపుణ్యం ఉందని, ఆ దేశంతో ప్రధాని నరేంద్రమోదీకి మంచి సంబంధాలున్నాయని ఆరోపించారు. మహారాష్ట్రలో ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్లతో ఎన్నికలు నిర్వహించాల్సిందిగా తాము కోరతామన్నారు. అయితే ఈ ఆరోపణల్ని సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఇక ఎగ్జిట్ పోల్స్ విషయంలోనూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎగ్జిట్‌పోల్స్ అన్ని సందర్భాల్లో పూర్తిగా నిజమయ్యే అవకాశం ఉండదన్నారు. వీటిని నిర్వహించే సందర్భం, అభిప్రాయం సేకరించే శాంపిళ్లపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై మీడియా సంస్థలు ఆత్మపరిశీలన చేసుకోవాలని, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు.

వయనాడ్ నుంచి ప్రియాంక పోటీ



న్యూఢిల్లీ, అక్టోబరు 15: వయనాడ్ లోక్‌సభ సీటుకు ప్రియాంకా గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను మంగళవారం ప్రకటించిన ఎన్నికల కమిషన్, వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు 47 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆ వెంటనే వయనాడ్ సీటుకు ప్రియాంక అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ ప్రకటన చేసింది. రాహుల్‌గాంధీ వయనాడ్(కేరళ) సీటును వదులుకొని రాయ్‌బరేలీ(యూపీ) లోక్‌సభ స్థానానికే ప్రాతినిధ్యం వహిస్తారని పార్టీ గతంలోనే తెలిపింది. కాగా, వయనాడ్‌లో గనక ఆమె గెలిస్తే... ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు(సోనియా, రాహుల్, ప్రియాంక) మొట్టమొదటిసారిగా పార్లమెంటు సభ్యులుగా ఉంటారు.

కర్ణాటకలో 3 శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. శాసనసభ సభ్యులుగా కొనసాగుతూ, ఎంపీలుగా ఎన్నికైనవారు రాజీనామా చేసిన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. రామనగర జిల్లా చన్నపట్టణ ఎమ్మెల్యే కుమారస్వామి మండ్య నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. హావేరి జిల్లా శిగ్గావి ఎమ్మెల్యే, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై హావేరి ఎంపీగా ఎన్నికయ్యారు. బళ్లారి జిల్లా సండూరు ఎమ్మెల్యే తుకారాం బళ్లారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ మూడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు ఈ నెల 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్‌లు స్వీకరిస్తారు. ఉపసంహరణలకు 31వరకు గడువు ఉంటుంది. నవంబరు 13న పోలింగ్ నిర్వహిస్తారు. నవంబరు 23న ఫలితాలు ప్రకటిస్తారు.

లోకం తీరు



ఇరాన్ అణు, చమురు వ్యవస్థలపై దాడి చెయ్యం

- అమెరికాకు ఇజ్రాయెల్ హామీ

జెరూసలెం, అక్టోబరు 15: ఇరాన్‌పై ప్రతీకార చర్య తథ్యమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అదే సమయంలో ఇరాన్ అణుస్థావరాలు, చమురు క్షేత్రాల వంటి సైనికేతర వ్యవస్థల మీద మాత్రం దాడులు చెయ్యబోమని మాట ఇచ్చారు. రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలను, ఇజ్రాయెల్‌కు బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను సమకూర్చాలన్న అమెరికా నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని, నెతన్యాహు తన వైఖరిని కొంత సడలించుకున్నారు. ఇద్దరు అధికారులను ఉటంకిస్తూ 'వాషింగ్టన్ పోస్ట్' ఈ విషయాన్ని వెల్లడించింది. ఇరాన్ చమురు, అణు వ్యవస్థలపై దాడులు చేయాలని ఇజ్రాయెల్ తొలుత భావించింది, అందుకు ప్రతిచర్యగా ఇరాన్ కనుక ఇజ్రాయెల్‌లోని జనవాసాలపై దాడులకు దిగితే యుద్ధతీవ్రత, విస్తృతి పెరిగి అపార కష్టనష్టాలు తథ్యమని భావించిన బైడెన్ ప్రభుత్వం నెతన్యాహు వ్యూహాన్ని వ్యతిరేకించింది. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తే ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు భగ్గుమంటాయి. అణు స్థావరాలపై దాడుల వల్ల యుద్ధం హద్దులు దాటి అమెరికా నేరుగా జోక్యం చేసుకోవల్సిరావచ్చు. అదే జరిగితే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పరిస్థితి డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు ప్రతికూలంగానూ, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగానూ మారవచ్చు. ఈ ఆలోచన కారణంగానే నెతన్యాహు దూకుడుకు బైడెన్ కొంతవరకు పగ్గం వేయగలిగారు. గాజాలో మానవతా సహాయక చర్యలు చేపట్టడానికి వీలుగా పరిస్థితులను 30 రోజుల్లో మెరుగుపరచాలని, లేకపోతే సైనిక సహాయం ఆపేస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని బైడెన్ సర్కార్ హెచ్చరించినట్లు మరోవైపు సీఎన్ఎన్ వెల్లడించింది.

భారత్‌పై కెనడా ఆంక్షలు?

విధించే అవకాశాలను తోసిపుచ్చలేం.. కెనడా మంత్రి మెలానీ జోలీ వ్యాఖ్యలు

- కెనడియన్లపై దాడులకు దౌత్యవేత్తలను, వ్యవస్థీకృత నేర శక్తులను వాడుతున్నారు
- ఇది భారత్ ఘోర తప్పిదం: ట్రూడో

న్యూఢిల్లీ/ఒట్టావా, అక్టోబరు 15: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యపై భారత్, కెనడా మధ్య మొదలైన దౌత్య వివాదం మరింత ముదిరింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో భారత్‌పై ఆంక్షలు విధించే అవకాశాలను తోసిపుచ్చలేమని, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ తాజాగా వ్యాఖ్యలు చేశారు. రాయల్ కెనడియన్ మౌంట్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) సేకరించిన ఆధారాలే భారత దౌత్యవేత్తను బహిష్కరించాలన్న నిర్ణయానికి కారణమని తెలిపారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనాల కోసం జరుగుతున్న దర్యాప్తునకు సహకరించాలని భారత ప్రభుత్వాని జోలీ కోరారు. దౌత్యపరమైన ప్రత్యేక వెసులుబాట్లను రద్దుచేసి దర్యాప్తునకు సహకరించాలని భారత్‌ను కోరామని, కానీ వారు నిరాకరించారని చెప్పారు. ఈ విషయంలో భారత్‌పై ఒత్తిడి తెచ్చేలా భారత్‌పై ఒత్తిడి తెస్తూనే ఉంటామని, ఫైవ్ ఐస్ భాగస్వాములతో పాటు జీ7 దేశాలతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భారత్‌తో దౌత్యపరమైన ఘర్షణలను తాము కోరుకోవడం లేదని తెలిపారు. కాగా, కెనడియన్లపై దాడి చేయడానికి, వారిలో భయాందోళనలు రేకెత్తించడానికి తమ దౌత్యవేత్తలను, వ్యవస్థీకృత నేరగాళ్లను వినియోగించడం ద్వారా భారత్ ఘోర తప్పిదానికి పాల్పడిందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. కెనడాలో హత్యాకాండలు, హింసాత్మక ఘటనలకు పాల్పడటంలో భారత ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్‌సీఎంపీ చీఫ్ నివేదిక సమర్పించిన తర్వాత ట్రూడో మీడియాతో మాట్లాడారు. ఈ ధోరణి మా దేశ పౌరుల భద్రతకు తీవ్ర ముప్పు అని పేర్కొన్నారు. తమ భాగస్వామ్య దేశాలతోనూ ఈ అంశంపై చర్చించామని, అక్కడ కూడా వారు భారత్ నుంచి ఇలాంటి ప్రవర్తనను ఎదుర్కొన్నారని తెలిపారు. 'భారత ఏజెంట్లు కెనడియన్ల భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారని ఆర్‌సీఎంపీ తన నివేదికలో ఆధారాలతో సహా వెల్లడించిం' అని ట్రూడో ఆరోపించారు. మరోవైపు బిష్ణోయ్ గ్యాంగ్‌తో చేతులు కలిపిన భారత ఏజెంట్లు తమ దేశంలో కోవర్టు ఆపరేషన్లు చేస్తున్నారని కెనడా తీవ్ర ఆరోపణలు చేసింది. కెనడాలో నివసించే దక్షిణాసియా సమాజాన్ని ప్రత్యేకించి ఖలిస్థానీ మద్దతుదారులను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారని రాయల్ కెనడియన్ మౌంట్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) ఆరోపించింది. ఈ సందర్భంగా బిష్ణోయ్ గ్యాంగ్ గురించి కూడా ప్రస్తావించింది. 'కొన్ని ముఠాల సాయంతో భారత ఏజెంట్లు కెనడా భూభాగంపై వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారు. ప్రత్యేకించి ఇందులో బిష్ణోయ్ గ్రూపు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ గ్యాంగ్‌కు భారత ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని విశ్వసిస్తున్నాం' అని ఆర్‌సీఎంపీ అసిస్టెంట్ కమిషనర్ బ్రిగెట్టె గౌవిన్ వ్యాఖ్యానించారు. అయితే కెనడాలోని క్రిమినల్ ముఠాలతో భారత ఏజెంట్లకు సంబంధాలను అంటగడుతూ ఆ దేశ అధికారులు చేస్తున్న ప్రయత్నాలను భారత్ ఖండించింది. నిజ్జర్ కేసులో భారత్‌కు సాక్ష్యాధారాలు అందించామని ఒట్టావా చేస్తున్న వాదనలో ఏమాత్రం వాస్తవం లేదని ఇక్కడి అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కెనడాలో పౌరులను లక్ష్యంగా చేసుకొని భారత్ కోవర్టు ఆపరేషన్లు నిర్వహిస్తోందంటూ ఆ దేశ ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలను కూడా ఆ వర్గాలు తోసిపుచ్చాయి. అస్పష్ట ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే నిందలు మోపడం అనే విధానాన్ని కెనడా మొదటినుంచీ అవలంబిస్తోందని మండిపడ్డాయి.



వ్యతిరేకతను తప్పించుకోవడానికేనా?

కెనడాలో ప్రజలతో పాటు సొంత పార్టీలో పెరిగిపోతున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికే ప్రధాని జస్టిన్ ట్రూడో హఠాత్తుగా నిజ్జర్ హత్య కేసును తవ్వి తీశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంపై క్రమంగా పట్టు సడలిపోతుండటంతో భారత్‌పై వ్యూహాత్మకంగా నిందలకు పాల్పడుతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ట్రూడోకు వ్యతిరేకంగా ఆ దేశ పార్లమెంట్ హాల్‌లో సొంత పార్టీ నేతలే సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు సమాచారం. లిబరల్ పార్టీ ఎంపీలు పెద్దసంఖ్యలో ఇందులో పాల్గొన్నట్లు తెలిసింది. వచ్చే అక్టోబరులో జరిగే ఫెడరల్ ఎన్నికలకు ట్రూడో నేతృత్వంలో బరిలోకి దిగితే ఓటమి తప్పదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు. మరోవైపు ట్రూడో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) గత నెలలోనే తన మద్దతును ఉపసంహరించుకుంది. ఈ పార్టీ కోసమే భారత్‌తో ట్రూడో విరోధం పెట్టుకున్నారు. కాగా, కెనడాలో నివసిస్తున్న లక్షలాది మంది సిక్కు ఓటర్లను ఆకట్టుకోవడానికి ఇరు దేశాల మధ్య సంబంధాలను పణంగా పెట్టడానికి సైతం ట్రూడో వెనుకాడటం లేదు. గతేడాది భారత్‌లో నిర్వహించిన జీ20 సమావేశాల తర్వాతే నిజ్జర్ హత్య వివాదం తెరపైకి వచ్చింది. భారత్‌పై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వెంటనే దీనికి ఎన్‌డీపీ నేత జగ్మీత్ సింగ్ వంతపాడటం గమనార్హం.

మద్యం పన్నుల సరళీకరణ

(మొదటి పేజీ తరువాయి)

విధించినా మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు రాలేదు. వైసీపీ ప్రభుత్వం మద్యంపై పన్నుల సంఖ్యను పెంచి గందరగోళం చేసింది. వాటిలో కొన్నిటిని నేరుగా రుణ సమీకరణకు వాడుకుంది. అది రాష్ట్రంపై దీర్ఘకాలిక భారంగా మారింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పన్నుల స్వరూపాన్ని మార్చేసింది. అయితే వినియోగదారులపై ఎలాంటి భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. డీఅడిక్షన్ సెంటర్ల నిర్వహణకు సుమారు రూ.వంద కోట్లు అవసరమవుతాయని అంచనా వేసి డ్రగ్ కంట్రోల్ పన్ను విధించినా అది వినియోగదారులపై పడకుండా సర్దుబాటు చేసింది. ఈ మేరకు పన్నుల సవరణలు, కొత్తగా విధించిన 2 శాతం సెస్‌పై ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా ఉత్తర్వులు జారీ చేశారు. తాజా సవరణల ప్రకారం ఇకపై మద్యంపై ఆరు రకాల పన్నులు ఉంటాయి. ఇప్పటివరకూ ఉన్న రిటైల్ ఎక్సైజ్ టాక్స్ 6శాతం రిటైల్ మార్జిన్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, హోల్‌సేల్ ట్రేడ్ అపోర్షన్ అనే పన్నులను పూర్తిగా తొలగించారు. కొత్తగా విధించిన డ్రగ్ కంట్రోల్ అండ్ రీహాబిలిటేషన్ సెస్ నగదు ప్రభుత్వానికి వెళ్లకుండా నేరుగా డీఅడిక్షన్ కార్యక్రమాలకు బదిలీ అవుతుంది.

పన్నుల విధింపు ఇలా..

ఉత్పత్తిదారులు మద్యం తయారుచేసి ప్రభుత్వానికి పంపుతారు. దానిని బేసిక్ ధరగా పరిగణిస్తారు. ఈ బేసిక్ ధరపై ఎక్సైజ్ డ్యూటీ విధిస్తారు. అప్పుడు వచ్చే ల్యాండెడ్ కాస్ట్‌పై స్పెషల్ మార్జిన్, హోల్‌సేల్ ట్రేడ్ మార్జిన్ ఉంటాయి. ఈ పన్నులన్నీ విధించిన తర్వాత వచ్చేదానిపై వ్యాట్ వేస్తారు. ఆ తర్వాత వచ్చే ధరపై 20 శాతం రిటైలర్ మార్జిన్ ఉంటుంది. ఈ మొత్తంపై చివరిగా అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ వేస్తారు. ఈ పన్నులన్నీ విధించిన తర్వాత వచ్చే ధర ఎమ్మార్పీ అవుతుంది.

శ్లాబుల వారీగా శాతం

అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్‌ను మద్యం బేసిక్ ధర ఆధారంగా విధిస్తారు. ఈ పన్ను ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌పై 137 శాతం నుంచి 226 శాతం వరకు ఉంటుంది. బీరుపై 211శాతం, వైన్‌పై 187శాతం, రెడీ టు డ్రింక్స్‌పై 39శాతంగా ఉంటుంది. ఏఆర్ఈటీ పన్నుపై రిటైలర్‌కు మార్జిన్ ఇవ్వరు.

గుదిబండలా స్పెషల్ మార్జిన్

రుణ సమీకరణ లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వం మద్యంపై స్పెషల్ మార్జిన్ అనే పన్ను ప్రవేశపెట్టింది. మద్యంపై విధించే పన్నుల్లో వ్యాట్ ఆదాయం వాణిజ్య పన్నుల శాఖకు వెళ్తుంది. అప్పుడు రుణ సమీకరణ సాధ్యం కాదు కాబట్టి వ్యాట్ కాంపోనెంట్ తగ్గించి, స్పెషల్ మార్జిన్‌ను ప్రవేశపెట్టారు. దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని తనఖా పెట్టి దాదాపు రూ.14వేల కోట్లు రుణం తీసుకొచ్చారు. భవిష్యత్తులో వచ్చే స్పెషల్ మార్జిన్ కూడా రుణం చెల్లింపులకే పోతుంది. దీంతో ఆ పన్నును ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఏపీలోనే ధర తక్కువ!

గత వైసీపీ ప్రభుత్వంలో భారీగా ధరలు పెంచడంతో రాష్ట్రంలో మద్యం ధరలు ఆకాశాన్ని తాకాయి. దీంతో తెలంగాణ నుంచి మద్యాన్ని అక్రమంగా ఏపీలోకి తీసుకొచ్చి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత ఏపీలోనూ ధరలు తగ్గించడంతో క్రమంగా తెలంగాణ నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తగ్గిపోయింది. ఇప్పటివరకూ రెండు రాష్ట్రాల్లోనూ చీప్ లిక్కర్ ధర కనీసం రూ.110గా ఉంది. ఏపీలో ఒకటీ అరా బ్రాండ్‌లే ఈ కనీస ధర మద్యాన్ని సరఫరా చేశాయి. దీంతో రూ.150 కంటే తక్కువ పెడితే మద్యం పెద్దగా దొరకలేదు. కూటమి ప్రభుత్వం పాత విధానంలో రూ.99కే ఇస్తామని ప్రకటించడంతో తెలంగాణ కంటే చాలా తక్కువకు మద్యం అందుబాటులోకి రానుంది.

నేటి నుంచి 'ప్రైవేటు మద్యం'

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో మద్యం మళ్లీ ప్రవేటు చేతికి మారింది. తొలినుంచీ మద్యం వ్యాపారం ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోనే ఉండగా గత వైసీపీ ప్రభుత్వం దాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. అన్నీ ప్రభుత్వ షాపులే కావడంతో తమకు కావాల్సిన బ్రాండ్లు అమ్ముకుని కమీషన్ల రూపంలో రూ.వేల కోట్లు దండుకున్నారు. దానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం పాత విధానంలో మద్యం వ్యాపారాన్ని తిరిగి ప్రైవేటుకు అప్పగించింది. వినియోగదారులు కోరిన బ్రాండ్లు కావాలంటే ప్రైవేటు విధానమే సరైనదని, వ్యాపారం ప్రభుత్వం చేతిలో ఉంటే బ్రాండ్ల సరఫరాలో గందరగోళం తలెత్తుతుందని ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు పాలసీ లాటరీలో లైసెన్సులు దక్కించుకున్న వారంతా మంగళవారం నాటికి తొలి విడత లైసెన్స్ ఫీజులు చెల్లించారు. దీంతో బుధవారం నుంచి షాపులు ఏర్పాటుచేసుకునేందుకు లైన్ క్లియర్ అయింది. 3,396 షాపులు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే చాలామంది డిపోల నుంచి స్టాకు కొనుగోలు చేశారు. ఇక ప్రభుత్వ మద్యం షాపులు మంగళవారంతో మూతపడ్డాయి. రాత్రి షాపుల పనివేళ ముగిసిన వెంటనే ఎక్సైజ్ శాఖ షాపుల్లో ఉన్న మద్యం నిల్వలు, టేబుళ్లు, కంప్యూటర్లు, స్కానర్లు, రిఫ్రిజిరేటర్లను స్వాధీనం చేసుకుంది.

రూ.99 బ్రాండ్లు రెడీ

కొత్త మద్యం పాలసీలో రూ.99కే క్వార్టర్ మద్యం అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దానిలో భాగంగా ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. ఐదు జాతీయ స్థాయి కంపెనీలు ఈ తరహా మద్యం సరఫరా చేస్తామని ముందుకొచ్చాయి. వాటిలో ట్రోపికానా బ్రాందీ అనే బ్రాండ్ ఇప్పటికే పరిమిత స్థాయిలో కేసులు సరఫరా చేసింది. కేరళ మాల్టెడ్ ఫైన్ విస్కీ రేపటినుంచి రానుంది. షార్ట్ విస్కీ కూడా ఈ కేటగిరీలో ఉంది. వారం రోజుల్లో లక్షన్నర కేసులు షాపుల్లో అందుబాటులోకి రానున్నాయి.



అశేష భక్తుల నడుమ కొనసాగుతున్న సిరిమాను ఊరేగింపు, (ఇన్‌సెట్లో) సిరిమానుపైనుంచి భక్తులను ఆశీర్వదిస్తున్న ఆలయ పూజారి వెంకటరావు

అంబరాన్ని తాకిన సిరిమాను సంబరం

» నిర్దేశించిన సమయానికే ఊరేగింపు ప్రారంభం

విజయనగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి సిరిమాను ఉత్సవం అంబరాన్ని తాకింది. అశేష జనవాహిని పైడిమాంబ నామ స్మరణ మధ్య మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు చదురుగుడి వద్ద సిరిమాను కదిలింది. అమ్మవారి పరివారం పాలధార, బెస్తావారి వల, అంజలి రథం ముందుకు కదలగా సిరిమాను అదే దారిలో నడిచింది. సిరిమానును అధిరోహించిన బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ప్రతిరూపంగా భక్తజనాన్ని ఆశీర్వదించారు. ఆ సమయంలో జై పైడిమాంబ అంటూ భక్తులు అరటిపండ్లను విసిరారు. దాదాపు రెండు గంటల పాటు సిరిమాను మూడు పర్యాయాలు కోట శక్తికి నమస్కరించి తిరిగి వచ్చింది. 5.20 గంటలకు సిరిమాను ఊరేగింపు ముగిసింది. కోట బురుజుపైనుంచి పూసపాటి వంశీయులైన అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజు, సునీతా గజపతిరాజు, వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్, అదితి గజపతిరాజుతో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ ఎంపీ భరత్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తదితరులు సిరిమానోత్సవాన్ని తిలకించారు. కాగా.. తొలిసారి భారీ ఎత్తున సామాన్యభక్తులు సైతం కోట బురుజుపైకి ఎక్కి సిరిమాను ఊరేగింపును వీక్షించారు. మరోవైపు.. సిరిమానోత్సవానికి ఊహించని సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలేళ్ల రోజు అర్ధరాత్రి వరకూ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు మంగళవారం జరిగే సిరిమానోత్సవంలో భారీగా పాల్గొన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ సిరిమాను రూపంలో వచ్చే పైడిమాంబను దర్శించుకునేందుకు ఉవ్విళ్లూరారు. సిరిమానోత్సవం రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలను సమర్పించారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో చదురుగుడికి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

విజయవంతంగా పల్లెపండుగ

» అభివృద్ధి పనులతో గ్రామాల్లో మళ్లీ వెలుగులు

» డిప్యూటీ సీఎం పవన్‌ను అభినందించిన చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్దేశించిన పల్లె పండుగ కార్యక్రమం విజయవంతంగా సాగుతుండటం ఆనందం కలిగిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13,326 గ్రామాల్లో మొత్తం 30 వేల పనులు చేపట్టాలనే బృహత్ సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. రూ.4,500 కోట్ల ఖర్చుతో చేస్తున్న అభివృద్ధి పనులు గ్రామాల్లో ఉపాధి కల్పిస్తూ, పల్లెల్లో మళ్లీ వెలుగులు తెలుస్తున్నాయని బుధవారం ట్వీట్ చేశారు. రానున్న రోజుల్లో ఇలాంటి మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పల్లెల్లో సంతోషాలు నింపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పేందుకు సంతోషిస్తున్నామన్నారు.

ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర కమిటీ ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్-1938 నుంచి విడిపోయి కొత్తగా ఏర్పాటైన ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. ఈ సంఘం అధ్యక్షుడిగా సీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎం.నాగూర్ ప్రసాద్, అదనపు కార్యదర్శిగా ఎం.సూర్యుడు, సంయుక్త అధ్యక్షుడిగా డి.చెంగల్‌రెడ్డి, కోశాధికారిగా వి.శివరంగయ్య, మహిళా కార్యదర్శిగా ఎ.పద్మజ ఎన్నికైనట్లు ఆ సంఘం వెల్లడించింది.

కొత్త రేట్లతో టీడీఆర్ బాండ్లు!

» తణుకు కుంభకోణంపై సర్కారు నిర్ణయం

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తణుకు మున్సిపాలిటీలో గత ప్రభుత్వం జారీచేసిన టీడీఆర్ బాండ్లను రద్దు చేసి కొత్త బాండ్లు జారీచేయాలని మున్సిపల్‌శాఖ నిర్ణయం తీసుకుంది. తణుకు సమీపంలో ఉన్న డోర్‌నెంబర్ల ఆధారంగా వాల్యూయేషన్ వేసి బాండ్లను జారీచేసి రూ.వందల కోట్ల కుంభకోణానికి తెరతీసిన విషయం విదితమే. దీనిపై సర్కార్ ఏసీబీ విచారణకు ఆదేశించడంతో పాటు ఉన్నతస్థాయి విచారణ చేపట్టింది. డోర్ నెంబర్ ఆధారంగా కాకుండా ఆయా ప్రాంతాల్లో భూమి మార్కెట్ ధర ఆధారంగా రేట్లను నిర్ణయించి టీడీఆర్ బాండ్లను జారీచేయాలని ఆదేశించారు. దీంతో ఇప్పటికే జారీచేసిన బాండ్లు రద్దవుతాయి. భారీ విలువ కలిగిన టీడీఆర్ బాండ్ల విలువ గణనీయంగా పడిపోనుంది. అయితే, ఇప్పటికే వినియోగించిన టీడీఆర్ బాండ్ల విషయంపై మున్సిపల్ శాఖ స్పష్టత ఇవ్వలేదు

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకున్నా అయ్యప్ప దర్శనం

తిరువనంతపురం, అక్టోబరు 15: శబరిమల అయ్యప్ప దర్శనం విషయంలో కేరళ ప్రభుత్వం భక్తులకు ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా వచ్చే భక్తులు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా అయ్యప్ప దర్శనం చేసుకోవచ్చని కేరళ ప్రభుత్వం మంగళవారం స్పష్టం చేసింది. రానున్న యాత్రా సీజన్ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే దర్శనం కల్పించాలని ఇటీవల తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు సీఎం విజయన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా వచ్చే భక్తులకు కూడా సజావుగా దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గత యాత్రా సీజన్‌లోనూ ఈ సదుపాయం కల్పించామన్నారు. అయితే గత ఏడాది మాదిరిగా వర్చువల్ బుకింగ్‌తో పాటు స్పాట్ బుకింగ్ వ్యవస్థను కొనసాగిస్తారా? లేదా? అనే దానిపై సీఎం విజయన్ స్పష్టత ఇవ్వలేదు. ఈనెల 5న జరిగిన సమావేశంలో స్పాట్ బుకింగ్‌ను అనుమతించడంపై చర్చించినట్లు మాత్రమే చెప్పారు. వర్చువల్ క్యూ సిస్టమ్‌లో భక్తులు దర్శన టిక్కెట్లు, ప్రసాదాలను శబరిమల ఆలయ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకుంటారు. అదే స్పాట్ బుకింగ్‌లో యాత్రికులు దేవస్థానం బోర్డు ఏర్పాటు చేసిన నిర్దేశిత కేంద్రాల్లో దర్శనం స్లాట్‌లను బుకింగ్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

అత్తాకోడలిపై గ్యాంగ్‌రేప్ కేసులో ఐదుగురు అరెస్ట్

ముగ్గురు మైనర్లు.. ఇద్దరు పాత నేరస్థులు

పరారీలో మరో కరుడుగట్టిన నేరస్థుడు

» గతంలో పలు దారిదోపిడీలు, చోరీలకు పాల్పడిన నిందితులు: ఎస్పీ

» కేసును ఛేదించిన సిబ్బందికి రివార్డులు అందజేత



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, వెనుక ముసుగుల్లో గ్యాంగ్‌రేప్ నిందితులు

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. ఆ వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. జిల్లాలోని చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేస్తున్న వాచ్‌మన్ కుటుంబంలో అత్తాకోడలిపై ఈ నెల 11 అర్ధరాత్రి ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారని, నిందితులలో ఐదుగురిని హిందూపురం డంపింగ్ యార్డ్‌వద్ద మంగళవా రం అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో నిందితులు నేరం ఒప్పుకొన్నారని ఎస్పీ తెలిపారు. హిందూపురంలోని త్యాగరాజ్ నగర్‌కు చెందిన మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్, అంతర్‌రాష్ట్ర దొంగ ఎరికల కావడి నాగేంద్ర అలియాస్ నాగ, అలియాస్ రోబో, అదే ప్రాంతానికి చెందిన సాకే ప్రవీణ్‌కుమార్, ముగ్గురు మైనర్లను అరెస్టు చేశామని తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు చాకలి శ్రీనివాస్ పరారీలో ఉన్నాడన్నారు. నాగేంద్ర, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ పాత నేరస్థులని చెప్పారు. నాగేంద్ర 37 కేసుల్లో నిందితుడని తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌పై లేపాక్షి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసు ఉందన్నారు. చాకలి శ్రీనివాస్ మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ అని, హిందూపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో దోపిడీ కేసు ఉందని తెలిపారు. నిందితులు ఆరుగురు ఈనెల 11న చోరీ నిమిత్తం రెండు ద్విచక్రవాహనాపై వెళ్లారని, అప్పటికే పేపర్ మిల్లు వద్ద వాచ్‌మన్‌గా ఉంటున్న కర్ణాటక కుటుంబంపై కన్నేశారని చెప్పారు. రెండు మూడు సార్లు రెక్కీ నిర్వహించారని, ఈ నెల 11న అర్ధరాత్రి దాటాక అక్కడికి వెళ్లి ద్విచక్ర వాహనాలు ఆపారని, కుక్కలు అరవడంతో వాచ్‌మన్ టార్చ్‌లైట్ వేసి చూశారని తెలిపారు. దీంతో నిందితులు వాచ్‌మన్ వద్దకు వెళ్లి ఉద్దేశ పూర్వకంగా తాగునీరు అడిగారని, ముందుకు వస్తున్న వారి ని వాచ్‌మన్ అడ్డుకున్నారని, అరుపులు విని వాచ్‌మన్ భార్య, కుమారు డు, కోడలు బయటకు వచ్చారని చెప్పారు. నిందితుల్లో ఇద్దరు ఆ తండ్రీకొడుకుల వద్ద కాపలా ఉండి, అత్తాకోడలిని రేకుల షెడ్‌లోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. కాగా, సామూహిక అత్యాచార ఘటనను సీఎం చంద్రబాబు సీరియస్‌గా పరిగణించడంతో ఎస్పీ రత్న రంగంలోకి దిగి సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు. నిందితులు గతంలో ఒంటరిగా వెళ్లే జంటలపై నిఘావేసి అఘాయిత్యాలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐలు ఆంజనేయులు, కరీం, రాఘవన్, జనార్దన్, సిబ్బందికి రివార్డులు అందజేశారు.

అత్యాచారాలు, దాడి ఘటనలపై కఠిన చర్యలు

» సత్యసాయి, బాపట్ల ఘటనలపై ప్రత్యేక కోర్టు : అనిత

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యాచారాలకు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, లా అండ్‌ఆర్డర్ ఐజీ శ్రీకాంత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బాపట్ల, సత్యసాయి జిల్లాల్లో జరిగిన అత్యాచార కేసుల్లో విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై జరిగిన అత్యాచారం ఘటనలో 48 గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు పంపామన్నారు. బాపట్ల జిల్లాలో మహిళపై జరిగిన హత్యాచారం కేసులో నిందితుడిని 42 గంటల్లో పట్టుకున్నామన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలనే ఉద్దేశంతో ప్రత్యేక కోర్టుకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు హైకోర్టుకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. 112,100 నంబర్లకు ఫోన్ చేస్తే పోలీస్ వ్యవస్థ క్షణాల్లో స్పందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

మీరు నన్నెలా ప్రశ్నిస్తారు?

» నా ర్యాంకు అధికారివే కదా.. దర్యాప్తు అధికారి మీరు కాదే!

» సీఐడీ విచారణలో విజయ్‌పాల్ వింత తీరు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కేసులో గుంటూరులోని వెస్ట్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు మరోసారి రిటైర్డు సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్ హాజరయ్యారు. విచారణ సందర్భంగా అధికారులపై ఆయన ఎదురుదాడికి దిగారు. "ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు అధికారి మీరు కాదు కదా. నోటీసు ఇచ్చారు కాబట్టి గౌరవప్రదంగా చెప్పి వెళ్దామని వచ్చా. ఈ కేసుకు దర్యాప్తు అధికారిని ప్రభుత్వం వేరే వారిని నియమించింది కదా! ఆయన వద్దే చెప్పుకుంటాం. ఈ కేసుతో ఇక మీకు సంబంధం లేదు కదా. నేను అదనపు ఎస్పీగా పనిచేశాను, మీరు కూడా అదే హోదాలో ఉన్నారు. అటువంటప్పుడు మీరు నన్ను ఎలా ప్రశ్నిస్తారు?" అంటూ...తన న్యాయవాదితో కలిసి అక్కడ నుంచి వెళ్లిపోయారు. విజయ్‌పాల్‌ను ఈ నెల 11న గుంటూరు జిల్లా అడ్మిన్ ఎస్పీ, కేసు విచారణ అధికారి రమణమూర్తి విచారించారు. మంగళవారం తిరిగి విచారణకు రావాల్సిందిగా నోటీసు ఇచ్చారు. అయితే, సోమవారం ఈ కేసు దర్యాప్తు అధికారిగా కొత్తగా ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే, అప్పటికే నోటీసులు జారీ చేయడంతో.. రమణమూర్తే విజయ్‌పాల్‌ను విచారించేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో రమణమూర్తిపై ఎదురుదాడికి దిగినట్లు వ్యవహరిస్తూనే, తన మానసిక స్థితి సరిగాలేదన్నట్లుగా విజయ్‌పాల్ ప్రవర్తించినట్లు చెబుతున్నారు. ఏది అడిగినా, అడిగేందుకు ప్రయత్నిస్తున్నా...నాకు మీరు ఏమి అడుగుతున్నారో అర్థం కావడం లేదని పదేపదే అన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

సజ్జలకు లుకౌట్ నోటీసులు

» రెండు వారాల క్రితమే జారీ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ లుకౌట్ నోటీసులు ఇప్పటికే జారీచేసినా.. ఆ విషయం బయటకురాలేదు. విదేశాల నుంచి తిరిగి వస్తున్న సజ్జలను మంగళవారం ఢిల్లీ ఎయిర్ పోర్టు పోలీసులు అడ్డుకోవడంతో తొలిసారి ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడికి సూత్రధారి సజ్జల రామకృష్ణారెడ్డి అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఇటీవల ఆయనను ఆ కేసులో నిందితునిగా చేరుస్తూ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఆ కేసులో నిందితులందరికీ పోలీసులు ఇప్పటికే లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. దీనిలో భాగంగా సజ్జల రామకృష్ణారెడ్డికి కూడా రెండు వారాల క్రితం లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసే నాటికే సజ్జల రామకృష్ణారెడ్డి విదేశాలకు వెళ్లారు. మంగళవారం తిరిగి వస్తున్న క్రమంలో లుకౌట్ నోటీసు వ్యవహారంతో ఎయిర్ పోర్టులో పోలీసులు ఆయనను ప్రశ్నించడంతో ఈ విషయం బట్టబయలైంది.

పానుగంటి చైతన్యను కస్టడీకి ఇవ్వండి

» కోర్టులో పోలీసుల పిటిషన్

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అత్యంత కీలకమైన నిందితుల్లో ఒకరైన పానుగంటి చైతన్యను విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు పది రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ మంగళవారం మంగళగిరి రూరల్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చైతన్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం విదితమే. ఆయన సోమవారం కోర్టులో లొంగిపోగా, మేజిస్ట్రేట్ 14 రోజులు అనగా ఈ నెల 28 వరకు రిమాండ్ విధించారు. ఆ తర్వాత ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలోనే చైతన్య కస్టడీని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

త్వరలో బెంగళూరుకు ఎయిర్ టాక్సీలు

» నిమిషాల వ్యవధిలో గమ్యస్థానాలకు..

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాలలో ఒకటైన బెంగళూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఐటీ కంపెనీలు ఉండే ఎలక్ట్రానిక్ సిటీ, హెచ్‌ఏఎల్‌తో పాటు ఇతర ప్రముఖ సంస్థలు ఉండే ఇందిరానగర్ ప్రాంతం నుంచి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోవాలంటే రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. ఇకపై ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సరళ ఏవియేషన్ సీఈఓ ఆండ్రియన్ శీమర్ తెలిపారు. ఈ దిశగా బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌తో ఒప్పందం చేసుకునేందుకు సరళ ఏవియేషన్ సిద్ధమైంది. దేశంలో తొలి ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (ఇవిటోల్) ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఆ సంస్థ సమకూర్చనుంది. ఇవి సుస్థిరమైన విమాన సేవలకు అనుగుణంగా ఉంటాయని శ్రీమర్ ప్రకటించారు. ఇందిరానగర్ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు గంటన్నర నుంచి కనీసం 2గంటల సమయం పడుతుండగా.. ఇకపై నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చని ఆయన అన్నారు.

ఎంఎస్ఎంఈల ద్వారా యువతకు ఉపాధి: శివశంకర్

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈల ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల ద్వారా ఉద్యోగాల కల్పనతోపాటు యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఎక్సైజ్ శాఖలో జేసీల బదిలీలు

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో డిస్టిలరీస్ విభాగం జాయింట్ కమిషనర్‌గా టి.నాగలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు జాయింట్ కమిషనర్ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జేసీ అడ్మిన్‌గా బి.అరుణ్‌రావు, ఏపీఎస్‌బీసీఎల్ జీఎంగా వి.అనసూయదేవిని బదిలీ చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో 'మహా'పోరాటం

కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలు ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేదశలో, జార్ఖండ్‌లో నవంబరు 13, 20వతేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. 288 శాసనసభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబరు 26తో గడువు ముగియబోతుంటే, 81 స్థానాలున్న జార్ఖండ్ శాసనసభ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం మహారాష్ట్రని మూడుపార్టీల 'మహాయుతి' సంకీర్ణం ఏలుతూంటే, జార్ఖండ్‌లో జెఎంఎం–కాంగ్రెస్ కూటమి అధికారంలో ఉంది. హర్యానాలో ఘనంగా గెలవగలనని అనుకొని, ఘోరంగా దెబ్బతిన్న కాంగ్రెస్‌కు మహారాష్ట్ర ఎన్నికలు మరో అగ్నిపరీక్ష. ప్రత్యర్థి పార్టీలను చీల్చి దక్కించుకున్న మహారాష్ట్రను మరోవిడత నిలబెట్టుకోవడం బీజేపీకి మహాపరీక్ష.

ఎదురుగాలులు వీస్తున్నాయని అనుకున్న హర్యానాలో మూడోసారి ధాటీగా అధికారంలోకి రావడంతో బీజేపీ మంచి ఉత్సాహం మీద ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి తీవ్ర నిరాశను మిగల్చి, సొంత కాళ్ళమీద నిలబడలేకుండా చేసిన నేపథ్యంలో, హర్యానా మానసికంగా మంచి శక్తినీ ఉత్తేజాన్ని ఇచ్చింది. అయితే, మొన్నటి లోక్‌సభ ఎన్నికల సందర్భంలో 48స్థానాలున్న మహారాష్ట్రలో మహాయుతి కూటమి 17 మాత్రమే నెగ్గిన విషయం తెలిసిందే. ఇందులో తొమ్మిది బీజేపీవి. సరిగ్గా ఐదేళ్ళక్రితం అప్పటి శివసేన–బీజేపీ కూటమి 41స్థానాలు గెలుచుకొని, అందులో 23 బీజేపీ వాటాగా ఉన్న స్థితిని దృష్టిలో పెట్టుకుంటే, అనంతరకాలంలో రాష్ట్రంలోని రెండు ప్రధాన పక్షాలైన శివసేన, ఎన్సీపీలను ముక్కలు చేసి, ఆ చీలికలతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ పట్ల ప్రజలు సానుకూలంగా లేరని అర్థం. శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ షిండే దేశవ్యాప్తంగా వెన్నుపోటు రాజకీయాలకు ప్రతీకగా నిలిచిపోయారు. ఆ తరువాత శరద్‌పవార్‌నుంచి చీలిన అజిత్‌పవార్‌కు కూడా బీజేపీ అధికారంలో వాటా ఇచ్చింది. ఎన్నికల సంఘం దగ్గరా, న్యాయస్థానాల్లోనూ ఉద్ధవ్ ఠాక్రే, శరద్‌పవార్‌లు ఓడినప్పటికీ, మొన్న జూన్‌లో ప్రజాక్షేత్రంలో వారికి మంచి ఊరట దక్కింది. ఇక, వరాల వరదతో మహారాష్ట్రను ముంచెత్తుతున్న బీజేపీకి రాబోయే ఎన్నికలు పెద్ద పరీక్ష. బీజేపీ–షిండే మధ్య విభేదాలు ఉన్నాయని, అజిత్ పవార్ మళ్ళీ వెనక్కుపోతారని ఏవో వార్తలు వినబడుతున్నప్పటికీ, మహాయుతి ఆదినుంచీ సంఘటితంగానే వ్యవహరిస్తున్నది. వేలకోట్ల విలువైన ప్రాజెక్టులు, పథకాలతో ఉద్ధవ్, శరద్‌ల మీద ప్రజలకున్న సానుభూతిని తుడిచిపెట్టేసే ప్రయత్నమైతే చేస్తున్నది.

హర్యానాలో గెలిచివుంటే కాంగ్రెస్‌కు బేరసారాలు ఆడగలిగే శక్తి ఉండేదని, మహావికాస్ అగాడీలో దానిమాట చెల్లేదని, ఇప్పుడు సీట్లసర్దుబాటు చర్చల్లో కాంగ్రెస్‌ది పైచేయి కాలేదని విశ్లేషణలు సాగుతున్నాయి. అంత అహంకారం పనికిరాదనో, మిత్రులను విస్మరిస్తే ఇలాగే జరుగుతుందనో హర్యానా ఓటమి నేపథ్యంలో ఇండియా బ్లాక్ పార్టీలు కాంగ్రెస్ మీద విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఉద్ధవ్ ఠాక్రే కూడా ఓ నాలుగు మాటలు ఎక్కువే విసిరి కాంగ్రెస్ చేతులు కట్టేసే ప్రయత్నం చేశారు. మహావికాస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉద్ధవ్ ఠాక్రేను ముందే ప్రకటించాలన్న అంశంతో సహా శరద్ పవార్ పార్టీ, కాంగ్రెస్‌ల ముందు శివసేన ఉంచుతున్న డిమాండ్లు చాలా ఉన్నాయట. మూడు పార్టీల మధ్యా సీట్ల సర్దుబాటు చర్చలు తీవ్రస్థాయిలో ఉద్రిక్తంగా సాగుతున్నాయని వార్తలు వినబడుతున్నాయి. ఇచ్చిపుచ్చుకోవడాల్లో ఎంతోకొంత రాజీపడి, అతిత్వరగా ఆ ప్రక్రియ ముగించి, సంఘటితంగా కదనరంగంలోకి దిగి పోరాడాల్సిన అవసరం ఉందని హర్యానా ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో ఎక్కువ ఎంపీసీట్లు గెలుచుకోవడంతో మహావికాస్ అగాడీలోని మూడుపార్టీలకు ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం పతనం ఆరంభమైందని, మహారాష్ట్రీయులు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతిని మట్టిలో కలిపేస్తారని వారంతా భీకర ప్రకటనలు చేశారు. కానీ, లోక్‌సభ ఎన్నికల్లో అద్భుతం జరిగినంత మాత్రాన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు బ్రహ్మరథం పడతారన్న గ్యారంటీ ఏమీలేదు. హర్యానా ప్రజలు ఈ రెండు సందర్భాల్లోనూ విభిన్నంగా ఓటేసిన విషయాన్ని మహావికాస్ నేతలు మరిచిపోకూడదు.

కెనడా రాజకీయాలలో సిక్కులు ఒక బలమైన వర్గంగా అవతరించడమే కాకుండా అక్కడి ప్రభుత్వ విధానాలను సైతం ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు. ఖలిస్తాన్ వాదాన్ని ఇంకా సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న కొన్ని దుష్ట శక్తులకు కెనడా ఒక ఆలంబనగా మారుతున్నది. ఈ నేపథ్యంలో తమ దేశ పౌరులు అయిన సిక్కు ఓటర్లను ఆకట్టుకోవడానికి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అవలంబిస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాల పర్యవసానాలు భారత్‌కు ఒక సవాల్‌గా మారాయి.

భారత్ – కెనడా దౌత్య దుమారం

ప్రవాస భారతీయుల సంఖ్య పరంగా కొన్ని కీలక దేశాలలో కెనడా ఒకటి. ఈ దేశం ఇటీవల భారత్‌తో వ్యవహరిస్తున్న తీరు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. భారతదేశం గానీ మరే దేశం గానీ రాయబారి స్థాయి దౌత్యవేత్తను వెనక్కి రప్పించడమనేది చాలా అరుదైన వ్యవహారం. భారత్ ఇప్పుడు అటువంటి అరుదైన నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితిని కెనడా సృష్టించింది.

విస్తృత ఉపాధి, వాణిజ్య అవకాశాలకు అదనంగా సులభతరంగా లభించే శాశ్వత నివాస సదుపాయం వలన ప్రపంచవ్యాప్తంగా విద్యార్థి వీసాలపై కెనడాకు వెళ్లే వారి సంఖ్య పెరిగిపోతోంది. కెనడాలోని మొత్తం విదేశీ విద్యార్థులలో భారతీయుల సంఖ్య 40 శాతం కాగా వారిలో ఒక్క పంజాబ్‌కు చెందిన విద్యార్థులే 65 శాతానికి పైగా ఉన్నారు. మాతృభూమి పంజాబ్ తర్వాత సిక్కులు అధిక సంఖ్యలో నివసిస్తున్న దేశం కెనడా కావడం విశేషం. ఉత్తర అమెరికా ఖండంలో శాశ్వత నివాసానికి భారతీయ యువతకు కొంత కాలం క్రితం వరకు ఆశల గమ్యస్థానంగా ఉన్న కెనడా వాస్తవానికి ఒక శతాబ్దికి పైగా పంజాబీల ఆశల సౌధం. బ్రిటిష్ వలస పాలకుల హయాం నుంచి నేటి వరకు కెనడాకు సిక్కుల వలసలు నిరంతరాయంగా జరుగుతూనే ఉన్నాయి. పంజాబ్ రాజకీయాలలో కెనడాలోని ప్రవాసులు పరోక్షంగా కీలక పాత్ర పోషించడం కద్దు. అకాలీదళ్, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలలో వీరి పాత్ర చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది.

గల్ఫ్ లేఖ

కెనడా రాజకీయాలలో సిక్కులు ఒక బలమైన వర్గంగా అవతరించడమే కాకుండా అక్కడి ప్రభుత్వ విధానాలను సైతం ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు. ఖలిస్తాన్ వాదాన్ని ఇంకా సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న కొన్ని దుష్ట శక్తులకు కెనడా ఒక ఆలంబనగా మారుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ దేశ పౌరులు అయిన సిక్కు ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నంలో భాగంగా కెనడా నేత జస్టిన్ ట్రూడో అవలంబిస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాలు భారత్‌కు ఒక సవాల్‌గా మారాయి. దౌత్యనీతి సంప్రదాయాలు పక్కదారి పడుతున్నాయి.

అంతర్జాతీయ దౌత్య మర్యాదలు, మన్ననలను పాటిస్తూ భారత్ హుందాగా వ్యవహరిస్తున్నది. అయితే అందుకు భిన్నంగా కెనడా దూకుడుగా వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదు. సాధారణంగా భద్రతాపరమైన అంశాలను ఇరు దేశాలు బహిర్గతం



చేయవు. చివరకు భారత్, పాకిస్తాన్‌లు కూడా ఈ విషయంలో ఒకింత లక్ష్మణరేఖకు లోబడి వ్యవహరిస్తాయి. మరి కెనడా ప్రధాని దౌత్య మర్యాదలు విడనాడి వ్యవహరిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

కెనడాలోని ఒక గురుద్వారా ఆవరణలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు గురయ్యాడు. ఆ హత్య కేసులో కొందరు సీనియర్ భారతీయ దౌత్యవేత్తల గురించి ప్రస్తావిస్తూ కెనడా విదేశాంగ శాఖ చేసిన వ్యాఖ్యలకు ఒక్క భారతదేశం మాత్రమే కాదు, అంతర్జాతీయ దౌత్యవర్గాలూ ఉలిక్కిపడ్డాయి. ఈ పరిస్థితులలో భారత రాయబారితో సహా కొందరు కీలక దౌత్య వేత్తలను వెనక్కి రప్పించడం, భారత్‌లోని కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించడం మినహా న్యూఢిల్లీకి గత్యంతరం లేకపోయింది. విదేశాలలోని భారతీయ ఎంబసీలలో నిఘా సంస్థ 'రా' అధికారులు పని చేస్తుండటం మామూలు విషయమే. అసలు అన్ని దేశాలలోని ఎంబసీలలో కొందరు అధికారులు ఆయా దేశాల నిఘా విభాగం పక్షాన పని చేస్తుంటారు. కెనడాలోని భారతీయ ఎంబసీలో పని చేసే పంజాబ్ పోలీసు శాఖకు చెందిన ఒక అధికారి పేరును కూడ ఈ హత్య కేసులో కెనడా ప్రభుత్వం మీడియాకు వెల్లడించింది. ఇది దౌత్య మర్యాదలను పూర్తిగా ఉల్లంఘించడమే, సందేహం లేదు.

సామాజిక మాధ్యమాల వినియోగం విస్తృతంగా పెరిగిపోతుండగా వాటిని అన్ని మతాల దురభిమానులు, ఛాందసవాదులు గరిష్ఠంగా వినియోగించుకుంటున్నారు. ఇందుకు సిక్కులూ మినహాయింపు కాదు. అయితే దుబాయిలో మాములుగా పని చేసుకునే అమృత్‌పాల్ సింగ్ అనే ఒక ఖలీస్తాన్ వాది, 'వారిస్ దే' అనే పంజాబీ సంస్థను నడుపుతూ సిక్కు యువతను విశేషంగా ఆకర్షించిన వైనం శుభ పరిణామంగా కనిపించలేదు. అనతికాలంలోనే సదరు యువకుడు పంజాబ్ నుంచి లోక్‌సభకు పోటీ చేసి విజయం సాధించాడు. దీంతో ఖలిస్తాన్ వాదం మళ్లీ ఊపిరిపోసుకుంటుందనే ఆందోళన మొదలయింది. మత ఛాందసవాద సిక్కులలో ఖలిస్తాన్ సానుభూతిపరులు ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ఉన్నారు. కెనడా, ఇతర పాశ్చాత్య దేశాలలో వారికి మద్దతుదారులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఖలిస్తానీ వాదులకు ఇప్పటికీ ఒక స్థావరంగా ఉన్న కెనడాలో ఓట్ల రాజకీయాల కారణాన పరిస్థితులు భారత్‌కు వ్యతిరేకంగా పరిణమిస్తున్నాయి. విదేశీ గడ్డను ఉపయోగించుకుంటూ స్వదేశంలో ఓట్లను పండించుకోవడం నరేంద్ర మోదీతో సహా ఇతర దేశాల నాయకులకూ తెలుసు. ట్రూడో 2018లో భారత్ పర్యటనలో భాగంగా అమృత్‌సర్‌లోని స్వర్ణాలయాన్ని కుటుంబ సభ్యులతో సహా సందర్శించారు. ఆ సందర్భంగా ట్రూడోతో పాటు ఆయన కుటుంబ సభ్యులు సంప్రదాయ పంజాబీ వస్త్రాలను ధరించారు. కెనడాలోని సిక్కు ఓటర్లను ఆకట్టుకునేందుకే వారు అలా వ్యవహరించారని మరి చెప్పనవసరం లేదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ మేధావుల త్యాగాలు వృథా అవుతాయా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కొందరు కొన్ని జీవితాలను ఎందుకు ఎంచుకుంటారో తెలియదు. మూడు దశాబ్దాల క్రితం ఢిల్లీలో ఖల్సా కాలేజీలో విద్యార్థులకు ఆర్థిక శాస్త్రం బోధించే సివి సుబ్బారావు అక్కడితో సరిపెట్టుకోకుండా పౌరహక్కుల ఉద్యమంలో విస్తృతంగా పనిచేసేవారు. ఎమర్జెన్సీలో అనేకమంది నేతలతో పాటు అరెస్టయిన వారిలో సుబ్బారావు ఒకరు. విశాఖపట్టణంకు చెందిన సుబ్బారావు ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రజాందోళనల గురించి మాత్రమే కాదు. దేశంలో ఎక్కడ ప్రజలకు సామూహికంగా ఏ అన్యాయం జరిగినట్లు సమాచారం వచ్చినా నిజనిర్ధారణ కమిటీల పేరుతో టీమ్‌ను వేసుకుని వెళ్లి ప్రజలను కలుసుకుని నివేదికలు సమర్పించేవారు. 1984లో సిక్కుల ఊచకోత జరిగినప్పుడు సుబ్బారావు సారథ్యంలో ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు సేకరించిన పౌరహక్కుల సంఘాలు 'ఎవరు నేరస్థులు' అన్న శీర్షికతో నివేదిక ప్రచురించాయి. అందులో ఢిల్లీ కాంగ్రెస్ నేతలు జరిపిన దారుణాలను పూసగుచ్చినట్లు వివరించారు. సిక్కుల ఊచకోతపై ఇప్పటికీ ఈ నివేదికలోనే సాధికారిక సమాచారం లభిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనపై నిష్పాక్షికంగా, ఇరువైపులా వాస్తవాలను పరిశీలించాలనే విషయంలో సుబ్బారావుకు, బాలగోపాల్‌కు ఒకే రకమైన అభిప్రాయాలు ఉండేవి. సుబ్బారావు పౌరహక్కుల మీద కాకుండా రాజకీయార్థిక శాస్త్రం, సాహిత్యంపై దృష్టి కేంద్రీకరించి ఉంటే అద్భుతమైన రచనలు వచ్చేవి. ఆయన 'విభాత సంధ్యలు' ఇప్పటికీ సాహిత్య విద్యార్థులకు ఒక ప్రామాణిక గ్రంథం. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా 24గంటలు పనిచేయడం, విస్తృత పర్యటనలు చేయడం మూలంగా ఆయన 1994లో గుండెపోటుతో మరణించారు. ఢిల్లీ విద్యుత్ శ్మశానవాటికలో ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగినప్పుడు వందలాది విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు.

యలవర్తి నవీన్ బాబు (బాపట్ల ప్రాంతీయుడు) ఢిల్లీ జెఎన్‌యులో పిహెచ్‌డి చేస్తూ ఉండేవారు. 'వర్ణం నుంచి జాతి వరకు' అనే ఒక అద్భుతమైన పరిశోధనా పత్రాన్ని ఆయన వెలువరించారు. ఋగ్వేద కాలం నుంచి ఇప్పటి వరకు వర్ణ వ్యవస్థను ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామంలో భాగంగా ఆయన ఈ పుస్తకంలో వివరించారు. నవీన్ బతికి ఉంటే ఇంకా ఎన్ని ఉత్తమ రచనలు చేసేవారో కదా. ఉన్నట్లుండి ఆయన విశాఖపట్టణం సమీపంలోని ఒక గ్రామంలో 2000 సంవత్సరంలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించారని ఒక రోజు పేపర్లో వార్త చదివి దిగ్భ్రాంతి చెందాను.

ఢిల్లీలో నిజాముద్దీన్ ప్రాంతంలో ఒక చిన్న గదిలో బిడి శర్మ అనే మాజీ ఐఏఎస్ అధికారి నివసించేవారు. మాథమెటిక్స్‌లో పిహెచ్‌డి చేసిన ఆయన సివిల్ సర్వీస్‌కు ఎంపికై బస్తర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఒక దశలో కరువు పరిస్థితుల్లో ఎవరి ఆదేశాలకోసం ఎదురు చూడకుండా ఫుడ్ కార్పొరేషన్ గోదాములు తెరిపించి అన్నార్తులకు ఆహార ధాన్యాలు సరఫరా చేయించారు. జాతీయ షెడ్యూల్డు కులాలు, జాతుల కమిషన్ కమిషనర్‌గా ఆయన ప్రచురించిన అద్భుతమైన నివేదికలే అణగారిన వర్గాల కోసం సబ్ ప్లాన్ వంటి పలు విధాన నిర్ణయాలు చేసేందుకు కారణమయ్యాయి. పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ బస్తర్‌కు వెళ్లి ఆదివాసుల హక్కుల కోసం 'భారత్ జనాందోళన్' అనే సంస్థ ప్రారంభించి అనేక ఆందోళనలు నిర్వహించారు. స్లీపర్ క్లాసు రైళ్లలో, సిటీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తూ తన ఆదాయమంతా ఆదివాసీల కోసమే ఖర్చు చేసేవారు. 2012లో సుకుమా జిల్లా కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను నక్సలైట్లు కిడ్నాప్ చేసినప్పుడు ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి ఆయనను విడుదల చేయించడంలో కీలకపాత్ర పోషించారు. 2015లో శర్మ మరణించారు.

ఆరోగ్య, వైద్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన డాక్టర వినాయక్ సేన్ జెఎన్‌యులో సోషల్ మెడిసిన్, కమ్యూనిటీ హెల్త్ కేంద్రంలో ఫ్యాకల్టీ సభ్యుడుగా ఉండేవారు. తర్వాత ఈ ఉద్యోగాన్ని వదులుకుని పౌర హక్కులకోసం పని చేయడం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌కు వెళ్లి తన భార్య డాక్టర్ ఇలీనా సేన్‌తో కలిసి 'రూపాంతర్' అనే ఎన్జీవో స్థాపించి అనేక గ్రామాల్లో మద్యపానానికి, స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించారు. ఆదివాసీల్లో పోషకాహార విలువల లేమిపై ఆందోళన వ్యక్తం చేసేవారు. పేద ప్రజలకోసం ఆసుపత్రి స్థాపించారు. 2000లో ఛత్తీస్‌గఢ్ ఏర్పడినప్పుడు ఆయనను ఆరోగ్య వ్యవహారాలపై ప్రభుత్వ సలహాదారుగా ఉండమని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. 2005లో ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లకు వ్యతిరేకంగా సల్వాజుడుం ప్రారంభించినప్పుడు ఆయన దానివల్ల జరుగుతున్న దారుణాలను వెలుగులోకి తీసుకు రావడం ప్రారంభించారు. ఇదే ఆయన అరెస్టుకు కారణమైంది. తాను సల్వాజుడుంతో పాటు మావోయిస్టుల హింసాకాండను కూడా ఖండించానని చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఆయనను సుప్రీంకోర్టు బెయిల్‌పై విడుదల చేసింది. ఆయన విడుదలైన రెండేళ్లకు 2007లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించారు.

మరో మేధావి బాలగోపాల్. ఢిల్లీలో స్లీపర్ క్లాస్ కోచ్ దిగి కనీసం పది మైళ్ల నడుస్తూ ఇంటికి వచ్చేవారు. ఎప్పుడో ఉతికినట్లున్న షర్టు, అరిగిన చెప్పులు. వచ్చీ రాగానే తన బ్యాగులోంచి పాత టైప్ మిషన్ తీసి ఏదో నిజనిర్ధారణ కమిటీ నివేదిక టైప్ చేయడం మొదలు పెట్టేవారు. ఆయన కూడా జెఎన్‌యులో చదివినవారే. బహుముఖ ప్రతిభాశాలి అయిన బాలగోపాల్ ఏ రంగంలో ప్రవేశించినా ఉన్నత ఫలితాలు సాధించగలిగేవారు. కాని ఆయన మానవ హక్కుల రంగాన్ని కోరుకున్నారు. గ్రామ గ్రామాలూ తిరిగారు. మావోయిస్టుల్లోని చీకటి కోణాలనూ ప్రశ్నించారు. 'ఒక నాగరిక సమాజంలో మనిషి నేరస్థుడని నిరూపించేంతవరకూ అతడు మనిషిగా అన్ని హక్కులు అనుభవించాలి. ప్రజాస్వామ్యమంటే ఓట్లు వేయడం మాత్రమే కాదు. అది ఒక జీవన విధానంగా ఉండాలన్నదే నా ఆకాంక్ష' అన్న బాలగోపాల్ కొన్ని ఉన్నతమైన విలువలకోసం పోరాడారు. కాని ఆ విలువలను ఇవాళ న్యాయస్థానాలు కూడా పాటించలేకపోతున్నాయి.

వీరందరి కోవకు చెందిన మేధావే రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో మరణించిన అమలాపురానికి చెందిన జీఎన్ సాయిబాబా. వినాయక్ సేన్ మాదిరే ఆయననూ మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అరెస్టు చేశారు. ఇద్దరి వద్దా కీలకమైన హార్డ్ డిస్కులు లభించాయని పోలీసులు ఆరోపించారు. ఇద్దరి విషయంలోనూ అంతర్జాతీయ సంస్థలు



అసలు సాయిబాబా ఢిల్లీలో మంచి అధ్యాపకుడుగా కొనసాగుతూ ఉండకుండా మానవ హక్కులు, ఆదివాసీ పోరాటాలు అంటూ ఎందుకు ప్రభుత్వ వ్యతిరేకతను కొని తెచ్చుకోవాల్సి వచ్చింది? సాయిబాబా మాత్రమే కాదు, బాలగోపాల్, సుబ్బారావు, నవీన్, బిడి శర్మ, వినాయక్ సేన్, సుధా భరద్వాజ్ లాంటి వారు ఎందుకు తాము కోల్పోయిన వ్యక్తిగత జీవితాలను పట్టించుకోకుండా ప్రజల హక్కుల కోసం పోరాడాలని అనుకున్నారు?

తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అయితే సాయిబాబా తీవ్ర అంగ వైకల్యానికి గురికావడం, అనేక ఆరోగ్యసమస్యలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన పట్ల అమానుషంగా వ్యవహరించారని ప్రభుత్వ సంస్థలు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నాయి. దాదాపు పదేళ్ల జైలులో ఉన్నా, ఆయనపై ఆరోపణలను రుజువు చేయలేకపోయారు. సాయిబాబాకు ఒక సమయంలో బెయిల్ వచ్చినప్పటికీ సుప్రీంకోర్టు ఆగమేఘాలపై శనివారం నాడు కూడా విచారణ జరిపి బెయిల్ నిరాకరించింది. సాయిబాబా ఉదంతం నేర న్యాయ వ్యవస్థలో ఉన్న లోపాలను వెల్లడించింది. న్యాయ వ్యవస్థ తీరుతెన్నులను కూడా ప్రశ్నార్థకం చేసింది. జైళ్లలో కులాల ఆధారంగా పనులు కేటాయించాలని బ్రిటిష్ కాలం నాటి జైళ్ల మ్యాన్యువల్స్‌లో ఉన్న నిబంధనలను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తాజాగా తీర్పునివ్వడం సాయిబాబా జైళ్లలో కుల వ్యవస్థ గురించి చెప్పిన విషయాలు నిజమేనని రుజువు చేశాయి. అసలు సాయిబాబా అంగవైకల్యాన్ని తట్టుకుని ఢిల్లీలో మంచి అధ్యాపకుడుగా కొనసాగుతూ ఉండకుండా మానవ హక్కులు, ఆదివాసీ పోరాటాలు అంటూ ఎందుకు ప్రభుత్వ వ్యతిరేకతను కొని తెచ్చుకోవాల్సి వచ్చింది? సాయిబాబా మాత్రమే కాదు, బాలగోపాల్, సుబ్బారావు, నవీన్, బిడి శర్మ, వినాయక్ సేన్, సుధా భరద్వాజ్ లాంటి వారు ఎందుకు తాము కోల్పోయిన వ్యక్తిగత జీవితాలను పట్టించుకోకుండా ప్రజల హక్కుల కోసం పోరాడాలని అనుకున్నారు?

మేధావులను అరెస్టు చేయడం, మావోయిస్టులతో వారికి సంబంధాలను నిరూపించే ప్రయత్నం చేయడం, మావోయిజాన్ని తుదముట్టించాలనుకోవడం బీజేపీ హయాంలో ప్రారంభమైంది కాదు. 2013లోనే సాయిబాబా ఢిల్లీ నివాసంలో గడ్చిరోలి పోలీసులు వచ్చి సోదా చేశారు. అదే క్రమంలో ఆయనకు వ్యతిరేకంగా కేసు నమోదు చేశారు. సాయిబాబాకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసిన అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీయే మావోయిస్టులను ఉక్కుపాదంతో అణిచివేయాలని పిలుపునిచ్చారు. హోంమంత్రిగా చిదంబరం ఉన్న కాలంలో ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరిట మావోయిస్టుల నిర్మూలన ప్రారంభమైంది. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మావోయిజాన్ని 'దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా' ప్రకటించారు. ఇప్పుడు హోంమంత్రి అమిత్ షా ఒక డెడ్‌లైన్ పెట్టుకుని ప్రయత్నిస్తున్నారు. గతంలో కంటే ఎక్కువగా ఇప్పుడు రాష్ట్రాల మధ్య సమన్వయం, సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించడం పెరిగింది. అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా మావోయిస్టుల పట్ల వైఖరి మారే అవకాశాలు లేవు. అదే సమయంలో ప్రజలకు ఆహార ధాన్యాలు ఉచితంగా సరఫరా చేయడం, పింఛన్ల పేరిట నిధులు మంజూరు చేయడం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం కూడా కేవలం ఓటు బ్యాంకు దృష్టితో కాకుండా వారిలో అశాంతి పెరగకుండా ఉండేందుకేనన్న విషయం గమనించాలి.

అయినా జీవితాలను త్యాగం చేసే మేధావులు ఏ పరిష్కారాలను సూచిస్తున్నారు? కుప్పలు తెప్పలుగా చెట్ల ఆకుల మధ్య కూలిపోయిన యువతీ యువకుల తెరుచుకున్న కళ్లు ఏ ప్రపంచాన్ని ఆశిస్తున్నాయి? నిరంతరం ఇరువైపులా కొనసాగుతున్న హింసవల్ల సమాజంలో ఏ మార్పు జరుగుతున్నదో ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఒకే రోజు 30 మంది మరణించినా కనురెప్ప కూడా తడవని పరిస్థితి ఏర్పడుతోంది. సుదీర్ఘకాలంగా జరుగుతున్న ఈ పరస్పర హననానికి విరామం పలికి ఆచరణసాధ్యమైన పరిష్కారాల కోసం ప్రయత్నించాల్సిన తరుణం ఆసన్నమైంది. పరిష్కారాల గురించి ఆలోచించకుండా కేవలం సమస్యలపైనే ఆలోచించలేమని బాలగోపాల్ ఊరికే అనలేదు.


(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

హృదయ రక్షకుడు డాక్టర్ వేణుగోపాల్

కొందరుంటారు. ఎన్నో అరుదైన విలువలతో జీవితాన్ని గడుపుతూ నిరాడంబర వ్యక్తిత్వంతో ఎంతో మందిని ప్రభావితం చెయ్యగలుగుతారు. సమాజంలో తమదైన ముద్ర వెయ్యగలుగుతారు. ఎంత నిగర్వంగా, నిబద్ధతతో జీవితాన్ని గడపగలరో అంత నిశ్శబ్దంగా నిష్క్రమించగలరు కూడా. నేనెరిగిన డాక్టర్ పాణింగపల్లి వేణుగోపాల్ అలాంటి వ్యక్తి. 1942 జూలై 6న జన్మించి, 82 సంవత్సరాల వయస్సులో ఈ అక్టోబర్ 8న కాలధర్మం చెందారు. నాతో ఆయన పరిచయం కేవలం ఒక డాక్టర్‌గానే అయినప్పటికీ దగ్గర నుంచి ఆయన పనితీరుని గమనించటం సందర్భపడింది కాబట్టి, ఈ నివాళి ఆయనకివ్వడం అవసరమని భావిస్తున్నాను. ఆయనకి దక్కవలసిన గౌరవాన్ని తెలుగు జాతి గానీ, భారతదేశం గానీ ఇవ్వలేదని ఆయనని దగ్గరగా తెలిసిన వాళ్లందరూ భావిస్తారు.

దాదాపు నలభై ఏళ్లక్రితం... మావారికి ముప్పయ్యారేళ్ళ వయస్సులో మొదటిసారి గుండెపోటు వచ్చింది. ఆ వయస్సులో గుండెపోటు రావడం దురదృష్టమైతే, ఆ టైములో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌కి కూతవేటు దూరంలో ఉన్న ఐఐటి ఢిల్లీలో మావారు ప్రొఫెసర్‌గా పనిచెయ్యడం ఒక అదృష్టం. దేశ రాజధానిలో ఉద్యోగ రీత్యా చేరిన అనతి కాలంలోనే వృత్తిపరంగా ఎదిగినా, ఆరోగ్యపరంగా అనుకోని దెబ్బ తిన్నారు మావారు. వృత్తి రీత్యా వేణుగోపాల్ అప్పటికే పేరెన్నికగన్న గుండెజబ్బుల శస్త్రవైద్యనిపుణులు. మొదటగా ఒక తెలుగువారే అయిన డాక్టర్ శ్రీనాథరెడ్డి గుండె వైద్య నిపుణులు కాబట్టి, వారి దగ్గరికి వెళ్లేవాళ్లం. దాదాపు రెండేళ్ల తర్వాత ఆయన సలహానుసరించి వేణుగోపాల్‌ని కలిసాం. అయిదు బ్లాకులున్నాయని వెంటనే ఆపరేషన్ చెయ్యడం అత్యవసరమనీ చెప్పారు. అలా మొదలైంది మా పరిచయం. మావారు సెమిస్టర్ పూర్తవగానే ఆపరేషన్ చేయించుకుంటానని చెపితే, అంత సమయం వేచి ఉండవద్దని గట్టిగా చెప్పారు.

ఆ వయస్సులో హార్ట్ అటాక్ అంటే ఐఐటీలో కొంత మంది మిత్రులు కంగారుపడి మాకు తెలియకుండానే అమెరికా తీసుకెళ్లవచ్చా అని అడిగారని సందేహించిన డా. వేణుగోపాల్, మావారికి వెంటనే ఆపరేషన్ చెయ్యకుండా వార్డ్‌లోనే ఉంచి ఆలోచించారు. తర్వాత వచ్చి డాక్టర్ మీద నమ్మకం ఉండటం పేషంట్‌కి ఎంత ముఖ్యమో, డాక్టర్‌కీ అంత ముఖ్యమే, మీకు ధైర్యంగా లేకపోతే అమెరికా వెళ్లి చేయించుకోండి అని చెప్పారు. మావారు నమ్మకంగా నా కేసు సీరియస్ అని తెలిశాక అమెరికా వెళ్లే ప్రసక్తిలేదు, పైగా అంత స్తోమత మాకు లేదని చెప్పారు. నమ్మకం కుదిరింది కాబట్టే వేణుగోపాల్ ఆపరేషన్ చేసారు. ముందు రోజు వచ్చి ప్రొసీజర్ అంతా డయాగ్రామ్ వేసి మా మామగారికి, మా వారికీ వివరించి చెప్పి, ఇక వర్రీ అవడం నా వంతు, మీరు రిలాక్స్‌డ్‌గా ఉండండి అని ధైర్యం చెప్పి వెళ్లారు. అప్పటికింకా బైపాస్ సర్జరీలు ప్రాచుర్యంలోకి రాలేదు. ఆ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఆయన అక్కడ ఎంతోమంది యువ వైద్యులకి శిక్షణ నిచ్చారు. క్రమశిక్షణకి పెట్టింది పేరు. అందరూ ఆయనంటే భయపడేవారు కాని, ఎదగాలంటే ఆయనని మించిన గురువు లేడని నమ్మిన ఎంతోమంది ఆయన వల్ల మంచి డాక్టర్లయి దేశవిదేశాల్లో విస్తరించారు. కెరియర్ మొత్తంమీద వేణుగోపాల్ 56 వేల ఆపరేషన్లు చేశారని, 26 గుండె మార్పిళ్లు చేశారని వికీపీడియా చెపుతోంది. దేశంలో మొట్టమొదటి గుండె మార్పిడి సర్జన్ వేణుగోపాల్. ఎంతో ప్రతిభావంతుడు. వ్యక్తిగతంగా కోపం ఎక్కువని అనుకునేవారు.



దేశంలో మొట్టమొదటి గుండె మార్పిడి సర్జన్ డాక్టర్ పాణింగపల్లి వేణుగోపాల్. ఎంతో ప్రతిభావంతుడు, క్రమశిక్షణకి పెట్టింది పేరు. డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఎంతో మంది యువ వైద్యులకి శిక్షణనిచ్చారు. ఎదగాలంటే ఆయనని మించిన గురువు లేడని నమ్మిన ఎంతో మంది ఆయన వల్ల మంచి డాక్టర్లయి దేశవిదేశాల్లో విస్తరించారు. మాట కరుకు అనిపించినా, మనస్సు మెత్తని డాక్టరని, ఆయన దగ్గర ట్రీట్‌మెంట్‌కి వెళ్లిన వారందరూ అంటారు.

అప్పుడు మేము దాదాపు నెల్లాళ్లు ఆస్పత్రిలో ఉన్నాం. ఒక అయిదునెలల పసిపాపని గుండె జబ్బుతో ఆస్పత్రిలో చేర్చుకుని, తొమ్మిదో నెల వచ్చేదాక అక్కడే వుంచి జయప్రదంగా ఆపరేషన్ చేసి ఇంటికి పంపారాయన. ఒక ఆరేళ్ల రాజమండ్రి పాపకి క్లిష్టమైన వాల్వ్ మార్పిడి ఆపరేషన్ చేశారు. విజయవంతంగా ఆయన నిర్వహించిన అరుదైన కేసుల గురించి వార్డుల్లో రౌండ్స్ కొచ్చిన డాక్టర్స్ చర్చించుకుంటుంటే విని ఒక రకంగా ఆయనంటే ఒక ఆరాధనాభావాన్ని పెంచుకున్నాం. అయితే ఆయనతో మాట్లాడే ధైర్యాన్ని ఎప్పుడు కూడగట్టుకోలేకపోయినా ఆయన మాత్రం దాదాపు ఒక 15–20 ఏళ్లు ఎప్పుడెళ్లినా ఆప్యాయంగా పలకరించేవారు. ఆయనని వదిలి వేరే ఏ డాక్టర్నీ సంప్రదించదలుచుకోక, ఎక్కడ ఎలాంటి ఆఫర్లు వచ్చినా మావారు వెళ్లటానికి ఇష్టపడలేదు.

తెలుగు వాళ్లందరూ గర్వించదగిన వ్యక్తి డాక్టరు వేణుగోపాల్. ఇంత గొప్ప విజయాలు సాధించిన వ్యక్తికి మన ప్రభుత్వాలు 'భారతరత్న'కి ప్రయత్నించలేదు సరికదా, ఆయన డైరెక్టర్‌గా వున్న రోజుల్లోనే రాజకీయ నాయకులకి తగినంత గౌరవమివ్వలేదనో, రిజర్వేషన్లని సమర్థించలేదనో ఎన్నో వివాదాలని ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది. 'పద్మ' అవార్డ్‌తో ఆయనని సత్కరించిన సర్కారే, సర్వీసు చివర్లో ఆయనని వెంటాడి, వేధించింది. చివరికి సుప్రీంకోర్టు ద్వారా ఆయన గౌరవప్రదంగా రిటైరయ్యారు. ప్రతిభని గుర్తించలేం, నిజాయితీని నిబద్ధతని గౌరవించలేం, పౌరులుగా ఎన్ని అన్యాయాలు జరుగుతున్నా మాట్లాడలేం అనిపించేది ఆ రోజుల్లో పేపర్లు చదువుతుంటే.

ఇక్కడ ఇంకొక విషయం గుర్తుచేసుకోవాలి. మావారికి ఆపరేషన్ చేసిన రోజు ఒక పార్లమెంట్ మెంబర్ తాను అమెరికాలో గుండె వైద్యం చేయించుకుంటానని, అందుకు అనుగుణంగా తగ్గ ట్రీట్‌మెంట్ ఇండియాలో లేదని సర్టిఫికెట్ ఇవ్వమని అడగటానికి డాక్టర్ వేణుగోపాల్ వద్దకు వచ్చారు. అప్పుడాయన, తాను ఆరు గంటలపాటు క్లిష్టమైన ఆపరేషన్ చేసిన పేషంట్ గురించి చెప్పి "అయిదు బ్లాకులు తొలగించాను. నాకు ఈ వైద్యం రాదని సర్టిఫికెట్ ఇస్తానా" అని అంతెత్తున మండిపడటం అందరూ చూశారు. ఈ రకమైన అవమానాన్ని సహించాల్సిన అవసరం ఆయనకి లేదు. ఏ రాజకీయ నాయకులకీ ఆయన బెదరడం ఎప్పుడూ చూడలేదు. అవసరాన్ని బట్టే అందరికీ టైమ్ ఇచ్చేవారు. బీదాబిక్కీనా లేక ధనవంతుడా అని ఆయన ఎప్పుడూ ఆలోచించలేదు. ఎన్నో చోట్ల నుంచి ఆఫర్స్ వచ్చినా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌లో వుంటే బీదవాళ్లకి వైద్యసేవలందించవచ్చని వాటిని వదులుకున్నారని ఆయనతో పని చేసిన వాళ్లు చెప్పేవారు. ఒక నిష్ణాగరిష్ఠుడైన డాక్టరుగా ఆయన్ని గుర్తుపెట్టుకోవడమే ఆయనకి మనం ఇవ్వగలిగిన నివాళి. మాట కరుకు అనిపించినా, మనస్సు మెత్తని డాక్టరని, ఆయన దగ్గర ట్రీట్‌మెంట్‌కి వెళ్లిన వారందరూ అంటారు. విద్యార్థిగా ఉత్తర భారతంలో ఎయిమ్స్‌లో చేరిన ఆయన... తాను పొట్టిగా వుండడం వల్ల బాగా ర్యాగింగ్‌కి గురయిన చోటే తన ప్రతిభతో డాక్టరయి సహచరుల, విద్యార్థుల గౌరవాన్ని పొందారు. ఎన్ని జీవితాల్ని డాక్టరుగా స్పృశించారో వారందరికీ ఒక జీవితకాలపు జ్ఞాపకంగా మిగిలిపోతారు.

■ డా. కల్లూరి శ్యామల

'నేను చావుని నిరాకరిస్తున్నాను'

ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేసిన జీఎన్ సాయిబాబా తెలుగు సమాజానికి మేధో చైతన్యాన్ని అందించినవారిలో ముఖ్యులు. మావోయిస్టు రాజకీయాలతో సంబంధం ఉన్నదన్న ఆరోపణతో నిర్బంధానికి గురయ్యారు. విచారణ లేని తొమ్మిదేళ్ల కఠిన ఏకాంత కారాగార శిక్షను అనుభవించారు. చివరికి నిరపరాధిగా గుర్తించబడి, శిథిల శరీరంతో ఈ ఏడాది మార్చిలో విడుదలయ్యారు. ఆర్నెల్లు తిరగకుండానే తిప్పుకోలేని అనారోగ్య సమస్యలతో మరణించారు. ఇది నిస్సందేహంగా ఫాసిస్టుకాలపు అసహజ మరణం. సహజ మానవ హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడుతూ నిలబడినందుకు అతి పెద్ద ప్రజాస్వామ్య భారతం, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ అతనికి విధించిన శిక్ష ఇది.

సాయిబాబా పదహారు పదిహేడేళ్ల వయసునుంచే ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ కనబరిచాడు. కారంచేడు ఘటన పరిణామాలు, దళిత ఉద్యమ నిర్మాణం దగ్గర నుంచి చూస్తూ ప్రశ్నించటం నేర్చుకొన్నాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిగా ప్రపంచంతో సంభాషణ ప్రారంభించి, పేద పీడిత వర్గాల స్వరంగా మారాడు. అఖిల భారత ప్రజాప్రతిఘటన వేదిక నిర్మాణ నిర్వహణలలో భాగమైనాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథంతో పనిచేశాడు. ప్రాంతాలు, దేశాల హద్దులు చెరిపేసి పీడిత జాతుల ఐక్యత కోసం, విముక్తి కోసం నిజమైన కమ్యూనిస్టుగా ఆలోచించాడు. అందులో భాగంగానే వరంగల్ కేంద్రంగా ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షను సామూహిక ప్రకటన చేసాడు. అభివృద్ధి పేర ఆదివాసీ హననానికి రాజ్యం రచించిన కుట్రలను ఎదుర్కొన్నాడు.

సాయిబాబా ఉద్యమకారుడే కాదు. ఆంగ్ల సాహిత్య విద్యార్థి, అధ్యాపకుడు కూడా. విద్యా విషయక ఆసక్తులను సామాజిక చైతన్యంతో సమ్మిళితం చేసి విద్యార్థుల హృదయాలను చూరగొన్న అధ్యాపకుడు. విశ్వవిద్యాలయాలను ప్రజాస్వామిక రాజకీయాలతో చైతన్యవంతం చేసిన సమూహంతో ఉన్నాడు. అందువల్లనే ప్రభుత్వం అతనిని 'అర్బన్ నక్సలైట్' అన్నది. దేశభద్రతకు ముప్పుగా చూపించి నిర్బంధించింది. ఉద్యోగం నుంచి తొలగించటానికి కారణమైంది. మొత్తంగా అతని కుటుంబాన్ని, కుటుంబ సంబంధాలను చిన్నాభిన్నం చేసింది.


సాహిత్యం ద్వారా ప్రపంచ మానవుల హృదయాలను ముట్టుకొని మరింత సున్నిత మానవుడైనాడు సాయిబాబా. గుగీ వా థియాంగో ఆయన అభిమాన రచయిత. ఆయన బాల్యజ్ఞాపకాలను తెలుగులోకి అనువదించాడు. ఒంటరి నిర్బంధంలో తనతో తాను మాట్లాడుకొనటానికి, కుటుంబంతో మాట్లాడటానికి, ప్రపంచంతో మాట్లాడటానికి కవి అయినాడు. బాల్యంలో పోలియో సోకి కలిగిన అంగ వైకల్యాన్ని జయించడానికి ఆయన మేధో సృజన శక్తులను బలంగా రూపొందించుకున్నారు. న్యాయస్థానాలు కూడా ఆలోచించగలిగిన, ప్రశ్నించగలిగిన ఆయన మేధో శక్తికే భయపడ్డాయి. అందుకే జైలు అధికారులు తమ నిర్లక్ష్యంతో సరైన సమయంలో తగిన వైద్య సహాయం అందించకుండా ఆయన శరీరాన్ని హింసకి గురి చేశారు. ఆ పరిస్థితులలో మరణపు అంచులను తాకుతూ కూడా చావును నిరాకరించే దృఢత్వం ఆయన సంతరించుకొన్నాడు.

చలికాలం తనని కోత పెట్టడం గురించి ఆయన తన సహచరికి రాసిన ఉత్తరం విషాద కావ్యమై ఎంతోమంది హృదయాలను కదిలించింది. కానీ రాజ్యాన్ని తాకలేకపోయింది. మృత్యువు గురించి ఆలోచిస్తూనే దానిని ఒరుసుకొంటూ జీవితాన్ని గురించి ఆలోచించే తాత్విక స్థాయిని అందుకొన్నాడు. "నేను చనిపోయేలా ఏం చేయాలో / వాళ్ళకి తెలియడం లేదు / ఎందుకంటే / నాకు మొలకెత్తే గడ్డి సవ్వడులు / చాలా ఇష్టం" అనగలిగిన నిర్భీతి సాయిబాబా సొంతం. ఈ మొత్తం క్రమంలో ఆయన చూపిన పోరాట పటిమ ఉన్నతం, ఉదాత్తం.

మరణించీ జీవితం పట్ల నమ్మకాన్ని, ఆశావహ దృష్టిని ఇచ్చి వెళ్లిన సాయిబాబా స్ఫూర్తి నిత్యం, నిరంతరం అని భావిస్తూ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆయన మరణానికి సంతాపం ప్రకటిస్తున్నది. సాయిబాబా సహచరి వసంతకు, కూతురు మంజీరకు, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

– ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక





దివి మిస్సైల్

నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రం పనులు పునఃప్రారంభం

దేశంలోనే రెండో మిస్సైల్ టెస్టింగ్ రేంజి ఇక్కడ ఏర్పాటు

- డీఆర్‌డీవోకు 381.61 ఎకరాలను కేటాయించిన నాటి సీఎం చంద్రబాబు
- సుమారు రూ.26 వేల కోట్ల ప్రాజెక్టుకు వైసీపీ పాలనలో ఆటంకాలు
- కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ పట్టాలెక్కిన అరుదైన ప్రాజెక్టు
- 10న ప్రధాని మోదీ నేతృత్వంలో సెక్యూరిటీ కమిటీ కౌన్సిల్ ఆమోదం

దేశ రక్షణ రంగానికి చెందిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రెండో మిస్సైల్ టెస్టింగ్ రేంజి(ఎంటీఆర్- క్షిపణి పరీక్ష కేంద్రం) నిర్మాణం కృష్ణాజిల్లా నాగాయలంక మండలంలోని గుల్లలమోదలో చేపట్టడంతో దివిసీమకు మహర్దశ పట్టనుంది. దేశ రక్షణ దృష్ట్యా వ్యూహాత్మక అవసరమైన ఈ ప్రాజెక్టుకు 15 ఏళ్ల కిందటే బీజం పడింది. ఇక్కడి వాతావరణ, భౌగోళిక పరిస్థితులు క్షిపణి పరీక్ష కేంద్రం నిర్మాణానికి అత్యంత అనుకూలం కావడంతో 2011లోనే కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్రం ఏర్పాటుకు 386 ఎకరాలు కావాలని డీఆర్‌డీవో కోరగా, 2017లో ఏటిమొగ రెవెన్యూ గ్రామ పరిధిలోని అభయారణ్యంలో 381.61 ఎకరాలను నాటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులతో పనులు ముమ్మరమవుతున్న తరుణంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపై తీవ్ర ప్రభావం చూపింది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం కావడంతో క్షిపణి పరీక్ష కేంద్రం ఆశలు చిగురించాయి. రాష్ట్ర అభివృద్ధిపై దూరదృష్టి కలిగిన సీఎం చంద్రబాబు కేంద్రం పెద్దలతో మాట్లాడి కీలకమైన ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించారు. ఈ నెల 10న ప్రధాని మోదీ నేతృత్వంలోని సెక్యూరిటీ కమిటీ కౌన్సిల్ ఈ కేంద్రం ఏర్పాటు ఆమోదం తెలిపింది.

8



గుల్లలమోదలో నిర్మించిన పరిపాలనా భవనం

15 ఏళ్ల ప్రణాళిక..



దేశంలో రెండో మిస్సైల్ టెస్టింగ్ రేంజి (ఎంటీఆర్) ఏర్పాటు ప్రతిపాదన ఇప్పటిది కాదు. గత 15 ఏళ్లుగా దీనిపై ప్రతిపాదనలు.. ప్రణాళికలు నడుస్తున్నాయి. గుల్లలమోదలో వాతావరణ, భౌగోళిక పరిస్థితులను పర్యావరణ మార్పులను అధ్యయనం చేస్తూ వచ్చాం. రేంజి సేఫ్టీ వంటి అంశాలను పరిశీలించాం. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని గుల్లలమోదని అత్యుత్తమ ప్రాంతంగా గుర్తించాం. ఇక్కడ రెండు మూడేళ్లలో క్షిపణి పరీక్ష కేంద్రం సిద్ధమవుతుంది.

- జి.సతీశ్‌రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్

ఇసుక రీచ్‌ల్లో తమ్ముళ్ల పాగా!



లోడింగ్, అన్‌లోడింగ్ టెండర్లకు పోటాపోటీ

- పామర్రులో రోడ్డెక్కిన ఇసుక పంచాయతీ
- ఇద్దరు అధికార పార్టీ నేతల నడుమ వివాదం
- ఓ నాయకుడికి వత్తాసు పలికిన ప్రజాప్రతినిధి

రెండు జిల్లాల్లో రీచ్‌లను పంచేసుకున్న తమ్ముళ్లు

ఇసుక దొరక్క, సామాన్యులు అల్లాడుతుంటే.. తమ్ముళ్లు మాత్రం ఇసుక రీచ్‌ల్లో లోడింగ్.. అన్‌లోడింగ్ కాంట్రాక్టుల కోసం రోడ్డెక్కుతున్నారు. ఎంత కావాలంటే అంత తవ్వుకుని సొమ్ము చేసుకునేందుకు ఈ టెండర్లు మంచి అవకాశం కావడంతో దక్కించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా ముందుకు వస్తే బెదిరింపులకు దిగుతున్నారు. సాధ్యమైనంత వరకు అధికార పార్టీ నాయకులే ఇసుక రీచ్‌ల్లో లోడింగ్ అన్‌లోడింగ్ టెండర్లను దక్కించుకున్నారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)
కృష్ణాజిల్లాలో పామర్రు, పెనమలూరు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, లంకపల్లి, శ్రీకాకుళం ఇసుక రీచ్‌లు ఇక్కడ ప్రధానమైనవి. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో పెద్ద ఇసుక రీచ్‌లు ఉన్నాయి. మొగలూరు, శనగపాడు, కీసర రీచ్‌లు ఇక్కడ ముఖ్యమైనవి. ఈ రీచ్‌ల్లో లోడింగ్.. అన్‌లోడింగ్ కాంట్రాక్టులకు సంబంధించి ఇటీవల టెండర్లు పిలిచారు. నదిలో కూలీలతో ఇసుక తవ్వించి, దాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసి, నది నుంచి ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్టాక్ పాయింట్‌లో అన్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్టాక్ పాయింట్ నుంచి లారీలోకి ఇసుక లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన టెండర్లలో పాల్గొనేందుకు తెలుగు తమ్ముళ్లు పోటీలు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితం చేయడంతో అధికార పార్టీ నాయకులకు ప్రధాన ఆదాయ వనరు లేకుండా పోయింది. దీంతో రీచ్‌ల్లో పాగా వేసేందుకు ఈ టెండర్లు మంచి అవకాశంగా వారు భావిస్తున్నారు. ఈ కాంట్రాక్టును దక్కించుకుంటే ఎంత కావాలంటే అంత ఇసుకను తవ్వుకోవచ్చన్న ఆశతో ఈ టెండర్లలో పాల్గొనేందుకు వేరే వారికి అవకాశం లేకుండా తమ్ముళ్లు బెదిరింపులకు దిగి అధికశాతం రీచ్‌లను తమ కైవశం చేసుకున్నారు.

పామర్రులో రోడ్డెక్కిన నేతలు

పామర్రులో పమిడిముక్కలకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఇసుక టెండర్లను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. వారిలో బెనర్జీ అనే నాయకుడు ఇసుక టెండరు వేయగా స్థానిక ప్రజాప్రతినిధికి సన్నిహితంగా ఉండే సురేశ్ అనే మరో నాయకుడు తాను కూడా టెండరు వేస్తానని, బెనర్జీ టెండర్ల నుంచి వైదొలగాలని కోరారు. తన మాటను బెనర్జీ ఖాతరు చేయకపోవడంతో పంచాయతీ స్థానిక ప్రజాప్రతినిధి వద్దకు చేరింది. ఆయన ఫోనులోనే బెనర్జీని ఇసుక టెండరు నుంచి వైదొలగాలని కోరారు. దానికి ఆయన ససేమిరా అని ఫోను కట్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

వారు చెప్పిన వారే..

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఇసుక టెండర్లు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నడుస్తున్నాయి. కేవలం తాము చెప్పిన వారే టెండర్లు వేయాలని.. వేరే వారు టెండర్లు వేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అధికార పార్టీ నేతలు హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. 2019-20లో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా నదుల్లో ఇసుక తవ్వకాలు చేసినప్పుడు టన్నుకు రూ.90 నుంచి 100 చెల్లించారు. ఇప్పుడు దాదాపు అదే ధరలతో టెండర్లు పిలిచారు. కొందరు ప్రైవేటు ఇసుక కాంట్రాక్టర్లు అంతకన్నా తక్కువ ధరకు సైతం తాము లోడింగ్.. అన్‌లోడింగ్ చేస్తామంటూ ముందుకొస్తున్నా.. తమ్ముళ్ల బెదిరింపులతో వెనక్కి తగ్గారు. వాస్తవానికి అంతకన్నా తక్కువ ధర వేసినా గిట్టుబాటు కాదని గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కూలీలతో ఇసుక తవ్వి లోడ్ చేసేందుకు టన్నుకు రూ.120 నుంచి 150 వరకు చెల్లిస్తే కానీ గిట్టుబాటు కాదని ఇసుక వ్యాపారులు, గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఇసుక రీచ్‌ల్లో పాగా వేసేందుకు తక్కువ ధర కోట్ చేసేందుకూ ఇసుక కాంట్రాక్టర్లు వెనుకాడలేదు. కానీ అధికార పార్టీ నాయకుల ముందు వారి ఆటలు సాగలేదు.

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సత్యకుమార్ యాదవ్



సత్యకుమార్



సుభాష్



రవీంద్ర

మచిలీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లాకు రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కృష్ణాజిల్లాకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియమితులయ్యారు. కృష్ణాజిల్లాకు చెందిన భూగర్భ గనులు, ఆబ్కారీశాఖా మంత్రి కొల్లు రవీంద్రను అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. వీరు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించనున్నారు.

కృష్ణమ్మ చెంత డ్రోన్ షో

22, 23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్-2024



డ్రోన్ షో ఏర్పాట్లను సమీక్షిస్తున్న రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్, కలెక్టర్ సృజన

కృష్ణలంక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే దానిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22, 23 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం కృష్ణమ్మ ఒడ్డున డ్రోన్ షోతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సృజన మంగళవారం పరిశీలించారు. పున్నమిఘాట్ బబ్బూరి గ్రౌండ్‌ను సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. డ్రోన్ షో, లేజర్ లైట్ అండ్ సౌండ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించేలా వీఐపీ గ్యాలరీ, పబ్లిక్ గ్యాలరీ, ఇలా వివిధ గ్యాలరీల ఏర్పాటుపై అధికారులకు సూచనలిచ్చారు. జాయింట్ కలెక్టర్ నిధి మీనా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, డీసీపీ గౌతమి శాలి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

విధులకు ఆలస్యంగా రావడంతో కన్నెర్ర చేసిన ఇన్‌స్పెక్టర్

- విధుల మార్పు మరో కారణం

8లో

ద్వీపం విలాపం!



వరదలతో రూపురేఖలు కోల్పోయిన భవానీ ఐల్యాండ్

- ఎక్కడ చూసినా ఇసుక మేటలు, కోతకు గురైన ప్రాంతాలే..
- పునరుద్ధరణ పనులకు ఏపీటీడీసీ రూ.20 లక్షలకు ప్రతిపాదనలు
- ఐల్యాండ్ పునర్వైభవానికి రూ.5 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రకృతి ప్రేమికులతో కళకళలాడే భవానీ ద్వీపం ఇటీవల వచ్చిన వరదల విధ్వంసానికి రూపురేఖలను కోల్పోయింది. ఆహ్లాదకరమైన వాతావరణం ఒక్కసారిగా ఆవేదనభరితంగా మారిపోయింది. ఎక్కడ చూసినా రెండు మూడు అడుగుల మేర ఇసుక మేటలే దర్శనమిస్తున్నాయి. రెస్టారెంట్లలోకి పెద్ద ఎత్తున ఇసుక కొట్టుకొచ్చింది. ఇసుకలో రెస్టారెంట్ కూరుకుపోయినట్టుగా కనిపిస్తోంది. గేమింగ్ బ్లాక్, గ్రీన్ ఏరియా, రోజ్ గార్డెన్, మేజ్ గార్డెన్, చిల్డ్రన్ ప్లే ఎరీనా, మిర్రర్ మేజ్, వీడియో గేమ్ ఎరీనా, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ ప్రాంతాలు ఇసుకతో నిండిపోయాయి. టవర్ ఉన్న ప్రాంతం ఎగువ, దిగువన కోతకు గురైంది. ఇసుక మేటల తొలగింపు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులకు అతి పెద్ద సవాల్‌గా మారింది. ఎక్స్‌వేటర్ల సాయంతో ఇసుకను తవ్వి పడవలతో బయటకు తరలించాల్సి ఉంది. దీనికి చాలా ఖర్చు అవుతుంది. పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు రూ. 20 లక్షలకు బడ్జెట్ శాంక్షన్ చేయాల్సిందిగా ప్రతిపాదనలు పెట్టారు. కానీ ఐల్యాండ్‌లో పునరుద్ధరణ పనులు, కాటేజీలను ఆధునీకరించడానికి సుమారు రూ.5 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉంది. భవానీ ఐల్యాండ్‌కు పునర్వైభవం



వాకింగ్ ట్రాక్



చిన్నారుల ఆట స్థలం



రెస్టారెంట్‌లో ఇసుక మేట

• భవానీల సందడి



ఇంద్రకీలాద్రికి కాలినడకన భవానీలు భారీగా తరలివస్తున్నారు. మంగళవారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వివిధ క్యూ లైన్లలో భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారు.

రైస్ మిల్లులో మంత్రి తనిఖీలు

- పీడీఎస్ బియ్యం స్వాధీనం
- మిల్లు సీజ్‌కు ఆదేశం

8లో

యజమానే నిందితుడు

- ఫైనాన్స్ కట్టలేక లారీ యజమాని నాటకం

6లో

జేజేఎం పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం

కడలి కబళిస్తోంది!

» ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న సముద్ర మట్టాలు
» ముందుకు చొచ్చుకొస్తుండటంతో కృష్ణా తీరప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు
» తీరం వెంబడి 100 మీటర్లు సముద్రంలో కలిసిపోయిన గ్రామాలు
కోత నివారణకు ఇప్పటికైనా అధ్యయనం జరిగేనా..



కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంలో కోతకు గురైన దీవి

ముంచేస్తున్న సముద్ర జలాలు!

విచ్చలవిడి పర్యావరణ విధ్వంసం.. గాడి తప్పుతోన్న వాతావరణ సమతుల్యత.. పెను విధ్వంసాలు సృష్టిస్తోన్న ప్రకృతి ప్రకోపం.. వెరసి కృష్ణాజిల్లా తీరప్రాంత గ్రామాలకు శాపంగా తయారైంది. ఓ వైపు గణనీయంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు జనావాసాలను వరదలు ముంచెత్తుతుంటే.. అడ్డగోలు పర్యావరణ విధ్వంసం కారణంగా ఇప్పటికే జిల్లాలోని తీర మండలాలైన నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం రూరల్, బంటుమిల్లి, కృత్తివెన్ను ప్రాంతాలు సముద్రుడి ఆగ్రహానికి గురై తీరంలో ప్రజల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గడిచిన రెండున్నర దశాబ్దాల కాలంలో జిల్లాలో భూ భౌతిక పరిస్థితుల మార్పులే దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి కోత నివారణకు సరైన ప్రణాళికలు, అధ్యయనాలు గానీ జరగకపోవటం తీరప్రాంత గ్రామాల మనుగడపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

(అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నాగాయలంక, కోడూరు మంచిలీపట్నం రూరల్, బంటుమిల్లి, కృత్తివెన్ను ప్రాంతాల్లో సముద్ర జలాలు ముందుకు చొచ్చుకొస్తూ తీరప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కోడూరు మండలం రామకృష్ణాపురం, పాలకాయితిప్ప ప్రాంతాల్లో సముద్రపు పోటు కిలోమీటరు వరకు చొచ్చుకు రావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2004లో యుఎన్‌వో ఆధ్వర్యంలో పర్యావరణ మార్పులపై ఓ అధ్యయనం నిర్వహించి కృష్ణాజిల్లా దీవి ప్రాంతంలోని కొన్ని తీర ప్రాంత గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరికలు జారీచేసినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. తీరం వెంబడి పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున భూమి కోతకు గురవుతూ సముద్రంలో కలిసిపోతున్నది.

తీర గ్రామాల్లో ప్రమాద ఘంటికలు..

పెరిగిపోతున్న కర్బన ఉద్గారాలు, నానాటికీ పెరిగిపోతున్న భూతాపం విచ్చలవిడిగా చెట్ల నరికివేత వెరసి పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. జిల్లాలోని తీర ప్రాంతంలో అనూహ్యంగా సముద్రపు కోత ఈ ప్రాంత మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. సముద్ర మట్టం గడిచిన 20 ఏళ్లలో దాదాపు అడుగున్నర మేర పెరగటంతో తీర గ్రామాలు పెద్ద ఎత్తున కోతకు గురవుతున్నాయి. దీవి గ్రామాల సమూహమైన నాగాయలంక మండలం ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, నాచుగుంట గ్రామాల్లో సముద్రపు కోత అత్యంత ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. 2004లో నాచుగుంట-ఈల చెట్లదిబ్బ గ్రామాల మధ్య నదీ వెడల్పు దాదాపు 600 నుంచి 700 మీటర్ల మేర ఉండగా, ప్రస్తుతం దాదాపు 1000 మీటర్ల వరకు వచ్చిందంటే కోత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.



ఏటిమొగ వద్ద సుమారు 30 మీటర్ల మేర నదిలో కలిసిపోయిన భూమి

● ఉప్పలవారి లంక ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం వరకు జనావాసాలు ఉండగా, నేడు ఇళ్లన్నీ సముద్రంలో కలిసిపోయాయి. ఈ ప్రాంతంలో దాదాపు 30 ఎకరాల మేర భూమి నదీ పాతానికి గురైనట్టు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఎదురుమొండి నుంచి జింకపాలెం వెళ్లే రహదారిని నదికి దాదాపుగా 150 మీటర్ల లోపలికి నిర్మించగా, ఆటుపోట్లకు భూమి కోతకు గురవుతూ రహదారి మొత్తం సముద్రంలో కలసిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కృష్ణా వరదల సమయంలో ఎదురుమొండి దీవులు వరద తీవ్రతకు గురయ్యాయి. కోత నివారణకు రూ.14 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినప్పటికీ దీవిలోని అన్ని వైపుల నుంచి ఈ కోత పెద్ద ఎత్తున పెరిగిపోతుండటంతో భవిష్యత్‌లో ఎలా ఉంటుందోనని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృత్తివెన్ను మండలం చిన్నగొల్లపాలెం వద్ద కొత్త కాలువ కారణంగా చిన్నగొల్లపాలెం వద్ద సముద్రపు ఆటుపోట్లకు దాదాపు 30 మీటర్ల మేర కొబ్బరి, ఇతర పంట భూములు సముద్రంలో కలిసిపోయాయి.

పంట పొలాలకు పెనుముప్పు..

పర్యావరణ మార్పులు దీవి ప్రాంతంలో పంట పొలాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. కోడూరు మండలం పాలకాయితిప్ప, రామకృష్ణాపురం, ఇరాలి, నాగాయలంక మండలం సంగమేశ్వరం ప్రాంతాల వరకు సముద్రం చొచ్చుకు రాగా పంట పొలాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. సముద్రం ముందుకు చొచ్చుకు రావటంతో మురుగునీరు సముద్రంలోకి కలిసే పరిస్థితి లేక ఉప్పు నీరు పంట పొలాల్లోకి చొచ్చుకువచ్చే పరిస్థితి ఏర్పడింది. గడిచిన ఐదేళ్లలో రామకృష్ణాపురం, ఇరాలి, పాలకాయితిప్ప ప్రాంతాల్లో దాదాపు 4500 ఎకరాల భూమిలో ఒక్క పంట కూడా తీయని పరిస్థితి.

● గత ప్రభుత్వంలో ఇరిగేషన్ ఉన్నతాధికారుల అధ్యయనంలో సముద్రమట్టాలు గణనీయంగా పెరిగాయని, అక్కడ పంటలు పండించాలంటే కష్టతరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆక్వాకు రైతులను ప్రోత్సహిస్తే బాగుంటుందని సలహాఇచ్చారు.

తాజాగా వచ్చిన కూటమి ప్రభుత్వం అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన అంచనాలు రూపొందించామని, త్వరలోనే ఉప్పు నీరు భూ భాగంపైకి చొచ్చుకు రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు.



ఇదంతా కొన్నేళ్ల క్రితం వరకు భూ భాగమే

పర్యావరణ విధ్వంసమే కారణమా..

కృష్ణాజిల్లాలో సముద్రం ముందుకు చొచ్చుకు రావటం, కొన్ని ప్రాంతాల్లో భూ భాగాలు సముద్రపు ఆటు, పోట్లు కారణంగా కోతకు గురై నదీగర్భం, సముద్ర గర్భంలో కలసిపోవటానికి ప్రధాన కారణం విచ్చలవిడిగా సాగుతున్న పర్యావరణ విధ్వంసమే కారణమని పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. సముద్రపు లంకల్లో లభ్యమయ్యే ఇసుక, బుసక అక్రమ రవాణా, బ్లాక్ శాండ్ వంటి హైవాల్యూ మినరల్స్ కోసం జరుగుతున్న అక్రమ తవ్వకాల కారణంగానే తీర ప్రాంత గ్రామాల్లో ఈ పరిస్థితి ఏర్పడిందని, మూడు దశాబ్దాల క్రితం వరకు మడ అడవుల నరికివేత సాగగా, దానిని అరికట్టి మడ అడవుల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి పెద్ద ఎత్తున మడ అడవుల పెంపకాన్ని ప్రోత్సహించినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయి సముద్రపు ఆటుపోట్ల వేగం పెరిగిపోయిందని, దీని కారణంగానే దీవి గ్రామాలు కోతకు గురవుతున్నాయని పర్యావరణ వేత్తలు అంటున్నారు.



రామకృష్ణపురం వద్ద కరకట్ట వరకు చొచ్చుకు వచ్చిన సముద్రం

ఆందోళన కలిగిస్తున్న ఎన్‌సీఎస్‌సీఎం నివేదిక

వాతావరణ మార్పుల కారణంగా తీరం వెంబడి జరుగుతున్న మార్పులపై అధ్యయనం చేసేందుకు 2022లో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో జరుగుతున్న పర్యావరణ మార్పులపై అధ్యయనం నిర్వహించింది. చెన్నైకి చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వానికి జూలై మాసాంతంలో ఇచ్చిన నివేదిక ప్రకారం పర్యావరణ మార్పులు కారణంగా రాబోయే భవిష్యత్‌లో తీర ప్రాంతానికి పెద్ద ఎత్తున ముంపు ప్రభావం పొంచి ఉందని హెచ్చరించింది. ఈ తీవ్రత కారణంగా తీర ప్రాంతంలో సముద్రమట్టం 0.6మీటర్ల మేర పెరుగుతుందని ఇందులో 43 శాతం భూమి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని హెచ్చరించింది. వెరి హైరిస్క్ జోన్‌గా గుర్తించిన ప్రాంతాలు కృష్ణా జిల్లాలోని బ్యాక్ వాటర్ పాయలు, సముద్రపు మొగల్లోనే ఉన్నాయని ఈ సంస్థ హెచ్చరించింది. నదీజలాలు, సముద్ర జలాలు కలిసే ప్రాంతాల్లో ఉప్పునీరు మరింతగా ముందుకు చొచ్చుకు వస్తుందని, ఇది కోత తీవ్రత అధికం కావటానికి కారణమవుతుందని, కృష్ణానది సముద్రంలో కలిసే చోట ఈ ముప్పు తీవ్రత ఇంకా ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది.

నివారణకు చర్యలు..

కోత తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎక్కువ వేరు వ్యవస్థ కలిగి భూమిని కోతకు గురికాకుండా నివారించేలా ఉండే ఫలసాయం ఇచ్చే పామాయిల్, కొబ్బరి వంటి దీర్ఘకాలిక పంటల సాగును ప్రోత్సహించాలి.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్, కొబ్బరి సాగుపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ ఆ ప్రచారం మొత్తం ఎస్టేట్ ఏరియాలైన ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాలకు మెట్ట భూములు ఎక్కువగా ఉన్న అవనిగడ్డ మండలాలకే పరిమితమవుతుందని, ప్రమాద తీవ్రత అధికంగా ఉన్న నాగాయలంక, కోడూరు మండలాల్లో ప్రచారం జరగటం లేదని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైరిస్క్ జోన్‌లో నిషేధాజ్ఞలు ఉల్లంఘించి ఎవరైనా అక్రమ తవ్వకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

కోత ఆందోళనకు గురి చేస్తోంది..

- కొక్కిలిగడ్డ శ్రీరామచంద్రరావు, నడకుదుటి వెంకటేశ్వరరావు, నాచుగుంట

కృష్ణానది గర్భంలోని ఎదురుమొండి దీవుల్లో తాతల కాలం నుంచి నివశిస్తున్నాం. కొద్ది సంవత్సరాలుగా సముద్ర మట్టం అడుగుకు పైగా పెరిగినట్టు కనిపిస్తున్నది. ఆటు పోట్ల వేగం కూడా గతంలో కంటే అధికంగా ఉంది. ప్రభుత్వం స్పందించి దీవులు కోతకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

రాళ్ల మొండులు నిర్మించాలి

కన్నా నాగరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు, నాగాయలంక

ఎదురుమొండి దీవులు పూర్తిగా కోతకు గురవుతున్నాయి. దీని నివారణ కోసం పులిగడ్డ నుంచి నాగాయలంక మండలం పెద్ద పాలెం వరకు గ్రామాలు కోతకు గురికాకుండా ఉండేలా ఏర్పాటు చేసినట్లుగా ప్రభుత్వం ఎదురుమొండి దీవుల పొడవునా రాళ్లమొండులు ఏర్పాటు చేయాలి. వీటిని ఏర్పాటు చేయటం ద్వారా అత్యంత వేగంగా బ్యాక్ వాటర్స్ దీవులను తాకి భూమి కోతకు గురికాకుండా నివారించే వీలు ఏర్పడుతుంది. ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడితేనే గానీ దీవుల కోత అరికట్టలేం.

వృత్తినైపుణ్య కోర్సుల్లో శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఈ నెల 21, 25 తేదీల్లో పలు వృత్తినైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణా కేంద్రం (యూబీఆర్ఎస్ఈటీఐ) డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫోటోగ్రఫీ-వీడియోగ్రఫీ, మగ్గం అండ్ ఎంబ్రాయిడరీ వర్క్స్, జ్యూట్ బ్యాగుల తయారీ, బ్యూటీషియన్ కోర్సు, అగరబత్తీల తయారీ, మహిళా టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 6304254730, 9490011081 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బెజవాడ 'బార్'లో రతన్ టాటాకు ఘన నివాళులు

విజయవాడ లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ బార్ అసోసియేషన్‌లో భారతదేశ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు న్యాయవాదులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామ్ ప్రసాద్ (రాజా) మాట్లాడుతూ, మార్గదర్శకుడిగా, పద్మవిభూషణ్, పద్మభూషణ్ అవార్డులు పొందిన రతన్ టాటా సేవలు చిరస్మరణీయమన్నారు. టాటా గ్రూప్ వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసు కెళ్లారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు కొత్త చంద్రమౌళి, న్యాయవాదులు సంపర శ్రీనివాస్, చంద్రశేఖర్, ఒగ్గు గవాస్కర్, అల్లం పద్మనాభం, జె.క్లౌడియా చక్రవర్తి, రజాక్, బాపిరాజు, మధుబాబు, ట్రెజరర్ సుబ్రమణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధిపై భేటీ

ఆటోనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని ఎంఎస్ఎంఈ అభివృద్ధి చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లోని పరిశ్రమలశాఖా ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్‌ను శివశంకర్ మర్యాదపూర్వకంగా కలిసి భేటీ అయ్యారు. ఎంఎస్ఎంఈల ద్వారా యువతకు ఉపాధి కల్పనతోపాటు, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్‌కు యువరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.

భూములు దున్నేసుకుంటాం!

» అమరావతి అసైన్డ్ రైతుల హెచ్చరికలు
» నాట్ ట్యాలీడ్ జాబితాతో మూడేళ్లుగా అందని కౌలు
» కౌలు చెల్లించినట్టు సంతకాలు చేయాలని అధికారుల ఒత్తిడి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'రాజధాని కోసం భూములిచ్చిన మాపై సీఐడీ విచారణ చేస్తారా? విచారణ పేరుతో మూడేళ్లుగా కౌలు ఆపేస్తారా? భూములిచ్చిన పదేళ్ల తర్వాత కూడా న్యాయం చేయరా? సమస్య పరిష్కరించకుండా పరిష్కారమైనట్లు సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తారా? ఈ బాధలు మాకొద్దు! మా భూములు మేమే దున్నేసుకుంటాం' అని రాజధాని అమరావతి అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారులకు అడ్డం తిరుగుతున్నారు. అసైన్డ్ రైతుల భూములపై గత వైసీపీ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. విచారణ ప్రక్రియ మొదలవగానే సీఐడీ అధికారులు ఆ భూములను నాట్ ట్యాలిడ్ జాబితాలో పెట్టారు. దీంతో మూడేళ్లుగా కౌలు చెల్లింపులు ఆపేశారు. తాజాగా 1400 మంది రైతులను ట్యాలిడ్ జాబితాలో చేర్చారు. వారికి కౌలు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే మరో 1,650 ఎకరాల భూమి, అందుకు సంబంధించిన రైతులు వివరాలు ఇంకా నాట్ ట్యాలిడ్ జాబితాలోనే ఉన్నాయి. ఫలితంగా వీరికి కౌలు వచ్చేఅవకాశం లేకుండా పోయింది. కౌలు రాక ఇబ్బందుల్లో ఉన్న రైతుల పట్ల సీఆర్డీఏ అధికారుల తీరు వారిని మరింత మనోవ్యథకు గురిచేస్తోంది. నిర్ణీత సమయంలోపు వినతులను క్లోజ్ చేయాల్సి ఉండడంతో అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. సీఎంవో కార్యాలయం, సీఆర్డీఏ కమిషనరేట్ నుంచి ఒత్తిడి వస్తోందని, సమస్య పరిష్కారం అయినట్లు సంతకాలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. సమస్య పరిష్కారం కాకుండా సంతకాలు చేసేది లేదని రైతులు అడ్డం తిరిగారు. సమస్య పరిష్కరించకుంటే పొలాల్లో వేసిన హద్దురాళ్లు పీకేసి పొలాలు సాగు చేసుకుంటామని రైతులు తెగేసి చెబుతున్నారు.

లారీ యజమానే నిందితుడు

» కిస్తీలు కట్టలేక చోరీ నాటకం.. లారీ, పంచదార బస్తాలు స్వాధీనం

జగ్గయ్యపేట, అక్టోబరు 15 : జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన పంచదార బస్తాల లారీ చోరీ కేసు మిస్టరీని చిల్లకల్లు పోలీసులు చేధించారు. యజమానే లారీని దాచిపెట్టి, పంచదార కట్టలను అమ్ముకోవాలనే దురుద్దేశ్యంతోనే లారీ కనిపించటం లేదని నాటకం ఆడాడని జగ్గయ్య పేట సీఐ జానకీరాం చెప్పారు. నిందితుడు తెలంగాణాలోని ఇల్లెందు వద్ద లారీతో పాటు, షెడ్‌లో దాచిపెట్టిన పంచదార బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 13న జాతీయ రహదారిపై చిల్లకల్లు సమీపంలో కింగ్ డాబా సమీపంలో లారీని నిలిపి ఉంచగా అపహరణకు గురైనట్టు లారీ యజమాని జగ్గయ్యపేట పట్టణం తొర్రగుంటపాలెంకు చెందిన యాకుబ్ బాషా చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీలో 630 బస్తాల పంచదార ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నెల 9న కర్నాటకలో శివశక్తి షుగర్ ఫ్యాక్టరీ వద్ద పంచదార బస్తాలు ఎగుమతి చేసుకుని ఒడిసా రాష్ట్రంలో కుర్దాలో దిగుమతి చేసేందుకు బయల్దేరిందని, 11న రిపేరు రావటంతో డ్రైవర్ జగ్గయ్యపేట విద్యానగర్‌కు చెందిన ఆరిఫ్‌ను జగ్గయ్యపేట ఆటోనగర్ తీసుకురమ్మని చెప్పి అక్కడ మరమ్మతులు చేయించి 12న ఒడిసాకు వెళ్లేందుకు లారీని హైవేపై నిలిపినట్టు ఫిర్యాదులో వివరించాడు. కేసు నమోదు చేసిన చిల్లకల్లు పోలీసులు లోతైన దర్యాప్తు జరిపారు. లారీని తెలంగాణా రాష్ట్రం ఇల్లెందుకు తీసుకువెళ్లి రహస్య ప్రాంతంలో ఒకచోట పంచదార బస్తాలను దింపేసి, లారీని మరోచోట ఎవరికి అనుమానం రాకుండా పడేసినట్టు చెప్పారు. పోలీసులు ఇల్లెందు వెళ్లి వారి చెప్పిన వివరాల అధారంగా విచారించగా లారీ, పంచదార కట్టలు సోమవారం రాత్రి కనుగొన్నారు. లారీని, పంచదార బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు. 8 లారీలు నడుపుతున్న యాకుబ్ వాహనాలకు కిస్తీలు కట్టలేక ఈ నాటకం ఆడాడని, పంచదార బస్తాలు అమ్మేసి ఆ డబ్బును వాడుకోవాలని పథకం వన్నాడని సీఐ చెప్పారు. కేసులో మిస్టరీని 24 గంటల్లో చేధించిన సీఐను, చిల్లకల్లు పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

కౌలు కోసం రైతుల పాట్లు!

ఏడాది కౌలే చెల్లించిన ప్రభుత్వం
రెండో ఏడాది బకాయిపై స్పష్టత కరువు

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల కౌలు కష్టాలు కూటమి ప్రభుత్వం వచ్చినా తీరడం లేదు. గత ప్రభుత్వం కక్షకొద్దీ ఆపిన రైతుల కౌలు ఈనాటికీ వారికి దక్కడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఒక ఏడాది కౌలు మాత్రమే చెల్లించడంతో రైతులు నిరాశకు గురయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు చెల్లించకుండా ముప్పతిప్పలు పెట్టింది. గడిచిన ఐదేళ్లలో కోర్టు మెట్లెక్కకుండా రైతులకు కౌలు దక్కిన దాఖలాలే లేవు. చివరికి కోర్టు తీర్పులు, ఆదేశాలను కూడా పెడచెవిన పెట్టిన వైసీపీ ప్రభుత్వం ఆఖరి రెండేళ్లల్లో ఒక్క రూపాయి కూడా కౌలు చెల్లించలేదు. రెండేళ్లకు కలిపి రూ.400 కోట్ల వరకూ రైతులకు బకాయి పెట్టింది. ఇప్పుడు ఆ భారమంతా కూటమి ప్రభుత్వంపైనే పడింది. రెండేళ్ల బకాయిలు అందుతాయనుకుంటే.. కూటమి ప్రభుత్వం గత నెల 16న ఒక ఏడాది కౌలే చెల్లించింది. ఈ ఏడాది 10 శాతం పెంచి, రూ.210 కోట్ల కౌలు చెల్లించాల్సి ఉంది. మరోవైపు గత మూడేళ్లుగా అసైన్డ్ రైతులకు కలగా మారిన కౌలు ఎట్టకేలకు వారికి దక్కింది. సీఐడీ విచారణ పరిధిలోలేని 1400 మంది రైతులకు మూడేళ్ల కౌలు చెల్లించేసింది. దీంతో మిగిలిన రైతులకు కూడా తక్షణమే బకాయి కౌలు విడుదల చేయాలని రైతులు కోరుకుతున్నారు.

జేజేఎం పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పెండింగ్ బిల్లులు చెల్లింపులకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పనులు చేసినా బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపువిషయంలో గత వైసీపీ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు, పార్టీతో సంబంధం ఉన్న వారికి చెల్లింపులు జరిపింది. దీంతో మిగిలిన కాంట్రాక్టర్లు ఆందోళన బాట పట్టారు. కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు పెండింగ్ బకాయిలు ఇవ్వటానికి నిర్ణయించటంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 50 మందికి పైగా కాంట్రాక్టర్లకు రూ.10 కోట్ల మేర బిల్లు చెల్లింపులు జరగనున్నాయి.

సీసీఐ బేరం.. ఏఎంసీలపై పెను భారం!

» యార్డులకు దూరంగా జిన్నింగ్ మిల్లులు
» రవాణా ఖర్చులు తడిసి మోపెడు
» జిల్లాలో ఏఎంసీల ఆదాయానికి గండి

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) సీసీఐ పత్తి కొనుగోళ్ల వల్ల ఏఎంసీలపై ఆర్థిక భారం పడుతోంది. రవాణా ఖర్చులనూ ఏఎంసీలు భరించాల్సి రావటంతో మార్కెట్ సెస్ రూపేణా వస్తున్న ఆదాయం కూడా చాలటం లేదు. రాబడి సంగతి దేవుడెరుగు? సీసీఐ కేంద్రాల వల్ల యార్డుల ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. ప్రతి యేటా భారత పత్తి సంస్థ (సీసీఐ) జిల్లాలో కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, గంపలగూడెం, ఎ.కొండూరు మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. గతంలో రైతులు యార్డులకు తెచ్చిన పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేసేది. యార్డుల నుంచి పత్తిని జిన్నింగు మిల్లులకు తరలించేది. ఇందుకు అయ్యే రవాణా ఖర్చు సీసీఐ భరించేది. పత్తి కొనుగోళ్ల వల్ల ఏఎంసీలకు రాబడి తప్ప పెద్దగా ఖర్చు ఉండేది కాదు. అయితే రైతులకు కావాల్సిన తాగునీరు, వసతి ఇతరత్రా సదుపాయాలు ఏర్పాటు చేసేవారు. పత్తి విలువలో ఒక శాతం మార్కెట్ సెస్ రూపేణా సీసీఐ, ఆయా ఏఎంసీలకు సొమ్ము చెల్లించేది. అయితే మూడు నాలుగు సంవత్సరాల నుంచి రవాణా ఖర్చులు సీసీఐ భరించటం లేదు. తప్పని పరిస్థితుల్లో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రవాణా ఖర్చును ఏఎంసీలే భరిస్తున్నాయి. దీంతో ఈ ఖర్చు ఏఎంసీలకు పెనుభారంగా తయారైంది.





కంచికచర్ల మార్కెట్ యార్డు, పత్తి బోరాలు

2023-24 సంవత్సరంలో కంచికచర్ల మార్కెట్ యార్డులో సీసీఐ 5,311.04 క్వింటాళ్ల పత్తి కొన్నది. సీసీఐ గుంటూరులో తీసుకున్న జిన్నింగ్ మిల్లుకు పత్తిని తరలించినందుకు క్వింటా రూ.155ల వంతున రూ. 8,23,205లు ఖర్చయింది. కొంత మంది రైతులు యార్డుకు తీసుకురాకుండా నేరుగా గుంటూరు మిల్లు వద్దకు తీసుకువెళ్లి అమ్ముకున్నారు. మిల్లు వద్ద సీసీఐ 4,599.67 క్వింటాళ్ల పత్తి కొన్నది. వెరశి మొత్తం రూ. 6,82,74,011ల విలువైన 9,911.07 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. విలువలో ఒక శాతం వంతున మార్కెట్ సెస్ రూపేణా సీసీఐ నుంచి ఏఎంసీకి రూ. 6,82,740లు రావాలి. అయితే రవాణా ఖర్చు ఎనిమిది లక్షలకు పైగా ఉండటంతో సీసీఐ నుంచి ఒక్క పైసా కూడా రాలేదు. పైగా ఏఎంసీయే రూ. 1.40 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. నందిగామ ఏఎంసీది కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ యార్డులో 14,133 క్వింటాళ్లు కొన్న సీసీఐ, గుంటూరులో అద్దెకు తీసుకున్న నాలుగు మిల్లుల వద్ద 19,550 కింటాళ్ల పత్తి కొన్నది. మొత్తంగా నందిగామ ఏఎంసీ పరిధిలో రూ.23.26 కోట్ల విలువైన 33,683 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. ఇందుకుగాను మార్కెట్ సెస్ రూపేణా రూ. 23,26,445లు సీసీఐ ఏఎంసీకి చెల్లించాల్సి ఉంది. అయితే యార్డులో కొన్న 14,133 క్వింటాళ్ల పత్తిని గుంటూరులోని నాలుగు మిల్లులకు తరలించినందుకు రూ. 20,35,134ల రవాణా ఖర్చు అయింది. ఈ రవాణా ఖర్చును మినహాయించుకుని సీసీఐ కేవలం రూ. 2,91,311లు మాత్రమే నందిగామ ఏఎంసీకి చెల్లించింది.

సీసీఐ కొనుగోళ్ల వల్ల ఏఎంసీల రాబడికి భారీగా గండిపడుతున్నది. రాబడి కంటే ఖర్చు పెరగడం వల్ల ఏఎంసీలు ఆర్థికంగా దెబ్బ తింటున్నాయి. ఏఎంసీలకు సమీపంలో జిన్నింగు మిల్లులు ఉంటే ఇంతగా భారం పడేది కాదు. 75 నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న జిన్నింగు మిల్లులకు కంచికచర్ల, నందిగామ నుంచి పత్తి తరలింపు అయ్యే ఖర్చును భరిస్తుండటం ఏఎంసీలకు పెద్ద గుదిబండగా తయారైంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు వీలుపడటం లేదు. రవాణా ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించినట్టయితే ఏఎంసీలకు పెద్ద ఊరట కలుగుతుందని కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు చెప్పారు.

విజయవాడ తూర్పు



టీడీఆర్ బాండ్స్‌పై ఆంక్షలు తొలగించండి

మంత్రి నారాయణకు జాస్తి వినతి



భారతీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా టీడీఆర్ బాండ్స్‌పై ఉన్న ఆంక్షలు తొలగించి అర్హులైన వారందరికీ బాండ్స్ ఇవ్వాలని, బాండ్స్ ద్వారా విని యోగదారులకు లబ్ధిచేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నాల్గవ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మంగళవారం మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను సీఆర్‌డీఏ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.

కోట్లు పోసినా గొంతు తడవలేదు

- యూజర్ కంట్రిబ్యూషన్ కింద నగదు వసూలు
- హడావిడిగా ట్యాంకు నిర్మాణం
- మూలకు చేరిన వాటర్ ఏటీఎం

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

కోట్లు ఖర్చు చేశారు. పైపులైన్లు వేశారు. వారం రోజుల పాటు ట్రయల్ రన్ చేశారు. ఏమైందో ఏమో కానీ కార్మికుల గొంతు మాత్రం తడవలేదు. ఇదుగో నీళ్లు వస్తున్నాయి అదిగో ఇచ్చేస్తున్నాం అంటూ సంవత్సరాలు గడుపుతున్నారే కానీ మంచినీళ్లు అందించే నాథుడే లేడు. ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు బదిలీ అవుతున్నారు. ఆటోక్లస్టర్ పాలకవర్గం మారుతుంది. అయినా ఆటోనగర్‌లో పనిచేసే కార్మికులకు చుక్కనీరు అందించలేకపోతున్నారు. ఆటోనగర్‌లో ఏ బోర్ చూసినా మెగ్నీషియం కలిసి నీరు కలుషితమవుతున్నాయని ల్యాబ్ రిపోర్టులు వెలువడ్డాయి. 1966లో ఏర్పడిన ఆటోనగర్ ఆసియాలోనే అతిపెద్దదిగా పేరు గడించింది. ఇంత పేరు రావడానికి కారణమైన కార్మికుల నీటి కష్టాలు తీర్చే దారి తొలగడం లేదు.

ఆటోనగర్ ప్రాంతంలో పనిచేసే కార్మికులకు తాగునీటిని అందించాలని 15 ఏళ్ల క్రితం ఆటోక్లస్టర్ పాలకవర్గం ఆలోచించింది. దీని కి అనుగుణంగా ఎలా కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు ప్రణాళికలు రూపొందించారు. నీటిని అందిస్తాం కానీ దానికి ప్రతిగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని ఐలాకు సిఫార్స్ చేసింది. దీనికి బదులుగా గుంటెద్దుల దిబ్బ వాటర్ ట్యాంకు నుంచి మంచినీటిని అందిస్తామని ఇద్దరు కమిషనర్లు ఒప్పందాలు చేసుకున్నారు. సుమారు రూ.30 లక్షలతో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పంటకాలువ మీదుగా ఆటోనగర్ వరకు తారు రోడ్డు నిర్మాణం ఐలా పూర్తి చేసింది. దీంతో మున్సిపల్ కార్పొరేషన్



నిర్మాణం పూర్తి అయిన వాటర్ ట్యాంకు

పటమట రైతుబజార్ వద్ద వాల్ ఏర్పాటు చేసి నీటిని అందించడానికి సన్నాహాలు చేసింది. ఆటోనగర్ మొత్తం పైపులైన్లు వేసే బాధ్యతను జైన్ ఇరిగేషన్ సంస్థకు రూ.3.70 లక్షలతో క్లస్టర్ ఒప్పందం కుదుర్చుకుంది. అందుకు తగ్గట్టుగానే ఆ సంస్థ పైపులైన్లు వేసింది. ఎక్కడైనా లీకులను గుర్తించాలని బల్క్ మీటర్ ద్వారా వారం రోజులపాటు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ వారం రోజులకు విడుదల చేసిన నీటికి గానూ రూ. 25 లక్షలు చెల్లించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఐలాకు బిల్లు పంపింది. దీంతో నీటిని వినియోగించుకుండానే బిల్లు ఎలా చెల్లిస్తామని ఐలా అధికారులు ఆడిగారు. బిల్లు మీటర్లో కనిపిస్తోంది. ఆ బిల్లును చెల్లిస్తే కానీ



మూలకు చేరిన వాటర్ ఏటీఎం

నీటిని విడుదల చేయలేమని కార్పొరేషన్ అధికారులు తెగేసి చెప్పారు. ఈ బిల్లు చెల్లింపు జాప్యంతో ఆటోనగర్ తాగునీటి విడుదలకు బ్రేక్ పడినట్టైంది.

యూజర్ కంట్రిబ్యూషన్ కింద నగదు వసూలు

ఆటోనగర్‌లో పనిచేస్తున్న కార్మికులను బట్టి స్లాబ్‌లు నిర్ణయించింది ఆటోక్లస్టర్. మినిమం చార్జీలు రూ.2,500, కనిష్ఠ కింద రూ.1500లు నుంచి రూ.15వేల వరకు యూజర్ కంట్రిబ్యూషన్ కింద సుమారు 176 మంది నుంచి నగదును ఆటోక్లస్టర్ వసూలు చేసింది. అలాగే ట్రెడ్‌లోన్ కింద రూ.90 లక్షలు ఏపీఐఐసీ నుంచి వడ్డీ లేని రుణం ఆటో క్లస్టర్ తీసుకుంది. యూజర్ కంట్రిబ్యూషన్ నగదు వసూలైన తర్వాత తీసుకున్న రుణం చెల్లిస్తామని ఆటోక్లస్టర్ పాలకవర్గం హామీ ఇచ్చింది. కానీ యూజర్ చార్జీల కింద వసూలు చేసిన నగదు, ట్రెడ్‌లోన్‌గా తీసుకున్న నగదును ఏ పనికి వినియోగించారనే దానికి స్పష్టత లేదు. యూజర్ కంట్రిబ్యూషన్ నగదు రాగానే తీసుకున్న రూ. 90 లక్షల రుణం చెల్లిస్తామన్న క్లస్టర్ నేటికీ ఏపీఐఐసీకి చెల్లించక పోవడం గమనార్హం. తమకు తాగు నీటిని అందిస్తారని ఆశపడి యూజర్ కంట్రిబ్యూషన్ కింద నగదు చెల్లించినా నేటికీ తాగునీరు అందని పరిస్థితి ఆటోనగర్ వ్యాపారులు ఆగ్రహంగా ఉన్నారు.

ఎంపీ నిధులతో ట్యాంకు నిర్మాణం

నాటి టీడీపీ ఎంపీ కేశినేని నాని ఎంపీ నిధుల్లోంచి ఆటోనగర్‌లో వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. ట్యాంకు నిర్మాణం పూర్తయింది. బోర్ ద్వారా ట్యాంకులోకి నీటిని పంపి ఆటోనగర్ కార్మికులకు నీళ్లు అందించాలని అనుకున్నారు. కానీ ఆ నీటిని ఏవిధంగా సరఫరా చేయాలనే ప్రణాళిక లేకుండా ఇష్టానుసారం నిర్మాణం చేశారు. 15 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు ఎలా ఉన్నాయో చెక్ చేయలేదు. ప్రవాహానికి అడ్డంకులు ఉంటే వాటిని ఎలా తొలగించాలనేది ప్రశ్నగా మారింది. ఇన్ని అడ్డంకులు ఉంటే ఎన్నికల ముందు వైసీపీ నాయకులు తమ వల్లే ఆటోనగర్ కార్మికులకు మంచినీరు సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకున్నారు. ట్యాంకు నిర్మాణం పూర్తయి నేటికి ఆరు నెలలు గడుస్తున్నా కార్మికుడు చుక్క నీరు తాగలేదు.

మూలకు చేరిన వాటర్ ఏటీఎం

ఆటోనగర్‌లో పనిచేసే కార్మికుల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ వాటర్ ఏటీఎంను ఏర్పాటు చేసింది. ఆర్వో ప్లాంట్‌లో రెండు రూపాయల కాయిన్ వేస్తే 20 లీటర్ల శుద్ధి చేసిన మంచినీరు వస్తుంది. ఈ ప్లాంట్ నిర్వహణ ఐలా చూడాల్సి ఉంది. దీన్ని కూడా ఐలా పట్టించుకోకపోవడంతో తుప్పుపట్టి పాడైపోయింది. ఈ ప్లాంట్‌ను సక్రమంగా నిర్వహించినట్లయితే దగ్గరలోని కార్మికులకు ఎంతో కొంత మేలు జరిగేదని చెబుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



176 మంది దగ్గర యూజర్ కంట్రిబ్యూషన్ కింద నగదును చెల్లించిన మాకు ఆటో క్లస్టర్ నీటిని అందించలేకపోయింది. బోర్లు వేస్తే ఆ వాటర్ కలుషితమైందని, ఆ నీటిలో మెగ్నీషియం శాతం ఎక్కువగా ఉందని ల్యాబ్ రిపోర్టులు వెలువడ్డాయి. తాగడానికి ఆ నీరు పనికిరాదని అధికారులు చెబుతున్నారు. ఆటోనగర్ కార్మికుల తాగునీటి కష్టాలు తీరేలా ప్రభుత్వం, ఐలా, మున్సిపల్ కార్పొరేషన్ ముందుకు రావాలని కోరుతున్నాం.

-అబ్దుల్ ఖాలిక్, మాజీ క్లస్టర్ కార్యదర్శి

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

- ఎమ్మెల్యే గద్దెకు భవన నిర్మాణ కార్మికుల వినతి



పటమట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు టీడీపీ, కూటమి నేతలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు మేలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అశోక్‌నగర్‌లోని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను ఆయన కార్యాలయంలో సీఐటీయూ నియోజకవర్గ నాయకులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉచిత ఇసుక పాలసీ అమలుచేస్తామని ఎన్నికల్లో చెప్పారని, ఉచిత ఇసుక ఇస్తున్నట్లు చూపించి రవాణా చార్జీల పేరుతో అధిక రేట్లు వసూలు చేస్తున్నారని అన్నారు. చిన్నచిన్న నిర్మాణదారులు ఉచిత ఇసుక వస్తుందని నిర్మాణాలు చేపట్టారని, ఇసుక రేట్లు అధికంగా ఉండటంతో ఆ నిర్మాణాలు నిలిపివేయాల్సి వస్తున్నాయన్నారు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన మెమో 1214 రద్దు చేసి కార్మికుల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీఐటీయూ నాయకులు గద్దెను కోరగా, ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు వీవీ రాజు, టి చంద్రశేఖర్, ఎస్ వెంకట గోపాలకృష్ణ, కోటమ్మ, పి కిరణ్ కుమార్, ఓ రాంబాబు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు చిరస్మరణీయం

బెజవాడ బార్‌లో నివాళులు



రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశం పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయిందని బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాం ప్రసాద్ (రాజా) అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో రతన్ టాటాకు న్యాయవాదులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ముందు చూపుతో దేశానికి 100 సంవత్సరాల భవిష్యత్తును ముందే అధ్యయనం చేసి కావాల్సిన పారిశ్రామిక ఉత్పత్తులను భారతదేశానికి అందించిన ఖ్యాతి రతన్ టాటాకే దక్కుతుందన్నారు. రతన్ టాటా సేవలు చిరస్మరణీయమన్నారు. టాటా గ్రూప్ వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని రాజా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, న్యాయవాదులు సంపర శ్రీనివాస్, చంద్రశేఖర్, ఒగ్గు గవాస్కర్, అల్లం పద్మనాభం, జెక్కెదియా చక్రవర్తి, రజాక్, బాపిరాజు, మధుబాబు, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, రమేష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు పేటెంట్‌పై అవగాహన

మొగల్రాజపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం కేబీఎన్ సిద్ధార్థ పార్వతి కళాశాలలో మంగళవారం ఇన్నోవేషన్ డే సందర్భంగా ఐపీఆర్, ఐఐసీ విభాగాలు సంయుక్తంగా నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు పేటెంట్ తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ట్రేడ్‌మార్క్ అటార్నీ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ పేటెంట్ ఎలా తీసుకోవాలి, ఫైల్ చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు ఉదాహరణలతో వివరించారు. ప్రిన్సిపాల్ ఏ. సునీత మాట్లాడుతూ పేటెంట్ తీసుకోవడం వల్ల కలిగే హక్కులు, కాపీరైట్ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కార్యనిర్వాహణాధికారి డాక్టర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.



పేటెంట్ హక్కులను వివరిస్తున్న ట్రేడ్‌మార్క్ అటార్నీ ఎం.శ్రీధర్

ముక్కు మూసుకోవాల్సిందే



రోడ్డు మీద పేరుకున్న మురుగునీరు

పటమట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పటమట నుంచి బెంజిసర్కిల్ వైపునకు వెళ్లే దారిలో కుడి పక్కన ఎవీఎస్ కల్యాణమండపం దగ్గర డ్రెయినేజీ పొంగి రోడ్డు మీద 20 మీటర్ల దూరం మేర వ్యాపించింది. గత రెండు నెలలు నుంచి ఎవరూ శుభ్రం చేయకపోవడంతో పేరుకుపోయి గడ్డలు కట్టేసింది. ఆ పరిసర ప్రాంతాలన్నీ దుర్గంధంతో నిండిపోయాయి. ఆ మార్గంలో నడిచే పాదచారులు ద్విచక్రవాహనదారులు ముక్కు మూసుకుని నడవాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మీద పేరుకున్న మురుగును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మంచి మానవ సంబంధాలతో ఒత్తిడికి చెక్

-డాక్టర్ ఇంద్ర విశాల్



మొగల్రాజపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమయ పాలన, స్వీయ గౌరవం, మంచి మానవ సంబంధాలతో మానసిక ఒత్తిడిని సులువుగా జయించవచ్చని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇంద్ర విశాల్ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఎంబీఏ విభాగం, సీఐఐ విజయవాడ శాఖ సంయుక్తంగా నిర్వహించిన మానసిక ఒత్తిడి నిర్వహణ అనే సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఒత్తిడికి గురవుతున్నారని, ప్రతి విషయంలో సానుకూల దృక్పథం ఉండాలని, అతిగా స్పందించడం మానేయాలని, ఎంత వరకు అవసరమో అంతవరకే తెలుసుకునే అలవాటు ఉండాలని, సోషల్ మీడియాను అవసరానికంటే ఎక్కువ ఉపయోగించకుండా ఉండాలని తెలిపారు. వివిధ రకాల ప్రశ్నలకు జవాబులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈమిస్ ఫార్మాస్యూటికల్స్ ఎండీ వి. నాగలక్ష్మి, సీఐఐ ప్రతినిధులు చందన పట్నాయక్, టీవీ రవీంద్ర, పాల్గొనగా సమన్వయకర్తగా డీన్ రాజేష్ సి జంపాల వ్యవహరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ

ఆటోనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ కాలనీలోని రేగుల అనురాధ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్ ఆవరణలోని భవిత సెంటర్ విద్యార్థులకు మంగళవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఈవో సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. ఏపీఐఐసీ కాలనీ నుంచి ఆయుష్ హాస్పిటల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యాసానికి ఐదు రకాలకు సంబంధించిన లోపాలు ఉంటాయని, ఆ వైకల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చన్నారు. పిల్లల్లో ఈ సమస్యను ఎలా గుర్తించాలో వివరించారు. ఆడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మహేశ్వరరావు, సెక్టోరల్ ఐఈడీ కో ఆర్డినేటర్ వరలక్ష్మి, స్టేట్ కో-ఆర్డినేటర్ వనజ, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎంఈవో విజయలక్ష్మి, హెచ్ఎం సుజాత, భవిత సెంటర్ టీచర్ పి.కె. జయ, వి. వినీత పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఈవో సుబ్బారావు తదితరులు

సిద్ధార్థ మహిళా కళాశాలలో 21న అద్వితీయ-2024

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

లబ్బీపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ నెల 21న కళాశాల ఇంగ్లీషు విభాగం, లిటరరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అద్వితీయ 2024 ఇంటర్ కాలేజియేట్ అకడమిక్ కాంపిటీషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. కల్పన తెలిపారు. మంగళవారం కాంపిటీషన్స్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని డిగ్రీ, ఆర్ట్స్ అండ్ సైన్స్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాలలో విద్యార్థినీ విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్స్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, యాడ్ ఫిల్మ్ మేకింగ్, వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, మిస్టర్ అండ్ మిస్సెస్ తదితర పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, విజేతలకు నగదు బహుమతి ఇవ్వటం జరుగుతుందని, ఈ మెగా ఈవెంట్కు డాక్టర్ కె. శైలజా రాణి, ఎన్.శరత్ సమన్వయ కర్తలుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.లీలావతి, ఏవో డాక్టర్ ఎలీకె మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా ఆక్రమణలతో ఇబ్బందులు

- సిమెంట్ గోడౌన్ కూడలి వద్ద రోడ్డుపై అడ్డంగా ఇసుక లారీలు
- 108కి తీవ్ర ఇబ్బందులు
- పోలీసుల హెచ్చరికలు పట్టించుకోని లారీ యజమానులు



సిమెంట్ గోడౌన్ వద్ద రోడ్డుపై నిలిపిన లారీలు

రాణిగారితోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట సిమెంట్ గోడౌన్ కూడలి వద్ద రోడ్డు ఇరువైపులా ఆక్రమణలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఒక వైపు దుకాణాలు ఉండటంతో మరోవైపు క్వారీ లారీలు నిలపడంతో రోడ్డు ఇరుకుగా మారింది. కృష్ణలంక జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఉన్న ఫీడర్ రోడ్డును చిన్న వాహనాల రాకపోకలతో పాటు స్థానికులు ఉపయోగిస్తుంటారు. ప్రధానంగా రాణిగారితోట నుంచి కృష్ణలంక వైపు వెళ్లటానికి, అటు నుంచి ఇటు వైపు రావటానికి సిమెంట్ గోడౌన్ కూడలి ప్రధాన రహదారిగా మారింది. ఇక్కడ ఆక్రమణలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూడలి వద్దే 108 కార్యాలయం ఉండటంతో ఇక్కడ నుంచి నిత్యం 108 వాహనం రాకపోకలు సాగిస్తుంది. అత్యవసర పరిస్థితులకు వెళ్లే 108 వాహనానికి ఇక్కడ నిలుపుతున్న లారీలు ప్రధాన సమస్యగా మారాయి. దీంతో అత్యవసర వాహనం 108 కి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే పలుమార్లు పోలీసులు హెచ్చరించినా, సంబంధిత లారీ యజమానులు హెచ్చరికలను పట్టించుకోకుండా లారీలు నిలుపుతున్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

లయోలాలో సంస్కృతి కార్యక్రమం



బాలికల డ్యాన్స్

భారతీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో విద్యుల్లత విజువల్ కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం ఫ్రాంకోస్ 3.0 (సంస్కృతి కార్యక్రమం) ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సాంస్కృతిక శాఖ అధికారి డాక్టర్ ఎలీ శుభ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్, విభాగాధిపతి ఫాదర్ జి. రాయప్ప, వి జువల్ కమ్యూనికేషన్ అధ్యాపకులు ఎస్.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



రెండు మూడేళ్లలో క్షిపణి పరీక్ష కేంద్రం సిద్ధం

కేంద్ర రక్షణ శాఖ మంత్రి సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి

మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ (ఎంటీఆర్- క్షిపణి పరీక్ష కేంద్రం) నిర్మాణానికి కృష్ణా జిల్లా నాగాయలంక మండలంలోని గుల్లలమోద అత్యంత అనువైన ప్రదేశమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్ జి. సతీశ్ రెడ్డి అన్నారు. అక్టోబరు 10న పీఎం మోదీ నేతృత్వంలోని భద్రతావ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) గుల్లలమోదలో ఎంటీఆర్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. ఈ నేపథ్యంలో గుల్లలమోదలో ఎంటీఆర్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన సతీశ్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే... దేశంలో రెండో మిస్సైల్ టెస్టింగ్ రేంజి (ఎంటీఆర్) ఏర్పాటు ప్రతిపాదన 15 ఏళ్ల నాటిది. గుల్లలమోదలో వాతావరణ, భౌగోళిక పరిస్థితులను పర్యావరణ మార్పులను అధ్యయనం చేస్తూ వచ్చాం. రేంజి సేఫ్టీ వంటి అంశాలు పరిశీలించాం. వీటిని పరిగణనలోకి తీసుకుని గుల్లలమోద అత్యుత్తమ ప్రాంతంగా గుర్తించాం.

సేఫ్టీపరంగా భేష్

మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ కోసం ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసే ముందు చుట్టుపక్క కొన్ని కిలోమీటర్లలో జనావాసాలు ఉండరాదు. అనుకోని ప్రమాదం వస్తే ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. దీన్నే రేంజి సేఫ్టీ అంటాం. ఇక్కడ 6 కిలోమీటర్ల రేడియస్‌లో జనావాసాలు లేవు. పైగా సముద్రం లోతు తక్కువ. ఇవన్నీ కలిసొచ్చే అంశాలు. 5వేల కిలోమీటర్ల రేంజికి మించిన క్షిపణులనూ ఇక్కడ పరీక్షించవచ్చు.

వ్యూహాత్మక అవసరం

దేశంలో ప్రస్తుతం ఒడిశాలోని బాలాసోర్ వద్ద మాత్రమే క్షిపణి పరీక్ష కేంద్రం ఉంది. దేశంలో ఇటీవల క్షిపణుల తయారీ పెరిగింది. ఉన్న ఒక్క పరీక్ష కేంద్రానికి ఇబ్బందులొచ్చినా, శత్రుదేశాల దాడులకు గురైనా ప్రత్యామ్నాయంగా రెండో పరీక్ష కేంద్రం అవసరం. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా క్షిపణుల తయారీ జరుగుతోంది. అక్కడి నుంచి గుల్లలమోదకు ఐదారు గంటల్లో చేరుకోవచ్చు. ఈ కారణంగానూ గుల్లలమోద అనువుగా ఉంది.

రెండుమూడేళ్లలో సిద్ధం

రెండుమూడేళ్లలో ఎంటీఆర్ పూర్తయ్యే అవకాశాలున్నాయి. దీంతో అభివృద్ధిపరంగా ఈ ప్రాంత ముఖచిత్రం మారిపోనుంది. సుమారు 1000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని వేల మందికి ఉపాధి దొరుకుతుంది. మౌలిక సదుపాయాలు మెరుగవుతాయి.

దివి 'మిస్సైల్'

క్షిపణి పరీక్షలకు అనువైన ప్రాంతంగా గుల్లలమోద



(విజయవాడ, అవనిగడ్డ - ఆంధ్రజ్యోతి): గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం పనులను పునఃప్రారంభించేందుకు కేంద్రం అనుమతివ్వటంతో ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉంటుందని ఈ ప్రాంతవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశాలోని బాలాసోర్ కంటే అనువైన ప్రదేశం కోసం డీఆర్‌డీవో పరిశీలన చేపట్టగా, 2010లో నాగాయలంక మండలం గుల్లలమోద ప్రాంతం అనువైనదిగా డీఆర్‌డీవో గుర్తించింది. దీంతో డీఆర్‌డీవో అధికారులు దివి ప్రాంతంలో పర్యటించి క్షిపణి పరిశోధన కేంద్రం, రహదారుల ఏర్పాటుకున్న అవకాశాలను పరిశీలించి డీఆర్‌డీవోకు నివేదిక పంపించగా, గుల్లలమోదలో డీఆర్‌డీవో క్షిపణి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి 2011లో నివేదించింది. ఇందుకు 386 ఎకరాల భూమి కావాలని ప్రతిపాదించగా, 2014లో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు కేంద్రంతో చర్చించి 2017లో 351.61 ఎకరాల భూమిని కేటాయించింది. అనుమతుల కోసం ఈ భూమిని అటవీశాఖకు అప్పగించగా 2017లోనే 1352 జీవోను జారీ చేసి కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి తొలి దశ అనుమతులు వచ్చాయి. ఈ ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉండటంతో దాన్నుంచి కూడా మినహాయింపు కోరగా, 2018లో కేంద్రం మినహాయింపునిచ్చింది. అనంతరం 2019 ఆగస్టు 9న కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ రెండో దశ అనుమతులు కూడా ఇవ్వటంతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న డీఆర్‌డీవో చుట్టూ కాంపౌండ్ వాల్, పరిపాలన భవనం నిర్మించింది. నాటి డీఆర్‌డీవో చైర్మన్ సతీష్ రెడ్డి 2020-21 మధ్య ఈ ప్రాజెక్టును సందర్శించి పనులను పరిశీలించారు. తొలిదశలో రూ.1800 కోట్లకుపైగా నిధులతో నాటి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో శంకుస్థాపన చేయించి 2021లో పనులు పూర్తి చేయాలని డీఆర్‌డీవో భావించింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని గన్నవరం సమీపంలో అతిథిగృహాల నిర్మాణం, ముఖ్య శాస్త్రవేత్త నివాస సముదాయాలకు స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, నాటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్పందించకపోవటంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. పైగా ఈ ప్రాజెక్టును గుజరాత్ తరలించాలని భావించినా గుల్లలమోద ప్రాంత భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును ఇక్కడే కొనసాగిస్తే బాగుంటుందని డీఆర్‌డీవో కేంద్రానికి నివేదించింది. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకుంటే ప్రాజెక్టు ఎలా ముందుకు తీసుకెళ్తామంటూ కేంద్రం ఈ ఫైలును పక్కన పెట్టింది. ఇటీవల ఎన్నికల్లో మళ్లీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీవో పంపిన ప్రతిపాదనలకు అంగీకారం తెలపటంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. రానున్న ఐదేళ్లలో రూ.26వేల కోట్ల మేర డీఆర్‌డీవో ఖర్చు చేసే అవకాశాలున్నాయి.

> గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో నాలుగేళ్లుగా ఎలాంటి పురోగతి లేకుండా ఉన్న గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం పనులకు మోక్షం లభించింది. పనులు మళ్లీ పునఃప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇక దివి ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని స్థానికులు భావిస్తున్నారు. తొలుత ఈ ప్రాజెక్టును గుజరాత్ తరలించాలని భావించినా ఇక్కడున్న వాతావరణ అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇక్కడే కొనసాగించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇక్కడి నుంచి అయితేనే దాదాపు 5వేల కిలోమీటర్ల రేంజీ వరకు క్షిపణులను పరిశీలించవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

- దేశానికి రెండో క్షిపణి పరీక్ష కేంద్రం వ్యూహాత్మక అవసరం
- 5 వేల కిలోమీటర్ల రేంజ్‌కి మించిన క్షిపణులనూ పరీక్షించవచ్చు
- నాలుగేళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం పనుల పునఃప్రారంభానికి కేంద్రం అనుమతి
- స్థానికంగా మెరుగుపడనున్న ఉపాధి, మౌలిక సదుపాయాలు

అభివృద్ధి దిశగా దివి ప్రాంతం..

క్షిపణి పరీక్ష కేంద్రానికి భారీ వాహనాల రాకపోకలకు అనువుగా రహదారుల నిర్మాణం జరుగుతుందని, తద్వారా ఈ ప్రాంతానికి బయటి ప్రాంతాలతో కనెక్టివిటీ మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభమవటంతో మచిలీపట్నం నుంచి గుల్లలమోదకు రహదారి వచ్చే అవకాశం ఉందని, దీనికి తోడు రైల్వేలైన్ కూడా వచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఇప్పటికే రైల్వే మంత్రిత్వ శాఖ మచిలీపట్నం నుంచి బాపట్ల వరకు రైల్వేలైన్ ప్రతిపాదించగా, తొలి దశలో మచిలీపట్నం నుంచి రేపల్లె లేదా భట్టిప్రోలు వరకు గానీ రైల్వే లైన్ వేసేందుకు అంగీకరించినట్టు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఇటీవల ప్రకటించారు. ఈ రైల్వేలైన్ చల్లపల్లి మీదుగా నేరుగా భట్టిప్రోలు వెళ్తుందా, లేక చల్లపల్లి, మోపిదేవి మీదుగా రేపల్లె వైపు వెళ్తుందా? అన్న విషయంలో స్పష్టత రాలేదు. ఏదేమైనా ఈ ప్రాంతానికి రైల్వేలైన్ రాక తప్పనిసరి అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

మెరుగుపడనున్న ఉపాధి అవకాశాలు

దాదాపుగా రూ.26వేల కోట్ల ప్రాజెక్టు, అందునా రక్షణ రంగ ప్రాజెక్టు కావటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని స్థానికులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో డీఆర్‌డీవోకు విడి పరికరాలు తయారుచేసే వందలాది చిన్న చిన్న యూనిట్లు వెలిశాయని, అలాంటి అవకాశాలే ఇక్కడా మెరుగుపడతాయని డీఆర్‌డీవోకు విడిభాగాలు అందించే దివి పారిశ్రామికవేత్త ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కేంద్రానికి మౌలిక వసతులు సమకూర్చే క్రమంలో స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అలాగే కార్మికులకు ఓ టౌన్‌షిప్ వచ్చే అవకాశం ఉందని, దీంతో ఈ ప్రాంత ప్రజల రూపురేఖలు మారే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

భౌగోళిక పరిస్థితులు అనుకూలం

ఈ క్షిపణి పరీక్షా కేంద్రానికి ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులే అనుకూల అంశాలుగా డీఆర్‌డీవో భావిస్తుంది. ఎందుకంటే ఉపగ్రహం నుంచి ఈ ప్రాంతాన్ని పరిశీలించినా పరీక్షలు జరిపే స్థలంపై ఎక్కువ సమయం నీడ పడే అవకాశం ఉండటంతో రక్షణపరంగా అనుకూలంగా ఉందని, దీంతో ఇక్కడ జరిగే పరీక్షల గురించి ఇతర దేశాలు పసిగట్టే అవకాశం ఉండదని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు. దీనికి తోడు క్షిపణి పరీక్షలు నిర్వహించే ప్రదేశం గుల్లలమోదలో ఇప్పటికే నిర్మిస్తున్న పరిపాలన భవనం నుంచి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉండటం జనావాసాలపై ప్రభావం చూపకపోవటం పరీక్ష కేంద్రం ఏర్పాటుకు డీఆర్‌డీవో ఆసక్తి చూపటానికి మరో కారణం. అలాగే దివి ప్రాంతం చుట్టూ ఉండే సముద్రం ఎక్కువగా మెరక తేలి ఉండటంతో సముద్ర మట్టం గుండా ఈ ప్రాంతానికి ఇతర దేశాల రక్షణ ఓడలు రావటానికి ప్రతికూల అంశమని చెబుతున్నారు. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన జాలర్లు పొరపాటున భారత సముద్ర జలాల్లోకి వచ్చినప్పుడు వారి భారీ పడవలు నాగాయలంక నుంచి సముద్రంలో 10 -15 కిలోమీటర్ల దూరంలో మెరకలో చిక్కుపోవటాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నారు.



అభివృద్ధికి బాటలు

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నాగాయలంక మండలంలో క్షిపణి కేంద్రం ఏర్పాటుతో దివి ప్రాంత అభివృద్ధికి బాటలు పడతాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు సాధించి ప్రహరీ నిర్మించారని, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ సహకరించకపోవడంతో పనులు నిలిచి క్షిపణి కేంద్ర భవిత అనుమానాస్పదంగా మారిందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం, మోదీ సౌజన్యంలో క్షిపణి కేంద్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. దీనికి ప్రధాన కారకుడైన సతీశ్‌రెడ్డిని అభినందించారు. ఇక అభివృద్ధి ఊపందుకుంటుందని, అనుబంధ ల్యాబ్‌లు, ఇంటర్నేషనల్ సెంటర్లు, సప్లై పరిశ్రమలతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

'దివి' అభివృద్ధికి ఊతం

డాక్టర్ ఏవీఎల్ నారాయణ, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్, నాగాయలంక



కేంద్ర ప్రభుత్వం డీఆర్‌డీవో ప్రాజెక్టు పనులకు అనుమతినివ్వటం ఈ ప్రాంత అభివృద్ధికి ఊతమిచ్చినట్టే. రోడ్లవ్యవస్థ మెరుగవడటంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కొత్తగా డీఆర్‌డీవోకు అనుబంధంగా చిన్న తరహా పరిశ్రమలు వచ్చే అవకాశాలున్నాయి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండు

చన్నగిరి లతా మోహన్, వ్యాపారి, నాగాయలంక



డీఆర్‌డీవో ప్రాజెక్టుకు కేంద్రం అనుమతించటంతో ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనటంలో సందేహం లేదు. ప్రాజెక్టు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉంది. కొన్ని కారణాలతో పనులు నిలిచిపోవటం బాధించింది. తాజాగా కేంద్రం ఇక్కడే క్షిపణి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుని అనుమతులివ్వటం అభినందనీయం.



మిల్లులో బియ్యం రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

రైస్ మిల్లులో మంత్రి తనిఖీలు

- పీడీఎస్ బియ్యం స్వాధీనం ● మిల్లు సీజ్‌కు ఆదేశం

కంచికచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని ఒక రైస్ మిల్లుపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో కలిసి మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. కాకినాడ పోర్టుకు పంపించేందుకు లారీకి ఎగుమతి చేస్తున్న పాలిష్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలో ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో జాతీయ రహదారి పక్కన గల లక్ష్మీగణపతి రైస్ మిల్లుపై మంగళవారం రాత్రి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా దాడి చేసి క్షుణంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కాకినాడ పోర్టుకు పంపించేందుకు లారీకి బియ్యం ఎగుమతి చేస్తున్నారు. సగం లారీకి బియ్యం లోడ్ చేశారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎ. పాపారావు, ఎఎస్‌ఓ డి.లక్ష్మీనారాయణ, జిల్లా తూనికలు కొలతల అధికారి డి.రామ్‌కుమార్ తదితర అధికారులు ఉన్నారు. పాలిష్ చేసిన బియ్యాన్ని లారీకి లోడ్ చేస్తున్నారు. ఆ బియ్యంలో పీడీఎస్ బియ్యం కూడా ఉన్నట్టుగా గమనించారు. మొత్తం 103 టన్నుల బియ్యం ఉన్నట్టుగా రికార్డులను పరిశీలించి నిర్ధారించారు. అయితే బియ్యంతో పాటుగా మిల్లును సైతం సీజ్ చేయాల్సిందిగా మంత్రి మనోహర్, అధికారులను ఆదేశించారు. కాగా, సరిగ్గా నెల క్రితం ఈ మిల్లులోనే సెప్టెంబరు నెల 15వ తేదీన కంచికచర్ల పోలీసులు 540 సంచుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవటం గమనార్హం.

బీజేపీలోకి విద్యావేత్త శివకృష్ణ గౌడ్

విజయవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా నిమ్మకూరుకు చెందిన విద్యావేత్త జంపాని శివకృష్ణగౌడ్ బీజేపీలో చేరారు. నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మంగళవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఆయనను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శివకృష్ణగౌడ్ విజయవాడలో ఫోర్బ్స్ బిజినెస్ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. శివకృష్ణగౌడ్ తండ్రి బీజేపీలో కొనసాగారు. ఆయన బాటలోనే శివకృష్ణగౌడ్ పయనిస్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా పఖ్వాడా ప్రచారం

రైల్వేస్టేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో అక్టోబరు 1 నుంచి 15 వరకు నిర్వహించిన స్వచ్ఛతా పఖ్వాడా (15 రోజుల) ప్రచారం విజయవంతంగా ముగిసిందని విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఏ పాటిల్ చెప్పారు. మంగళవారం నగరంలోని డీఆర్ఎం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 1 నుంచి 15 వరకు "స్వభావ స్వచ్ఛతా, సంస్కార స్వచ్ఛతా" అనే అంశంపై జరిగిన పరిశుభ్రత స్పెషల్ డ్రైవ్ విజయవంతమైందన్నారు. పక్షం పాటు సాగిన ప్రచారంలో డివిజన్ పరిధిలో అధికారులు, సిబ్బంది, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్కౌట్స్, గైడ్స్, ఎన్జీవోలు చురుగ్గా పాల్గొన్నారన్నారు. డివిజన్‌లో సుమారు 820 కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. స్వచ్ఛతా హి సేవ ద్వారా అదనంగా 1303 కార్యక్రమాలు నిర్వహించిచామన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

- విధులకు ఆలస్యంగా రావడంతో కన్నెర్ర చేసిన ఇన్‌స్పెక్టర్ ● విధుల మార్పు మరో కారణం

విజయవాడ/గుణదల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మాచవరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ సోమవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించింది. భవానీపురంలో నివాసముంటున్న భవానీ మాచవరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వాసుపత్రిలో అవుట్ పోస్టు విభాగంలో విధులు నిర్వర్తిస్తోంది. ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ దసరా సందర్భంగా సిబ్బందికి కొత్త యూనిఫాం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి స్టేషన్‌లో రాత్రిపూట రోల్‌కాల్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్టేషన్ సిబ్బందిని సోమవారం రాత్రి రోల్‌కాల్‌కు పిలిచారు. వివిధ ప్రాంతాల్లో బీట్లకు వెళ్లే సిబ్బంది ఏమేం చేయాలో నిర్దేశించిన తర్వాత యూనిఫాం అందజేశారు. ఈ రోల్‌కాల్‌కు భవానీ ఆలస్యంగా వచ్చింది. దీంతో ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ కన్నెర్ర చేశారు. అందరి ముందు మందలించడంతో మనస్తాపం చెందిందని కొందరంటున్నారు. అయితే ఈ ఘటనకు మరో కారణం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్టులో భవానీ నాలుగేళ్లుగా పనిచేస్తోంది. అక్కడి నుంచి మార్చాలని ఇన్‌స్పెక్టర్ భావించినట్టు సమాచారం. ఈ రెండు కారణాలతో ఆమె ఇంటికి వెళ్తుండగా బీఆర్టీఎస్ రోడ్డులో నిద్రమాత్రలు మింగినట్టు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఈ విషయం మరో మహిళా కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి చెప్పింది. ఆమె వెంటనే స్టేషన్ అధికారులకు చెప్పడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని భవానీని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఇన్‌స్పెక్టర్ వేధించలేదు: దామోదర్, ఏసీపీ

భవానీ నాలుగేళ్లుగా ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్టులో పనిచేస్తోంది. సోమవారం రాత్రి స్టేషన్ డ్యూటీ చేయాలని ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ ఆదేశాలిచ్చారు. యూనిఫాంలో డ్యూటీకి రాకపోవడంతో డ్రెస్‌కోడ్ పాటించకపోవడం మంచిపద్ధతి కాదని ఇన్‌స్పెక్టర్ మందలించారు. దీంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. భవానీని ఇన్‌స్పెక్టర్ వేధించారన్నది అవాస్తవం.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

'ఇన్ఫోసిస్' సహకారం అభినందనీయం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన వరదలకు నష్టపోయిన బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండటంతో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అందించిన సహకారం మరువలేనిదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం భవానీపురం స్వాతిరోడ్డులోని ఎన్డీయే కార్యాలయంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో సుజనా ఫౌండేషన్, రామకృష్ణా ఆశ్రమం ఆధ్వర్యంలో 3వేల మంది వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వరద బాధితులకు రామకృష్ణా సేవా ఆశ్రమం అధ్యక్షుడు జపానంద స్వామి, ఇన్ఫోసిస్ సహకారంతో 3వేల మంది వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేయటం, ఎమ్మెల్యే సుజనా చౌదరి లక్షలాది మందికి భోజనాలు, నిత్యావసర సరుకులు, తాగునీరు, వైద్య సేవలు అందించటం అభినందనీయమన్నారు. రామకృష్ణా సేవా ఆశ్రమం అధ్యక్షుడు జపానంద స్వామి, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఇన్ఫోసిస్ వైస్ చాన్సలర్ వెంకటేశ్వర్లు, బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో మృతదేహం లభ్యం

విజయవాడ రూరల్, పాయకాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం సహా అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో పడి ఓ యువకుడు మృతి చెందాడు. రెండ్రోజుల తర్వాత మృతదేహాన్ని గుర్తించిన నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. న్యూ రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ సుల్తాన్ (23) ఇంజనీరింగ్ చదువు మధ్యలో ఆపేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 13న రాత్రి 10.30 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఈనెల 14న నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కండ్రిక సెంటర్ నుంచి రామవరప్పాడు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్‌లో సుల్తాన్ పడి ఉండటాన్ని స్థానికుల ద్వారా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సుల్తాన్ మృతదేహానికి 150 మీటర్ల దూరంలో అదే కాలువలో ద్విచక్రవాహనం పడి ఉండటాన్ని గుర్తించి బయటకు తీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సుల్తాన్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న సిబ్బంది

దుర్గగుడిలో భవానీల రద్దీ



వన్‌టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి మంగళవారం సాధారణ భక్తులతో పాటు భవానీలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దసరా ఉత్సవాలు 12న ముగిసినా భవానీల తాకిడి కొనసాగుతూనే ఉంది. కృష్ణమ్మ చెంత స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పించుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. క్యూలైన్లలో భవానీలు జై భవానీ, జైజై దుర్గాభవానీ అంటూ నినదించటంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈవో కేఎస్ రామారావు భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. తాగునీరు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. కనకదుర్గానగర్, అర్జునవీధి, రథం సెంటర్ దుకాణాల వద్ద భవానీల సందడి అధికంగా ఉంది.

విష్ణు ఓవర్సీస్‌పై చర్యలు తీసుకోండి

- జనసేన జనవాణిని ఆశ్రయించిన బాధితులు



వన్‌టౌన్, అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ యువతను నిండా ముంచి కోట్లాది రూపాయలు దోచుకున్న విష్ణు ఓవర్సీస్ సంస్థ నిర్వాహకులు సూరాబత్తుని కృష్ణ చైతన్య, లక్ష్మీశెట్టి జయరాంపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆ సంస్థ బాధితులు జనసేన జనవాణిని ఆశ్రయించారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా విష్ణు ఓవర్సీస్ వ్యవహారాన్ని బాధితులు ఎమ్మెల్యేకు వివరించి వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే ఈ వ్యవహారాన్ని హోం మంత్రి వంగలపూడి అనితకు తెలిపి సీఐడీతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి కూడా తీసుకువెళతామని బాధితులకు హామీ ఎమ్మెల్యేతో పాటు పార్టీ నేతలు సుందర రామిరెడ్డి, ఆర్.అజయ్ వర్మ, తిరుపతి అనూష పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమన్యాయం చేయండి

- చంద్రబాబుకు కేపీ రావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ సీట్ల భర్తీ, ఉన్నత విద్యాభ్యాసానికి, ఉద్యోగాల భర్తీ వ్యవహారాల్లో ప్రతిభ కలిగిన జాతీయ, అంతర్జాతీయ పతకాలను సాధించిన క్రీడాకారులకు కులం పరిగణనలోకి తీసుకోకుండా సమ న్యాయం పాటించేలా జీవోను సవరించాలని రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కేపీ రావు సీఎం చంద్రబాబుకు మంగళవారం రాసిన లేఖలో కోరారు. కుల రిజర్వేషన్లు స్పోర్ట్సు కోటాకు వర్తించదని, ఎన్‌సీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్ దివ్యాంగులకూ కులం రిజర్వేషన్లు వర్తించనప్పుడు క్రీడాకారులకు అవసరం లేదని, దీన్ని పరిశీలించాలని, క్రీడాకారులకు ఆర్టీసీ బస్సు ప్రయాణంలో రాయితీ కల్పించాలని అభ్యర్థించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 16 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

ఫ్లెక్సిబుల్ విధానం అవసరం



తెలుగు చిత్ర పరిశ్రమకు ఓటీటీతో పాటు సినిమా టికెట్ ధరల విషయంలోనూ ఇబ్బందులు ఉన్నాయని, ఇందు కోసం ఫ్లెక్సిబుల్ విధానం తీసుకురావాలని ఏపీ ఫిల్మ్ చాంబర్ మాజీ అధ్యక్షుడు, పూర్ణా పిక్చర్స్ ఎండీ గ్రంధి విశ్వనాథ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఫ్లెక్సిబుల్ విధానం ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉందనీ, ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. విశ్వనాథ్ సూచనలు విన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించి ఈ వివరాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

మీ నమ్మకమే నా ధైర్యం!



తన తాజా చిత్రం 'దేవర 1'ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జూనియర్ ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కొరటాల శివ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం భారీ ఓపెనింగ్స్ సాధించడమే కాకుండా రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించినందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అందుకే ఈ విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు, అభిమానులకు, చిత్ర బృందానికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్ మంగళవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. 'తన అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ 'మా కంటే ఈ సినిమాను ఎక్కువగా సెలబ్రేట్ చేసిన అభిమానులకు, ప్రేక్షకులకు థాంక్స్. మీ ప్రేమాభిమానాలను చూసి నాకు నోట మాట రావడం లేదు. నా వెన్నంటే ఉంటూ అంతులేని ప్రేమను పంచుతూ సపోర్ట్ చేస్తున్న నా అభిమానుల రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేను. మీరు చూపించే ప్రేమ వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగా. మీరు నా మీద పెట్టుకున్న నమ్మకమే నాకు ఎప్పుడూ ధైర్యాన్ని, శక్తిని ఇస్తుంటుంది. మీరు గర్వపడేలా చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటా' అన్నారు. చిత్ర దర్శకుడు కొరటాల శివకు, నిర్మాతలు సుధాకర్ మిక్కిలినేని, హరికృష్ణ కొసరాజుకు ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

అలరించే హనీ - బన్నీ



సమంత

వరుణ్‌ధావన్, సమంత జంటగా నటించిన వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. నవంబర్ 7 నుంచి ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ట్రైలర్‌ను మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారు. 90వ దశకం నేపథ్యంలో సాగే స్పై థ్రిల్లర్ ఇది. హాలీవుడ్ స్థాయి యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ 'అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన వెబ్‌సిరీస్ ఇది. ఈ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌లో అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. హనీ పాత్ర నటిగా నాకు సవాల్ విసిరింది. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఇది నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన పాత్ర' అని చెప్పారు. యాక్షన్ సన్నివేశాల కోసం నా శక్తికి మించి కష్టపడ్డాను అని వరుణ్‌దావన్ అన్నారు. ఒక సరికొత్త ప్రపంచంలో భాగమయ్యే అవకాశం 'హనీ బన్నీ'తో దక్కిందని రాజ్ అండ్ డీకే తెలిపారు.

కడుపుబ్బా నవ్విస్తుంది



'దృశ్యకావ్యం' ఫేమ్ రామ్‌కార్తీక్ నటించిన మిస్టరీ కామెడీ థ్రిల్లర్ 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో రామ్‌కార్తీక్, దర్శకుడు మనోజ్ పల్లేటి, సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి మీడియాతో ముచ్చటించారు. రామ్ కార్తీక్ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే ఆసక్తికరంగా అనిపించింది. ఇందులో నా పాత్ర.. ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకునే ఉత్సాహంతో అనుకోని సమస్యల్లో ఇరుక్కోవడం.. వాటిలోంచి బయటపడడమే కథాంశం. సినిమా మొత్తం చాలా వినోదాత్మకంగా.. గ్రిప్పింగ్‌గా ఉంటుంది" అని చెప్పారు. దర్శకుడు మనోజ్ మాట్లాడుతూ "ఈ సినిమా అద్భుతమైన థ్రిల్‌ని పంచడంతో పాటు కడుపుబ్బా నవ్విస్తుంది. ఓ కొత్త దర్శకుడిగా ఈ సినిమా షూట్‌లో ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి" అని చెప్పారు. "అన్ని ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. ఇందులో ఉన్న మూడు సాంగ్స్ చాలా బాగా వచ్చాయి" అని అన్నారు.

నిరీక్షణ ఎవరికోసమో!



పీకాక్ మూవీ బ్యానర్‌పై సాయి వర్మ దాట్ల దర్శకత్వంలో నిర్మాత పి.సంతోష్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నా నిరీక్షణ'. అమర్ దీప్, లిషి గణేష్ కల్లపు హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, సురేష్ బాబుతోపాటు రాజా రవీంద్ర వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డైరెక్టర్ సాయి వర్మ దాట్ల మాట్లాడుతూ.. 'సినిమా కథ గురించి ఇప్పుడే చెప్పలేను కానీ ఓ మంచి చిత్రాన్ని అయితే తీస్తున్నాను' అని తెలిపారు. అమర్ దీప్ మాట్లాడుతూ.. 'హీరోగా ఇది నా రెండో చిత్రం. బిగ్ బాస్ తరవాత సెలెక్ట్ చేసుకున్న ఫస్ట్ స్క్రిప్ట్ ఇది' అని అన్నారు. కాగా, ఈ సినిమాకు శేఖర్ చంద్ర సంగీత సారథ్యం వహిస్తున్నారు.

రీల్ లైఫ్ ప్రేమికులు.. రియల్ లైఫ్ దంపతులు..!













రీల్ లైఫ్‌లో ప్రేమికులుగా నటించారు. ప్రేక్షకులను మెప్పించారు. అంతేనా...అవే జంటలు రియల్ లైఫ్‌లోనూ ప్రేమలో పడ్డాయి. ఆ ప్రేమను వివాహ బంధంతో పెనవేశారు. ఆదర్శవంతమైన జీవితం గడిపారు. అన్యోన్య దంపతులుగా గుర్తింపు పొందారు. కృష్ణ- విజయ నిర్మల, రాజశేఖర్- జీవిత, నాగార్జున-అమల, శ్రీకాంత్-ఊహా, మహేశ్ బాబు- నమ్రత జంటలు ఈ కోవకే చెందుతాయి. వీరిని ఆదర్శంగా తీసుకున్నారు నేటి తరం టాలీవుడ్ హీరో- హీరోయిన్లు.

V 2014లో విడుదలైన 'ముకుంద' సినిమాతో తెలుగు తెరకు హీరోగా పరిచయమయ్యారు కొణిదెల సాయి వరుణ్ తేజ్. ఆ తరవాత కంచె, ఫిదా, లోఫర్, ఎఫ్3 వంటి విజయవంతమైన చిత్రాల్లో హీరోగా నటించారు. 2012లో అందాల రాక్షసి చిత్రంతో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు లావణ్య త్రిపాఠి. 2017లో విడుదలైన మిస్టర్ సినిమాలో వరుణ్ తేజ్ - లావణ్య త్రిపాఠి తొలిసారిగా కలిసి నటించారు. ఆ తరవాత వచ్చిన 'అంతరిక్షం' లోనూ ఈ జంట ప్రేక్షకులను మెప్పించింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య మొదలైన స్నేహం ప్రేమగా మారింది. గతేడాది నవంబరులో వీరిద్దరు వివాహం చేసుకున్నారు.

V నాగ చైతన్య అక్కినేని, శోభిత ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం ఇటీవల జరిగింది. 2017లో సమంతను నాగ చైతన్య ప్రేమ వివాహం చేసుకున్నారు. 2021లో విడాకులు తీసుకున్నారు. ఆ తరవాత నాగ చైతన్య, శోభిత చాలా సార్లు కలిసి కనిపించారు. వీరిద్దరి మధ్య ప్రేమ నడుస్తోందనే వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై ఎవరూ స్పందించకపోయినప్పటికీ నిశ్చితార్థంతో వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ప్రస్తుతం నాగ చైతన్య 'తండేల్' సినిమాతో బిజీగా ఉన్నారు. 'మంకీ మ్యాన్' హాలివుడ్ సినిమాలో శోభిత ధూళిపాళ్ల నటించారు. ప్రస్తుతం 'సితార' అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు. వీరిద్దరి పెళ్లి ఎప్పుడనే విషయం తరవాత వెల్లడికానుంది.

V 'బాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యారు నారా రోహిత్, ఆ తరవాత అసుర, సుందరకాండ వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో హీరోగా నటించారు. 'ప్రతినిధి 2'లో నారా రోహిత్ సరసన నటించారు సిరి లేళ్ల. ఈ సినిమా షూటింగ్ కొనసాగుతుండగానే వీరిద్దరి మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. దాంతో ఇటీవల బంధు, మిత్రుల సమక్షంలో వీరిద్దరి నిశ్చితార్థం జరిగింది. సిరి లేళ్ల తెలుగమ్మాయే. ఏపీలోని రెంటచింతల ఆమె స్వగ్రామం. ఆస్ట్రేలియాలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమె నటనపై మక్కువతో ఇండియాకు తిరిగి వచ్చారు. వీరి వివాహం డిసెంబరులో జరగనుంది.

V 'రాజా వారు రాణిగారు' సినిమాతో ఎంట్రీ ఇచ్చారు కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్. తొలి చిత్రంతోనే అందమైన జంటగా గుర్తింపు తెచ్చుకున్నారు. నిజ జీవితంలోనూ ప్రేమికులుగా మారారు. అయితే ఐదేళ్ల ప్రేమ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన తమ నిశ్చితార్థంతో ప్రేమ విషయాన్ని అధికారికంగా తెలియజేశారు. ఈ ఏడాది ఆగస్టు 22న కర్ణాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకున్నారు. కాగా, కిరణ్, రహస్య ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. సినిమాలపై మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం కిరణ్ నటిస్తున్న 'క' చిత్ర నిర్మాణ వ్యవహారాలను రహస్య పర్యవేక్షిస్తున్నారు.

V ప్రముఖ దర్శకుడు రవిరాజా పినిశెట్టి వారసుడిగా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు ఆది పినిశెట్టి. వైవిధ్యమైన పాత్రలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించాడు. కేవలం హీరో పాత్రలకే పరిమితం కాకుండా సపోర్టింగ్ రోల్స్ కూడా చేస్తూ ప్రత్యేకత ను చాటుతున్నారు. 2016లో 'కృష్ణాష్టమి' లో సునీల్ సరసన నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యారు నిక్కీ గల్రానీ. ఆ తరవాత ఆది పినిశెట్టితో కలిసి 'మలుపు, మరకత మణి' చిత్రాల్లో నటించారు. 'మలుపు' సినిమా వీరిద్దరి జీవితాల్ని ప్రేమ వైపు మలుపు తిప్పింది. 2022 మే నెలలో వీరిద్దరి వివాహం జరిగింది.

V 2007లో విడుదలైన 'హ్యాపీడేస్'తో తెలుగు తెరపై అరంగేట్రం చేశారు వరుణ్ సందేశ్. ఆ చిత్ర విజయంతో వరుసగా అవకాశాలు చేజిక్కించుకుని నటునిగా స్థిరపడ్డాడు. 2015లో విడుదలైన 'పడ్డానండి ప్రేమలో మరి' సినిమాలో వరుణ్ సందేశ్ సరసన హీరోయిన్‌గా నటించారు వితిక షేరు. సినిమా షూటింగ్ సమయంలోనే ఇద్దరి మధ్య ప్రేమ మొదలైంది. 2016లో పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు.

సిక్స్ ప్యాక్‌తో..



శారీరకంగా, డిక్షన్ పరంగా మరింత మెరుగ్గా కనిపించడానికి కృషి చేస్తున్నానని హీరో సాయిదుర్గా తేజ్ ఆ మధ్య వెల్లడించారు. ఆ విషయం నిజమేననిపించింది ఆయన తాజా చిత్రం మేకింగ్ వీడియో చూసిన తర్వాత. సాయిదుర్గా తేజ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ వీడియో విడుదల చేశారు. 'ఎస్‌డీటీ 18' అనే వర్కింగ్ టైటిల్‌లో రూపొందుతున్న చిత్రమిది. 'ధైర్యాన్నే తన కవచంగా, ఆశనే ఆయుధంగా చేసుకున్న ఈ వ్యక్తి అందరికోసం నిలబడతాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే' అనే క్యాప్షన్‌తో వీడియో ఉంది. ఇందులో సాయితేజ్ లుక్ చూపించలేదు కానీ సిక్స్ ప్యాక్‌తో కండలు తిరిగిన ఆ దేహాన్ని వెనుక నుంచి చూపించడం విశేషం. ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్‌కు మేకర్స్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

అల్లు అర్జున్ అభినందించారు



'ఇప్పుడు ప్రేక్షకులు కంటెంట్ నచ్చితేనే థియేటర్‌కు వస్తున్నారు. మా సినిమా టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఏదో కొత్త కంటెంట్ ఉండబోతోందనే వైబ్ క్రియేట్ అయింది. మా సినిమా తొలి రోజు షూటింగ్‌కు అల్లు అర్జున్ వచ్చి పెద్ద హిట్ కావాలని ఆశీస్సులు అందించారు. ఈ నెల 31న చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. పోటీ బాగా ఉంది. అయితే మా సినిమా కొన్న వంశీ నందిపాటికు, మాకు కంటెంట్ మీద నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే సినిమాను ఆ రోజు విడుదల చేస్తున్నాం' అని చెప్పారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన భారీ పీరియడికల్ ఫిల్మ్ 'క' విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. నాలుగు భాషల్లో విడుదలవున్న ఈ సినిమాతో సుజీత్, సందీప్ దర్శకులుగా పరిచయవవుతున్నారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సినిమాలో జాతర సాంగ్ అలరిస్తుందనీ, అలాగే 15 నిమిషాల సేపు ఉండే యాక్షన్ సీన్‌కు మంచి రెస్పాన్స్ వస్తుందనీ కిరణ్ చెప్పారు. '70 వ దశకం నేపథ్యంలో 'క' సినిమా సాగుతుంది. అభినవ్ వాసుదేవ్ అనే ఓ పోస్ట్‌మ్యాన్ జీవితంలో జరిగే కథ ఇది. స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా ఇది' అని దర్శకులు చెప్పారు.

అలరించేలా సందేశం



కన్నడ నటి ప్రియాంక ఉపేంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఉగ్రావతారం'. గురుమూర్తి దర్శకత్వంలో ఎస్.జీ.సతీశ్ నిర్మిస్తున్నారు. నవంబర్ 1న విడుదల కానుందీ సినిమా. మంగళవారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు గురుమూర్తి మాట్లాడుతూ "ఇదో సందేశాత్మక చిత్రం. అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "నా కెరీర్‌లో ఇదే తొలి యాక్షన్ ఫిల్మ్. ఈ సినిమా కోసం టీమ్ అందరూ చాలా కష్టపడ్డారు. సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని హీరోయిన్ ప్రియాంక ఉపేంద్ర అన్నారు.

అంచనాలకు మించి...



వి. సముద్ర, దర్శకుడిగా తన కుమారులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్‌లను హీరోలుగా పరిచయం చేస్తున్న చిత్రం 'దోకమీనే'. చంద్రపులుగుజ్జు నిర్మిస్తున్నారు. సుమన్, తన్మయి, శ్రీరాధా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఇటీవలే ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు సముద్ర మాట్లాడుతూ "ఈ సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

మరపురాని క్షణాలు...



నటి పూజ హెగ్డే ఇటీవలే తన 34వ పుట్టినరోజును శ్రీలంకలోని ఓ రిసార్ట్‌లో తన కుటుంబంతో సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ ట్రిప్‌కు సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్‌మీడియాలో అభిమానులతో షేర్ చేసుకున్నారు. "అందమైన ప్రకృతిలో జన్మదిన వేడుక.. శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు. ఈ అద్భుతమైన క్షణాల్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నా" అని పేర్కొన్నారు. సినిమాల పరంగా.. తెలుగులో చివరగా 'ఆచార్య', 'రాధే శ్యామ్' సినిమాల్లో నటించారీ బ్యూటీ. ప్రస్తుతం తమిళ్‌లో కార్తీక సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'సూర్య 44'.. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ ఆఖరి చిత్రం 'విజయ్ 69' సినిమాల్లో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో షాహిద్ కపూర్ సరసన ఆమె నటించిన 'దేవా' చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

కొత్తగా..

రాకీ వచ్చేది ఎప్పుడంటే..



విష్వక్సేన్ హీరోగా నటిస్తున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని నవంబర్ 22న విడుదల చేయనున్నట్లు నిర్మాత రామ్ తాళ్లూరి చెప్పారు. ఈ నెల 20న ట్రైలర్ విడుదల చేస్తామని తెలిపారు. ఇందులో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు.

1980 బ్యాక్ డ్రాప్‌లో...



సన్ రైజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాత స్వాతి సుధీర్ నిర్మిస్తున్న సినిమా రామ్ భజరంగ్. రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సి.హెచ్. సుధీర్ దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందించారు. 'గదర్ 2' హీరోయిన్ సిమ్రత్ కౌర్, బిచ్చగాడు ఫేమ్ సట్నా టీటస్, ఛాయాదేవి, మనసా రాధాకృష్ణన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 1980 బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని చిత్ర యూనిట్ విడుదల చేసింది. యాక్షన్‌తోపాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉండే ఈ సినిమాను వచ్చే ఏడాది ఐదు భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్



'డియర్ మేఘ', 'భాగ్ సాలే' వంటి భిన్నమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న సంస్థ వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్. అర్జున్ దాస్యన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సంస్థ ప్రస్తుతం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్' చిత్రాన్ని నిర్మిస్తోంది. నూతన దర్శకుడు అశోక్ రెడ్డి కడదూరి రూపొందిస్తున్న ఈ చిత్రంలో రాహుల్ విజయ్, నేహా పాండే హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్, టైటిల్‌ను వర్సటైల్ యాక్టర్ రానా దగ్గుబాటి లాంచ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

యాక్షన్ ప్రేమ కథ 'కాక్రోచ్'



పి. సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ పిక్చర్స్, ఆదిత్య సినిమాస్ సంయుక్త బ్యానర్‌పై బి. బాపిరాజు, ముతుకి నాగ సత్యనారాయణ నిర్మిస్తున్న చిత్రం 'కాక్రోచ్'. ఈ చిత్రం టైటిల్‌ని యూనిట్ ప్రకటించింది. 'విశాఖపట్నం నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ప్రేమ కథ, పాత కొత్త నటీనటుల మేళవింపుతో విభిన్న కథాంశంతో సాగుతుంది. చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకు తేవడానికి ప్రయత్నిస్తున్నాం' అని చిత్ర బృందం తెలిపింది.

కృష్ణ భక్తుని కథ



పీఎన్‌బీ సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ డియర్ కృష్ణ. దినేశ్ బాబు దర్శకత్వంలో పీఎన్ బలరామ్ నిర్మిస్తున్నారు. అక్షయ్ హీరోగా మమిత బైజు, ఐశ్వర్య హీరోయిన్లు. నిర్మాత పీఎన్ బలరామ్ మాట్లాడుతూ... 'నిజ జీవిత ఘటనల ఆధారంగా కథను రూపొందించాం. శ్రీ కృష్ణుణ్ణి నమ్మే ఒక భక్తుడి కథ ఇది. నేటి తరం అభిరుచికి తగ్గట్టుగానే ఈ కథను తెరకెక్కించాం' అని తెలిపారు.

పతంగుల పోటీ



పతంగుల పోటీ కథతో రూపుదిద్దుకున్న స్పోర్ట్స్ డ్రామా 'పతంగ్'. డిసెంబర్ 27న విడుదల కానుంది. ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమ రన్నరప్ ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషించారు. అలాగే ఎస్పీ చరణ్ ఓ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రాన్ని ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో విజయశేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మించారు. నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాత. యూత్ ఫెస్టివల్‌లా ఈ సినిమా ఉంటుందనీ, చిత్రానికి కథే హీరో అని నిర్మాతలు చెప్పారు.

పవర్‌ఫుల్ పోలీస్



తమిళ, కన్నడ భాషల్లో విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురుప్రసాద్ దర్శకుడు. లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని ఆర్కే ఫిల్మ్స్ దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆర్కే ఫిల్మ్స్ అధినేత, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ...' లక్ష్మీ రాయ్ పవర్‌ఫుల్ ఐపీఎస్ క్యారెక్టర్ పాత్రలో నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన ఎనిమిది ఫైట్స్ ఆమె కెరీర్‌లో నిలిచిపోతాయి. త్వరలో ట్రైలర్‌ను, నవంబరులో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

భారత్‌ను ఆపతరమా?

జోరు మీదున్న రోహిత్ సేన



వరుస ఓటములతో కివీస్ • నేటి నుంచి తొలి టెస్టు

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్18లో..

బెంగళూరు: ఓవైపు సొంత గడ్డపై వరుసగా 18 టెస్టు సిరీస్‌లను ఖాతాలో వేసుకున్న టీమిండియా..మరోవైపు స్వదేశంలో ఆసీస్‌పై, తర్వాత శ్రీలంక టూర్‌లోనూ వైట్‌వాష్‌కు గురై ఆత్మవిశ్వాసం పూర్తిగా అడుగంటిన న్యూజిలాండ్ జట్టు. ఇప్పుడీ రెండు జట్లమధ్య మూడు టెస్టుల సిరీస్‌కు సమయం ఆసన్నమైంది. ఇందులో భాగంగా నేటి నుంచి చిన్నస్వామి స్టేడియంలో తొలి టెస్టు జరుగనుంది. అన్ని విభాగాల్లో దూకుడుమీదున్న రోహిత్ సేనను కివీస్ ఏమేరకు అడ్డుకోగలుతుందనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. కీలక ప్లేయర్లు గాయాలతో దూరమైన వేళ పర్యాటక జట్టు తమ స్థాయికి మించిన ప్రదర్శన కనబర్చాల్సి ఉంది. కివీస్ ఇప్పటివరకు భారత్‌లో టెస్టు సిరీస్ గెలవకపోవడం గమనార్హం. మరోవైపు ఇటీవలే బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించి సిరీస్ దక్కించుకున్న భారత జట్టు రెట్టించిన ఉత్సాహంతో కివీస్‌ను కకావికలం చేయాలనుకుంటోంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌లో చోటును ఆశిస్తున్న ఆతిథ్య జట్టుకు ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం చాలా అవసరం.



కివీస్ కెప్టెన్ లేథమ్

సమస్యల వలయంలో..

తొలి టెస్టుకు ముందే కివీస్ జట్టును సమస్యలు చుట్టుముట్టాయి. తమ ప్రధాన బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఈ టెస్టుకు దూరం కాగా పేసర్ బెన్ సియర్స్ గాయంతో సిరీస్ నుంచే తప్పుకొన్నాడు. అతడి స్థానంలో అన్‌క్యాప్డ్ జాకబ్ డఫీని తీసుకున్నారు. ఇక వీరి బ్యాటింగ్ విభాగం కూడా పేలవ ఫామ్‌తో ఉంది. లంక స్పిన్నర్ల ధాటికి ఒక్కరు కూడా సెంచరీ చేయలేకపోయారు. ఇక పదునైన భారత పేసర్లు, నాణ్యమైన స్పిన్నర్లను ఎదుర్కోవడం సవాల్‌గా మారనుంది. కొత్త కెప్టెన్ టామ్ లేథమ్, కాన్వే, మిచెల్ కూడా ఫామ్‌లో లేరు. బౌలింగ్‌లో కొత్త పేసర్ విల్ ఓరూర్కె, స్పిన్నర్ ఎజాజ్ పటేల్‌పైనే జట్టు ఆశలు పెట్టుకుంది. కివీస్ ఇక్కడి చివరి పర్యటనలో ఎజాజ్ పదికి పది వికెట్లతో అబ్బురపరిచాడు. సీనియర్లు సౌథీ, శాంట్నర్ లంక టూర్‌లో ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో భారత బ్యాట్స్‌మన్‌ను ఇబ్బందిపెట్టాలంటే కివీస్ బౌలర్లు చెమటోడ్చాల్సిందే.

వరుణుడితో ఇబ్బందే

బెంగళూరులో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తొలి టెస్టు సజావుగా సాగే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే మంగళవారం కురిసిన వర్షానికి ఇరు జట్ల ప్రాక్టీస్ కూడా రద్దయ్యింది. దీనికి తోడు బుధవారం కుంభవృష్టికి చాన్స్ ఉండడంతో ఎల్లో అలర్ట్ జారీ చేస్తూ స్థానిక పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో మొదటి రోజు ఆటగాళ్లు బరిలోకి దిగడం కష్టమే. రానున్న మూడు, నాలుగు రోజులు కూడా ఇదే పరిస్థితి ఉండనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు చిన్నస్వామి స్టేడియంలో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఉండడం అభిమానులకు కాస్త ఊరటనిచ్చే అంశం.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్/సర్ఫరాజ్, విరాట్, పంత్, రాహుల్, జడేజా, అశ్విన్, ఆకాశ్‌దీప్/కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

న్యూజిలాండ్ : కాన్వే, లేథమ్ (కెప్టెన్), విల్ యంగ్, రచిన్, మిచెల్, బ్లండెల్, ఫిలిప్స్, శాంట్నర్/బ్రేస్‌వెల్, సౌథీ, ఓరూర్కే, ఎజాజ్.

పిచ్

ఇక్కడి పిచ్ సహజంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. అయితే వాతావరణ పరిస్థితి కారణంగా పిచ్‌ను కొన్ని రోజులుగా కవర్లతో కప్పి ఉంచారు. 2022లో ఈ చిన్నస్వామి స్టేడియంలో జరిగిన చివరి టెస్టులో భారత్-శ్రీలంక జట్లు ముగ్గురేసి స్పిన్నర్లతో బరిలోకి దిగాయి.

రోహిత్, విరాట్ చెలరేగాల్సిందే..

భారత జట్టు వరుస విజయాలు ఎలా ఉన్నా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనపరుస్తోంది. బంగ్లాతో సిరీస్‌లో ఈ జోడీ కనీసం అర్ధసెంచరీ చేయలేకపోయింది. రోహిత్ ఈ ఏడాది ఆడిన 15 ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు మాత్రమే సాధించాడు. ఇక కోహ్లీ ఆడిన ఆరు ఇన్నింగ్స్‌లో కనీసం ఓ హాఫ్ సెంచరీ కూడా లేదు. న్యూజిలాండ్ స్పిన్నర్లు ఎజాజ్ పటేల్, రచిన్ గతంలో విరాట్‌ను ఇబ్బందిపెట్టారు. ఏదిఏమైనా ముున్ముందు ఆసీస్‌తో సిరీస్ ఆడాల్సి ఉండడంతో వీరు తమ పరుగుల దాహాన్ని తీర్చుకోవాల్సిందే. ఇక ఓపెనర్ గిల్ మెడ సమస్యతో ఈ టెస్టుకు అందుబాటులో ఉండేది సందేహంగా మారింది. అతను ఆడలేకపోతే సర్ఫరాజ్‌ను బరిలోకి దించే చాన్సుంది. మరో ఓపెనర్ జైస్వాల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతడి చివరి 8 ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో పాటు ఐదు అర్ధసెంచరీలుండడం విశేషం. నేటి ఉదయం వాతావరణ పరిస్థితిని బట్టి అదనపు స్పిన్నర్‌తో వెళ్లాలా? లేక పేస్ త్రయం బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్‌లతో బరిలోకి దిగాలా? అనేది నిర్ణయించనున్నారు.

ఎవరితో ఎవరు	ఆస్ట్రేలియా X సౌతాఫ్రికా (గురువారం)
	వెస్టిండీస్ X న్యూజిలాండ్ (శుక్రవారం)

సెమీస్‌లో వెస్టిండీస్

- ఆఖరి లీగ్‌లో ఓడిన ఇంగ్లండ్ అవుట్
- దక్షిణాఫ్రికా ముందంజ •వరల్డ్‌కప్

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఆఖరి లీగ్ మ్యాచ్ నెగ్గిన వెస్టిండీస్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన ఇంగ్లండ్ టోర్నీ నుంచి నాకౌట్ అయ్యింది. గ్రూపులో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ తలా ఆరేసి పాయింట్లతో నిలిచాయి. అయితే అత్యుత్తమ రన్‌రేట్‌తో విండీస్ అమ్మాయిలు (+1.504) అగ్రస్థానం కైవసం చేసుకోగా, సఫారీలు (+1.382) రెండో స్థానంలో నిలిచారు. ఇక ఇంగ్లండ్ (+1.117) మూడో స్థానంతో వైదొలగింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలుత 141/7 స్కోరు చేసింది. స్కివర్ బ్రెంట్ (57)తో సత్తా చాటింది. ఫ్లెచర్ మూడు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో వెస్టిండీస్ 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి నెగ్గింది. క్వియానా (52), హేలీ మాథ్యూస్ (50) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు.

రెండో టీ20 లంకదే!

దంబుల్లా: స్పిన్నర్ దిముత్ వెల్లలగే (3/9) తిప్పేయడంతో.. రెండో టీ20లో శ్రీలంక ఘన విజయం సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లంక 73 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసి మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలుత శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 162/5 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు పథుం నిస్సంక (54) రాణించాడు. ఛేదనలో విండీస్ 16.1 ఓవర్లలో 89 పరుగులకు కుప్పకూలింది. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సిరీస్ నిర్ణాయక ఆఖరి, మూడో టీ20 గురువారం జరగనుంది.

సింధు ముందంజ

లక్ష్యసేన్ ఓటమి
డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్: పీవీ సింధు డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేసింది. అయితే లక్ష్యసేన్ మొదటి రౌండ్‌ను దాటలేకపోయాడు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-8, 13-7తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి పాయ్ యు పో (తైపీ) గాయంతో వైదొలగింది. మరో మ్యాచ్‌లో మాళవికా బన్సోడ్ 13-21, 21-21తో ఎన్‌గ్యూయెన్ (వియత్నాం) చేతిలో, ఆకర్షి కశ్యప్ 13-21, 12-21తో సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది. లక్ష్యసేన్ 21-19, 19-21, 14-21తో లు గ్వాంజ్ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ/శ్వేతపర్ణ జోడీ కూడా నిష్క్రమించింది.


షమిని ఆసీస్‌కు తీసుకెళ్లలేం..

కెప్టెన్ రోహిత్


షమి

బెంగళూరు: వెటరన్ పేసర్ మహ్మద్ షమి గాయం తిరగబెట్టడంతో అతడు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లడం కష్టమేనని ఇటీవల మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే వీటిని షమి తీవ్రంగా ఖండిస్తూ అవన్నీ కల్పిత వార్తలేనని తేల్చాడు. తాను కానీ, బీసీసీఐ కానీ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి దూరమైనట్టు చెప్పామా? అంటూ ప్రశ్నించాడు. అయితే కెప్టెన్ రోహిత్ మాత్రం అతడి ప్రాతినిధ్యంపై సూటిగానే తేల్చాడు. ప్రస్తుత పరిస్థితుల్లో షమిని ఆసీస్ పర్యటనకు తీసుకెళ్లలేమని స్పష్టం చేశాడు. 'వాస్తవానికి షమిపై నిర్ణయం తీసుకోవడం కష్టంగా మారింది. ఇటీవల అతడి మోకాలిలో వాపు వచ్చింది. దీంతో మళ్లీ గాయం మొదటికి వచ్చింది. తను ప్రస్తుతం ఎన్‌సీఏలో వైద్యులు, ఫిజియోల పర్యవేక్షణలో కోలుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. వంద శాతం ఫిటినెస్ లేకుండా అతన్ని ఆసీస్ టూర్‌కు తీసుకెళ్లలేం' అని రోహిత్ పేర్కొన్నాడు.

బంగ్లాదేశ్ కోచ్‌పై వేటు



ఢాకా: బంగ్లాదేశ్ జట్టు కోచ్ చండిక హతురుసింఘపై ఆ దేశ క్రికెట్ బోర్డు వేటు వేసింది. గత ఏడాది భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్ కప్ సందర్భంగా జట్టు ఆటగాడిని చెంపఛెళ్లుమనిపించిన ఘటనకు సంబంధించి చండికపై చర్య తీసుకున్నట్టు తెలిసింది. నిరుడు ఫిబ్రవరిలో కోచ్ బాధ్యతలు చేపట్టిన హతురుసింఘ పదవీకాలం వచ్చే సంవత్సరం జరిగే చాంపియన్స్ ట్రోఫీ వరకూ ఉంది. కాగా..చండిక స్థానంలో వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఫిల్ సిమన్స్‌ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నియమించింది. చాంపియన్స్ ట్రోఫీ వరకు సిమన్స్ పదవిలో కొనసాగుతాడని తెలిపింది.

టాప్ లేపిన ఉదిత



రూ. 32 లక్షల భారీ ధర
మహిళల హాకీ లీగ్ వేలం

న్యూఢిల్లీ: భారత జట్టు డిఫెండర్ ఉదిత దుహన్ మహిళల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో అత్యధిక ధర పలికిన ప్లేయర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన వేలంలో బెంగాల్ టైగర్స్ రూ. 32 లక్షలకు ఉదితను కొనుగోలు చేసింది. రూ. 29 లక్షలతో డచ్ స్టార్ డ్రాగ్ ఫ్లికర్ ఇబ్బీ జన్సెన్ (ఒడిశా వారియర్స్) భారీ ధర పలికిన క్రీడాకారిణి గా రెండో స్థానంలో నిలిచింది. భారత ప్లేయర్లు లాల్‌రెమ్సియామిని బెంగాల్ టైగర్స్ రూ. 25 లక్షలకు కొనుగోలు చేయగా.. ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్ సునెలిటా టొప్పోను రూ. 24 లక్షలకు, సంగీత కుమారిని రూ. 22 లక్షలకు సొంతం చేసుకొంది. భారత జట్టు కెప్టెన్ సలీమా టిటే (రూ. 20 లక్షలు), ఇషిక చౌదరి (రూ. 16 లక్షలు), నేహా గోయల్ (రూ. 10 లక్షలు)ను ఒడిశా వారియర్స్ కొనుగోలు చేసింది.

అరంగేట్రంలో శతకం

- అదరగొట్టిన గులామ్
- ఇంగ్లండ్-పాక్ రెండో టెస్టు

ముల్తాన్: అరంగేట్రంలోనే కమ్రాన్ గులామ్ (118) సెంచరీతో అదరగొట్టడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ నిలకడగా ఆడుతోంది. మంగళవారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 259/5 స్కోరు చేసింది. రిజ్వాన్ (37), సల్మాన్ ఆగా (5) క్రీజులో ఉన్నారు. గులామ్.. ఆడిన తొలి టెస్ట్‌లోనే శతకం బాదిన 13వ పాక్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. అయితే, ఆఖరి సెషన్‌లో కమ్రాన్‌ను బషీర్ బౌల్డ్ చేశాడు. సైమ్ అయూబ్ (77) రాణించగా.. అబ్దుల్ షఫిక్ (7), కెప్టెన్ షాన్ మసూద్ (3), సౌద్ షకీల్ (4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. జాక్ లీచ్ 2 వికెట్లు పడగొట్టాడు.



బిజినెస్



ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో టాటా గ్రూప్ తయారీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలను సృష్టించనుందని టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ మంగళవారం తెలిపారు. సెమీకండక్టర్లు, ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్, అసెంబ్లింగ్, విద్యుత్ వాహనాలు (ఈవీ), బ్యాటరీలు, సంబంధిత పరిశ్రమల్లో ఈ ఉద్యోగాలను కల్పించనుందన్నారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (ఐఎఫ్‌క్యూఎం) నిర్వహించిన సింపోజియమ్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సింపోజియమ్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, టీవీఎస్ మోటార్ కంపెనీ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్ కూడా పాల్గొన్నారు. చంద్రశేఖరన్ ఇంకా ఏమన్నారంటే..

- అసోంలో టాటా సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే ఈవీలు, వాటి బ్యాటరీలతో పాటు పలు తయారీ యూనిట్లను నెలకొల్పుతోంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుతో భారీగా ఉద్యోగాల కల్పనతో పాటు వాటికి సమీపంలో కనీసం 5 లక్షల చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు సైతం ఏర్పాటు కావచ్చని అంచనా.
- కేంద్ర ప్రభుత్వం తయారీ రంగానికి, ఈ రంగంలో ఉద్యోగాల కల్పనకు భారీగా మద్దతునిస్తోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న భారత లక్ష్య సాకారంలో మాన్యుఫాక్చరింగ్ రంగం కీలక పాత్ర పోషించనుంది. ఈ రంగంలో భారీగా ఉద్యోగాలు సృష్టించలేకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోలేం. ఎందుకంటే, ప్రతి నెలా 10 లక్షల మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. వారందరికీ ఉపాధి కల్పించేందుకు 10 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంది.
- సెమీకండక్టర్ల వంటి ఆధునిక సాంకేతికతతో కూడిన ఉత్పత్తుల తయారీ రంగంలో కల్పించే ప్రతి ఒక్క ఉద్యోగం 8 నుంచి 10 పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించగలదు.

వారిని గుడ్డిగా అనుసరించవద్దు: శ్రీనివాసన్

అత్యంత నాణ్యమైన సేవలు, ఉత్పత్తుల మార్కెట్లో ప్రపంచ అగ్రగామిగా ఎదిగేందుకు మనదైన ప్రత్యేక శైలి అవసరమని టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్ సూచించారు. ఆర్థికాభివృద్ధి విషయంలో జర్మనీ, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, చైనా ఎంచుకున్న బాటను మనమూ గుడ్డిగా అనుసరించవద్దని, అలా చేస్తే మనం వెనకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఎన్నికలతో సంబంధం లేని అభివృద్ధి పథం: వైష్ణవ్

దేశంలో ఎన్నికలతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందే ప్రక్రియకు పునాది వేస్తున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే నామినల్ జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లకు, తలసరి ఆదాయం 18,000 డాలర్ల స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్లు, తలసరి ఆదాయం 3,000 డాలర్ల స్థాయిలో ఉందన్నారు. ఈ లెక్కన మనం లక్ష్యాన్ని చేరుకునేందుకు రాబోయే 25 ఏళ్లలో 6-7 రెట్ల వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

డిజిటల్ టెక్నాలజీలపై జర జాగ్రత్త



అంతర్జాతీయ కట్టుబాట్లే మేలు

- ఏఐ'కీ నైతిక ప్రమాణాలు ఉండాలి
- సమిష్టి కృషితోనే సైబర్ నేరాలకు చెక్
- ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: డిజిటల్ టెక్నాలజీల వినియోగానికి సంబంధించి అంతర్జాతీయ కట్టుబాట్లు ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రారంభమైన ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ), ఐటీయూ డబ్ల్యూటీఎస్ఏ, 2024 సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ సూచన చేశారు. 'డిజిటల్ టెక్నాలజీలు, యాప్స్‌కు ఎలాంటి భౌతిక సరిహద్దులు లేవు. దీంతో ప్రస్తుతం ఏ ఒక్క దేశమూ ఒంటరిగా తన పౌరులను సైబర్ నేరాల నుంచి రక్షించుకునే స్థితి లేదు. ఈ నేపథ్యంలో డిజిటల్ టెక్నాలజీలతో చేయదగ్గ, చేయకూడని పనులు, వ్యవహారాలకు సంబంధించి అంతర్జాతీయ కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకోసం అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి' అని ప్రధాని అన్నారు. ఏఐ వంటి డిజిటల్ టెక్నాలజీల కట్టుబాట్ల విషయంలో వివిధ దేశాల వైవిధ్యం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని నైతిక ప్రమాణాలు రూపొందించుకోవాల్సిన అవసరం కూడా ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు.

మన డేటా మన దగ్గరే ఉండాలి

భారత వినియోగదారులకు సంబంధించిన డేటాను మన దేశంలోనే స్టోర్ చేయాలని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ కోరారు. ఇందుకోసం కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) టెక్నాలజీల సాయంతో డేటా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు విద్యుత్ వంటి విషయాల్లో ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. ఏఐ అన్ని రంగాల స్వరూపాలను మార్చి వేసే ఒక విప్లవాత్మక టెక్నాలజీ అని అంబానీ అన్నారు.

వొడాఫోన్ ఐడియాను గట్టెక్కిస్తాం

వొడాఫోన్ ఐడియా కంపెనీని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కిస్తామని ఐఎంసీ సదస్సులో పాల్గొన్న ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా అన్నారు. ఇప్పుడిప్పుడే కంపెనీ ఆర్థిక కష్టాల నుంచి బయటపడి కొత్త పెట్టుబడులతో ముందుకు వెళుతోందన్నారు.

స్పెక్ట్రం వేలమే కరెక్ట్

కృత్రిమ ఉపగ్రహాల ద్వారా టెలికాం సేవలు అందించే కంపెనీలు కూడా స్పెక్ట్రంను వేలం ద్వారానే పొందాలని ఆకాశ్ అంబానీ, ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ మిట్టల్ స్పష్టం చేశారు. అలాగే ఈ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు వసూలు చేయాలన్నారు. అప్పుడే అన్ని కంపెనీలకు సమాన అవకాశాలు ఏర్పడతాయని మిట్టల్ తెలిపారు. అయితే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మాత్రం ఈ సూచనను తోసిపుచ్చారు. ట్రాయ్ సూచించిన విధంగా ఈ కంపెనీలకు స్పెక్ట్రంను ప్రత్యేక కేటాయింపుల ద్వారానే కేటాయించాలన్నారు. ఈ విషయంలో అంబానీ, మిట్టల్ సూచన అసాధారణంగా ఉందన్నారు. ఉపగ్రహాల ద్వారా మన దేశంలో టెలికాం సేవలు అందించేందుకు మస్క్ నాయకత్వంలోని 'స్టార్ లింక్' కంపెనీ కూడా దరఖాస్తు చేసింది.

రూ.1,099కే జియో కొత్త 4జీ ఫోన్లు

ఈ సదస్సు సందర్భంగా రిలయన్స్ జియో కొత్త 4జీ ఫోన్లను ఆవిష్కరించింది. జియో భారత్ వీ3, జియో భారత్ వీ4 పేరుతో విడుదల చేసిన ఈ 4జీ ఫోన్ల ధర రూ.1,099 మాత్రమే. రూ.123 నెలవారీ రీచార్జ్‌తో ఈ ఫోన్ల ద్వారా అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది.



మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. మార్కెట్లోకి సరికొత్త బాలెనో రీగల్ ఎడిషన్‌ను విడుదల చేసింది. ఆటోమేటిక్, సీఎన్‌జీ వేరియంట్లతో పాటు అన్ని వేరియంట్లలో ఈ స్పెషల్ ఎడిషన్ బాలెనో అందుబాటులో ఉండనుంది. ఆరు ఎయిర్‌బ్యాగ్స్, స్మార్ట్‌ప్లే ప్రొ-ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, హిల్ హోల్డ్ అసిస్ట్, ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్ ఈ కారు ప్రత్యేకతలు.

ఇసుజు మోటార్స్ ఇండియా.. ఇసుజు డీ-మాక్స్ అంబులెన్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. ఏఐఎస్-125 టైప్ సీ అంబులెన్స్ స్పెసిఫికేషన్స్‌తో దీన్ని రూపొందించినట్లు ప్రకటించింది.ఇసుజు ఆర్‌జెడ్4ఈ 1.9 లీటర్ ఇంజన్‌తో కూడిన ఈ అంబులెన్స్ ధర రూ.25,99,990.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	135
కర్నూలు	126	నెల్లూరు	135
విశాఖపట్నం	125		
గోదావరి	135	అనంతపురం	135

రిలయన్స్ షేర్లు పడేశాయ్..

సెన్సెక్స్ 153 పాయింట్లు డౌన్

ముంబై: మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఒక దశలో 337 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ, చివరికి 152.93 పాయింట్ల నష్టంతో 81,820.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 70.60 పాయింట్లు కోల్పోయి 25,057.35 వద్ద స్థిరపడింది. ధరల సూచీ మళ్లీ ఎగబాకడంతో పాటు నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయని విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 నష్టపోగా.. బజాజ్ ఫైనాన్స్ షేరు 2.73 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. సెప్టెంబరు త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభం 5% తగ్గడంతో కంపెనీ షేరు 2.09% పతనమైంది. ఆర్థిక ఫలితాలు మెరుగ్గా ఉండటంతో హెచ్‌సీఎల్ టెక్ షేరు ఇంట్రాడేలో 1.40% పెరిగి రూ.1,882 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 0.76% లాభంతో రూ.1,870 వద్ద స్థిరపడింది.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5% వాటా విక్రయం

కేంద్ర ప్రభుత్వం.. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5 శాతం వరకు వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్టు మంగళవారం ప్రకటించింది. షేరు కనీస ధరను రూ.1,540గా నిర్ణయించింది. బుధవారం నుంచి వాటా విక్రయం ప్రారంభం కానుందని.. రిటైల్ ఇన్వెస్టర్లు, సంస్థ ఉద్యోగులు గురువారం బిడ్ వేయవచ్చని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ డిపార్ట్‌మెంట్ (దీపం) వెల్లడించింది. కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.2,000 కోట్ల వరకు ఆదాయం సమకూరనుంది. ప్రస్తుతం కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం 72.86 శాతం వాటా కలిగి ఉంది.

హ్యుండయ్ ఐపీఓకు 18% సబ్‌స్ర్కిప్షన్

హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.27,870 కోట్ల మెగా ఐపీఓకు తొలి రోజున 18 శాతం సబ్‌స్ర్కిప్షన్ లభించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 9,97,69,810 షేర్లను అమ్మకానికి పెట్టగా..మంగళవారం 1,77,89,457 షేర్ల కొనుగోలుకు బిడ్లు దాఖలైనట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది.


ట్రూ గుడ్ రూ.75 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన మిల్లెట్ ఆధారిత స్నాక్ బ్రాండ్ ట్రూ గుడ్.. రూ.75 కోట్ల (90 లక్షల డాలర్లు) నిధులను సమీకరించింది. ప్రస్తుత ఇన్వెస్టర్లయిన ఓక్స్ అసెట్ మేనేజ్‌మెంట్, వీ ఓషియన్ ఇన్వెస్ట్‌మెంట్‌తో పాటు తాజాగా ప్యూరో వెల్‌నెస్ నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు ట్రూ గుడ్ వెల్లడించింది. మౌలిక సదుపాయాల విస్తరణ, డిస్ట్రిబ్యూషన్ సామర్థ్యాల పెంపు సహా ఉత్పత్తుల ఇన్నోవేషన్‌కు ఈ నిధులను వినియోగించనుంది. 2021 నవంబరులో సిరీస్ ఏ రౌండ్‌లో భాగంగా ట్రూ గుడ్ రూ.55 కోట్లు సమీకరించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▼	70,950 ▼	1,03,000 ▼
ముంబై	75,930 ▼	69,552 ▼	89,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
16వ తేదీ		విజయవాడ	515
హైదరాబాద్	480	గోదావరి	515
వరంగల్	482	విశాఖపట్నం	515
చిత్తూరు	538	డజను గుడ్లు రూ. 72	

ప్రధాన ఆకర్షణగా 'రోబోటిక్ డాగ్'



ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో రాకీ అనే రోబోటిక్ డాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఎరిక్సన్ కంపెనీ అభివృద్ధి చేసిన ఈ 5జీ పవర్డ్ డాగ్ కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కూడా ఆకర్షించింది. ఐఎంసీ సదస్సుకు హాజరైన ఆయన ఎరిక్సన్ స్టాల్‌కి వెళ్లి మరీ ఈ రోబోటిక్ డాగ్‌ను పరిశీలించి దాన్ని 'శభాష్ రాకీ' అంటూ అభినందించారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన 'ఎక్స్'లో పోస్టు చేశారు. అగ్ని ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో ఈ రోబోటిక్ డాగ్ అద్భుతమైన సేవలు అందిస్తుందని ఎరిక్సన్ తెలిపింది.

'6జీ'లో సత్తా చూపిస్తాం

4జీ, 5జీ సేవల్లో ఇతర దేశాలను అనుసరించిన భారత్ 6జీ టెక్నాలజీ విషయంలో మాత్రం నాయకత్వ పాత్ర పోషిస్తుందని సింధియా అన్నారు. ఇందులో భాగంగా ఈ టెక్నాలజీకి సంబంధించి అంతర్జాతీయంగా నమోదయ్యే పేటెంట్లలో కనీసం పది శాతమైనా మన దేశం నుంచి నమోదు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దేశీయంగా 6జీ టెక్నాలజీ అభివృద్ధిని సమన్వయం చేసేందుకు 'భారత్ 6జీ అలయెన్స్' పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు సింధియా తెలిపారు.

గుడ్ హెల్త్

నల్ల మిరియాలతో ప్రయోజనాలెన్నో!

శీతాకాలంలో అందరూ ఎదుర్కొనే ప్రధాన సమస్య దగ్గు, జలుబు. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే ప్రతి ఒక్కరూ ఆశ్రయించేది మిరియాలనే. ఈ సందర్భంగా మిరియాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- వాతావరణ మార్పుల కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యల నివారణకు మిరియాలు దివ్యౌషధంలా పని చేస్తాయి. వీటిలోని యాంటి సెప్టిక్ గుణాలు శరీరంలో సత్తువను పెంచుతాయి. వేడి వేడి పాలలో చిటికెడు మిరియాల పొడి కలుపుకొని తాగితే దగ్గు, జలుబుల నుంచి వెంటనే ఉపశమనం కలుగుతుంది. ఒక గ్లాసు నీటిలో మిరియాలు, తులసి ఆకులు, అల్లం వేసి బాగా కాచి గోరు వెచ్చగా అయ్యాక కొంచెం తేనె కలిపి తాగితే శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకు వెళతాయి.



- మిరియాలు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. ఒక గ్లాస్ నీటిలో కొన్ని మిరియాలు వేసి నానబెట్టి ఆ నీటిని తాగితే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.
- రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను క్రమబద్ధీకరించి డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతాయి. మిరియాలలోని యాంటీ ఆక్సిడెంట్లు రక్త సరఫరాను మెరుగు పరచి గుండె సంబంధిత వ్యాధులు రాకుండా తోడ్పడతాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను నిరోధిస్తాయి.
- మిరియాల పొడిని నెయ్యితో కలిపి రాసుకుంటే చర్మ వ్యాధులు తగ్గుముఖం పడతాయి. అదే పసుపుతో కలిపి రాసుకుంటే మొటిమలు తగ్గిపోతాయి.
- కీళ్లవాతం ఉన్నవారు మిరియాలను నువ్వుల నూనెలో వేయించి పొడి చేసి నొప్పి ఉన్న ప్రాంతంలో కట్టు కడితే వాపు తగ్గుతుంది.
- దంత సమస్యల నివారణకు, శరీరంలో అధిక కొవ్వును కరగించేందుకు, గొంతు గరగర నుంచి ఉపశమనానికి మిరియాల పొడి ఉపకరిస్తుంది.

ఆహారమే ఔషధం

వర్షంలో తడవడం, చలి గాలులు, సీజనల్ మార్పుల కారణంగా అనారోగ్యానికి గురవుతుంటాం. అయితే పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



- క్యారెట్, అల్లం, మిరియాలు, పైనాపిల్, వెల్లుల్లి జలుబుని నియంత్రించడంలో సహాయపడతాయి. ముక్కుదిబ్బడ, ఆస్తమా నుంచి ఉపశమనం అందిస్తాయి.
- యాపిల్, కీర, క్యాబేజీ, అల్లం, ఆకుకూరలు తలనొప్పిని తగ్గిస్తాయి. అల్సర్ సంబంధిత సమస్యలను, డయాబెటిస్‌ను నివారిస్తాయి. ఆకు కూరలు, క్యారెట్, చేపలు కంటిచూపును మెరుగుపరుస్తాయి.
- పుచ్చకాయ, కీరా, క్యారెట్ తరచుగా తింటే మూత్ర పిండాలను ఆరోగ్యంగా ఉంటాయి. దానిమ్మ, క్యారెట్, ఆకు కూరలు నరాలను ఉత్తేజితం చేస్తాయి. పైనాపిల్, పుదీనా, నిమ్మకాయలు అజీర్తిని నివారిస్తాయి.
- దానిమ్మ, ద్రాక్ష, బీట్‌రూట్‌లు జ్ఞాపకశక్తిని పెంచితే, అరటిపండు, పియర్, స్ట్రాబెర్రీలు ఒత్తిడిని అధిగమించేందుకు సహాయపడతాయి.
- బ్రోకొలి, మొలకెత్తిన గింజలు ఊపిరితిత్తులకు మేలు చేస్తాయి.



స్వయంకృషితో ఎదిగి... ఉన్నత శిఖరాలెన్నో అధిరోహించిన మహిళ... **హినా ఖాన్.** భారత టెలివిజన్ రంగంలో తిరుగులేని తారగా... అత్యధిక పారితోషికం తీసుకొంటున్న బుల్లితెర నటుల్లో ఒకరిగా... వెలుగుతున్న ఆమె ఇప్పుడు కేన్సర్‌తో పోరాటం చేస్తోంది. కీమో థెరపీలు... రేడియేషన్ చికిత్సలు శరీరాన్ని బలహీన పరుస్తున్నా... ఆమె కుంగిపోలేదు. ఆత్మవిశ్వాసంతో కేన్సర్‌ను ఎదుర్కొంటూనే... అప్పుడప్పుడూ ర్యాంప్‌పై మెరుస్తోంది. వివిధ 'వాక్'ల్లో భాగమై సామాజిక చైతన్యం రగిలిస్తోంది.

చెదరని ధైర్యమే ఆమె బలం

అక్షర మహేశ్వరీ సింఘానియా... సుదీర్ఘ ధారావాహిక 'ఏ రిస్తా క్యా కహలాతా హై'లో హినా ఖాన్ పాత్ర పేరు ఇది. ఈ పాత్రే ఆమెను ఇంటింటికీ పరిచయం చేసింది. స్టార్ స్టేటస్ తెచ్చిపెట్టింది. అది మొదలు బుల్లితెరలో హినా కనిపించని రోజంటూ ఉండదంటే... అందులో వింతేమీ లేదు. పోటీదారుగానో, న్యాయనిర్ణేతగానో, ప్రత్యేక పాత్రలోనో, గౌరవ అతిథిగానో... ఎక్కడో అక్కడ ఏదో ఒక రకంగా ప్రేక్షకులను పలకరిస్తూనే ఉంటుంది. కొన్ని సినిమాల్లో, అలాగే వెబ్‌సిరీస్‌ల్లో నటించి మంచి గుర్తింపు కూడా తెచ్చుకుంది. విశేషమేమంటే... నటిగా ఇంత బిజీగా గడిపేస్తున్న హినా... గ్లామర్ ప్రపంచంలోకి రావాలని అసలు ఏ రోజూ అనుకోలేదు. పాత్రికేయురాలు కావాలని కలలు కని... అనుకోకుండా ఇలా ఈ రంగంలో స్థిరపడింది.

"ప్రముఖ జర్నలిస్ట్ బుర్ఖాదత్‌కు నేను అతిపెద్ద అభిమానిని. ఆమెను చూసి నేను కూడా అంతటి పాత్రికేయురాలు కావాలనుకున్నాను. కానీ విధి మరోలా తలచింది. అప్పుడు ఢిల్లీలో ఎంబీయే చదువుతున్నాను. అదే సమయంలో 'ఏ రిస్తా క్యా కహలాతా హై' ఆడిషన్స్ జరుగుతున్నాయి. మా స్నేహితుల బలవంతంతో ఆడిషన్స్‌కు వెళ్లాను. తొలి రౌండ్‌లోనే ఎంపికయ్యాను. తరువాతి వడపోతకు ముంబయి రమ్మన్నారు. వెళితే అన్నిటినీ విజయవంతంగా అధిగమించాను. షూటింగ్ మొదలైపోయింది. జర్నలిస్టు కావాలనుకున్న నేను నటిని అయిపోయాను" అంటూ ఓ సందర్భంలో నాటి సంగతులు పంచుకుంది హినా.

> "మా పీజీలో కొంతమంది అమ్మాయిలు కాల్‌సెంటర్‌లో పని చేసేవారు. బానే సంపాదించేవారు. నన్ను కూడా రమ్మని అడిగారు. రుణం తీసుకున్నవారికి ఫోన్ చేసి, బాకీ కట్టమని చెప్పాలి. అదే నా పని. అయితే రొటీన్ కాల్‌సెంటర్ ఉద్యోగులకు కాస్త భిన్నంగా నేను కస్టమర్లతో మాట్లాడే దాన్ని. వాళ్లకు నా బాధలు చెప్పి, డబ్బు కట్టకపోతే నా ఉద్యోగం పోతుందని చెప్పేదాన్ని. చాలావరకు బాకీలు వసూలు అయ్యాయి.



'నన్ను బయటకు పంపుతారు..'

జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో పుట్టిన హినీఖాన్‌కు ఒక తమ్ముడు. అతడు ఓ ట్రావెల్ ఏజెన్సీ అధిపతి. 2009లో ఎంబీయే పూర్తి చేసిన ఆమె... అంతకముందు 'ఇండియన్ ఐడల్'లో పోటీపడింది. సీరియల్స్‌లోకి రాకముందు కొన్నాళ్లు కాల్‌సెంటర్‌లో పని చేసింది. "మా పీజీలో కొంతమంది అమ్మాయిలు కాల్‌సెంటర్‌లో పని చేసేవారు. బానే సంపాదించేవారు. నన్ను కూడా రమ్మని అడిగారు. రుణం తీసుకున్నవారికి ఫోన్ చేసి, బాకీ కట్టమని చెప్పాలి. అదే నా పని. అయితే రొటీన్ కాల్‌సెంటర్ ఉద్యోగులకు కాస్త భిన్నంగా నేను కస్టమర్లతో మాట్లాడే దాన్ని. వాళ్లకు నా బాధలు చెప్పి, డబ్బు కట్టకపోతే నా ఉద్యోగం పోతుందని చెప్పేదాన్ని. చాలావరకు బాకీలు వసూలు అయ్యాయి. అలా తొలి నెలలోనే మా ఫ్లోర్‌లో అత్యధిక మొత్తం సంపాదించాను. నేను అందుకున్న తొలి చెక్... 45 వేల రూపాయలు. నా జీతం పాతికవేలే. మిగిలింది మంచి కలెక్షన్స్ రాబట్టినందుకు దక్కిన ప్రోత్సాహకాలు" అంటున్న 37 ఏళ్ల హినా... తొలి సీరియల్‌లో ఎనిమిదేళ్లు కొనసాగింది. ఆ ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చాక వరుసగా రియాలిటీ షోలలో పాల్గొంది. 'బిగ్‌బాస్-11'లో సెలబ్రిటీ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టి, ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది. 'షేర్‌ఖాన్' టైటిల్ సొంతం చేసుకుంది. దాంతో ఆమె కెరీర్ మరో మలుపు తీసుకుంది. ఆఫర్లు పెరిగాయి.

ఎన్నో అవార్డులు...

వెండితెరపై కనిపించాలన్న ఆలోచనతో తొలుత పలు షార్ట్ ఫిలిమ్స్‌లో నటించింది. తరువాత పలు చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించింది. అదే సమయంలో టీవీ సీరియల్స్‌లో అవకాశాలు కూడా దక్కించుకుంది. మ్యూజిక్ వీడియోల్లో, ప్రత్యేక పాత్రల్లో అలరించింది. పదిహేనేళ్ల కెరీర్‌లో అద్భుతమైన ప్రదర్శనకు ఎన్నో అవార్డులు అందుకుంది. మూడు 'ఐటీఏ అవార్డు'లు, మూడు 'ఇండియన్ టెలీ అవార్డు'లు, ఏడు 'గోల్డెన్ అవార్డు'లు వాటిల్లో ఉన్నాయి.

మహమ్మారితో పోరాటం...

రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్న హినా కెరీర్‌కు పెద్ద బ్రేక్. ఆనందంగా సాగిపోతున్న జీవితంలో అనుకోని కుదుపు. ఈ ఏడాది జూన్‌లో స్టేజీ-3 బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నట్టు ఆమె వెల్లడించింది. హినాకే కాదు... ఆమె అభిమానులకూ ఇది చేదు వార్త. కానీ ఆమె కుదేలైపోలేదు. బాధపడుతూ మంచానికే పరిమితం అయిపోలేదు. ఎంతో గుండె నిబ్బరంతో కేన్సర్‌తో పోరాడుతోంది. తనలా ఈ మహమ్మారితో బాధపడుతున్న వారిలో ధైర్యం నింపుతోంది. అంతేకాదు... కీమో థెరపీ చేయించుకొంటూనే, చికిత్సకు విరామం దొరికినప్పుడు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. 'వాక్ ఫర్ కరేజ్, వాక్ ఫర్ సర్వీస్, వాక్ ఫర్ హెరిటేజ్... ఇలా అన్నింటా భాగమవుతోంది.

'ఈ సందర్భంగా నాలాగా జీవితంతో పోరాడుతున్న ఎంతోమందిని కలిశాను. అందులో ప్రతి అడుగూ ఒక్కో కథ చెప్పింది. జయించాలన్న కాంక్ష, భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించింది. నాలో స్ఫూర్తి రగిలించింది' అంటూ తన అనుభవాలను చెప్పుకొచ్చిన హినా... ఇటీవల నిర్వహించిన ఫ్యాషన్ షోలో ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా కలెక్షన్స్‌లో హినా షో స్టాపర్‌గా ఆకట్టుకుంది. జీవితం ఎంత కఠినమైన సవాళ్లను విసిరినా... తట్టుకొని నిలబడగల ఆత్మవిశ్వాసం, ధైర్యమే హినాకు కొండంత బలం.

చర్మాన్ని మెరిపించండిలా...

కాంతులీనే చర్మం కావాలని ప్రతి మహిళ కోరుకుంటుంది. అందుకోసం మార్కెట్లో దొరికే క్రీమ్‌లు, ఫేస్‌ప్యాక్‌లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఇవి కొన్నిసార్లు చర్మానికి హాని కలిగిస్తుంటాయి. అలా కాకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతోనే నిగనిగలాడే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.

హెర్బల్ ఫేస్ ప్యాక్‌లు: ఒక బౌల్‌లో ఒక చెంచా శనగపిండి, ఒక చెంచా పెరుగు, అర చెంచా తేనె వేసి బాగా కలిపి ముఖానికి, మెడకి రాసుకోవాలి. మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. పావుగంట తరవాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. మెత్తని టవల్‌తో సున్నితంగా అద్దుకుంటూ తుడవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మానికి తేమ అంది నిగారింపు సంతరించుకుంటుంది.



- ముఖాన్ని సహజంగా మెరిపించడంలో ముల్తానీ మట్టి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. టీనేజ్‌లో మొటిమలకు కారణమైన సెబమ్ ఉత్పత్తిని ఇది అడ్డుకుంటుంది. రెండు చెంచాల ముల్తానీ మట్టిలో కొంచెం పెరుగు, కొన్ని చుక్కల రోజ్ వాటర్ వేసి ప్యాక్‌లా చేసి ముఖమంతా పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత నీళ్లతో కడగాలి. ఈ ప్యాక్ వల్ల చర్మ రంధ్రాలు శుభ్రపడి మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.

హోమ్ మేడ్ స్క్రబ్: బౌల్‌లో ఒక చెంచా బియ్యప్పిండి, ఒక చెంచా పెరుగు, ఒక చెంచా తేనె వేసి బాగా కలిపి మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. ఆరిన తరవాత వేళ్లతో ఒకే దిశలో మర్దన చేస్తూ ప్యాక్‌ను తొలగించాలి. తరవాత చల్లని నీళ్లతో కడగాలి. ఇలా రెండు వారాలకు ఒకసారి చేస్తే మృత కణాలు తొలగిపోతాయి.

పోషకాహారం: చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి. ప్రతి రోజూ విటమిన్లు, మినరల్స్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అందేలా డైట్ ప్లాన్ చేసుకోవాలి. వాల్‌నట్స్, చియా సీడ్స్, వేరుశనగల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్ 'ఇ' అనేది సూర్యరశ్మిలోని అల్ట్రా వయొలెట్ కిరణాల నుంచి చర్మాన్ని కాపాడుతుంది. ఇది ఎక్కువగా బాదం, వాల్‌నట్స్‌లో దొరుకుతుంది. వీటితో పాటు ఒత్తిడి, ఆందోళన దరిచేరనీయకుండా చూసుకోవాలి. ప్రశాంతంగా ఉండడం వల్ల హార్మోన్ల పనితీరు సక్రమంగా ఉండి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

ఒక స్నైపర్ కిలోమీటరు దూరంలోని టార్గెట్‌ను సైతం గురి తప్పకుండా కాలుస్తారు. ఇందుకు ఎంతో కఠినమైన శిక్షణ అవసరం. అలాంటి శిక్షణను పూర్తి చేసుకుని మొట్టమొదటి మహిళా స్నైపర్‌గా గుర్తింపు పొందారు సుమన్‌కుమారి. సరిహద్దు భద్రతా దళంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న **సుమన్‌కుమారి** పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని నిరూపించారు. తద్వారా ఎంతోమంది మహిళా సైనికులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

గురి తప్పని స్నైపర్

కమాండో శిక్షణ తరువాత అత్యంత కఠినమైనది స్నైపర్ ట్రైనింగ్ అని చెబుతుంటారు బీఎస్ఎఫ్ అధికారులు. పురుషులు సైతం స్నైపర్ శిక్షణ అంటే వెనకంజ వేస్తారని అంటారు. అలాంటి పరిస్థితుల్లో నేను స్నైపర్‌ను అవుతాను అంటూ ముందుకెళ్లారు సుమన్‌కుమారి. ఆ శిక్షణలో 56 మంది పురుషులు ఉంటే సమన్‌కుమారి ఒక్కతే మహిళ. ఆమె పట్టుదలను చూసి అధికారులు శిక్షణ ఇవ్వడానికి సై అన్నారు. వారి నమ్మకాన్ని ఆమె వమ్ముచేయలేదు. ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్(సీఎస్‌డబ్ల్యుటీ)లో ఎనిమిది వారాల స్నైపర్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. దాంతో బీఎస్ఎఫ్‌లో మొదటి మహిళా స్నైపర్‌గా గుర్తింపు సాధించారు.



పట్టుదలతో శిక్షణకు...

హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాకు చెందిన సుమన్‌కుమారి దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తారు. తల్లి గృహిణి. ఆమె విజయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. బీఎస్ఎఫ్‌లో చేరతాను అంటే తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించారు. 2021లో బీఎస్ఎఫ్‌లో చేరారు సుమన్‌కుమారి. అందులో చేరిన తరువాత సుమన్ కుమారి స్నైపర్ శిక్షణ తీసుకోవడానికి ఒక కారణం ఉంది. ఆమె పంజాబ్‌లో ఒక ప్లాటూన్‌కు నేతృత్వం వహిస్తున్న సమయంలో సరిహద్దులో స్నైపర్ దాడులు జరిగాయి. ఆ దాడులను తిరిగి ఇచ్చేయాలనే ఉద్దేశంతో స్నైపర్ శిక్షణ తీసుకున్నారు. సుమన్ కుమారి సంకల్పం చూసి అధికారులు సైతం ఓకే చెప్పారు.

> స్నైపర్ శిక్షణలో అనేక శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కమాండ్ శిక్షణ తరువాత కఠినమైనది స్నైపర్ శిక్షణే అని అధికారులు అంటారు. అలాంటి కఠినమైన శిక్షణలో సుమన్‌కుమారి అద్భుతమైన ప్రతిభ కనబరిచి అధికారుల ప్రశంసలు అందుకున్నారు.

మహిళా సైనికులకు స్ఫూర్తి

స్నైపర్ శిక్షణలో అనేక శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కమాండ్ శిక్షణ తరువాత కఠినమైనది స్నైపర్ శిక్షణే అని అధికారులు అంటారు. అలాంటి కఠినమైన శిక్షణలో సుమన్‌కుమారి అద్భుతమైన ప్రతిభ కనబరిచి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. "ఆమె ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలవనున్నారు. 56 మంది పురుషులు ఉంటే ఆమె ఒక్కతే మహిళ. ప్రతి యాక్టివిటీలో అద్భుతమైన పర్ఫార్మెన్స్ కనబరిచింది. ఇకపై ఈ కోర్సులో మహిళలు చేరేందుకు ఆసక్తి చూపుతారని భావిస్తున్నాం" అని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ భాస్కర్‌సింగ్ రావత్ అన్నారు. కోర్సు పూర్తయ్యాక 'ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్'ను అందుకున్నారు సుమన్‌కుమారి. "సాధారణంగా స్నైపర్ శిక్షణలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వారికి ఆల్ఫా, బ్రావో గ్రేడింగ్ ఇస్తాం. కానీ సుమన్‌కుమారి 'ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్' సాధించారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాం. ఈ గ్రేడ్‌తో ఆమె స్నైపర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు అర్హత సాధించారు" అని రావత్ చెప్పుకొచ్చారు. "బీఎస్ఎఫ్‌లో మహిళా సైనికులు కఠినమైన చోట తమ అడుగులు వేస్తూ సమ్మిళిత దళంగా ఏర్పడుతున్నారు. ఈ కోవలోనే బీఎస్ఎఫ్ మొదటి మహిళా స్నైపర్‌ను పొందింది. వెల్‌కం టు ఫస్ట్ వుమెన్ స్నైపర్" అని బీఎస్ఎఫ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. స్నైపర్ అంటే శత్రువుకు కనిపించకుండా నక్కి దాడి చేయాలి. ఒక్కోసారి శత్రువుకు కనిపించకుండా సమీపంలోకి వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి కఠినమైన కోర్సులో స్వచ్ఛందంగా చేరడం నిజంగా అభినందనీయం అని సుమన్ కుమారికి శిక్షణ ఇచ్చిన ఇన్‌స్ట్రక్టర్ ఒకరు అన్నారు. సుమన్‌కుమారి ఇంగ్లీషు, హిందీ, పంజాబీ భాషల్లో అనర్గళంగా మాట్లాడతారు. మ్యూజిక్ అంటే ఇష్టం. పుస్తకాలు చదవడాన్ని కూడా ఇష్టపడతారు. పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని అంటున్న సుమన్‌కుమారిని మనమూ అభినందిద్దామా.



ఫ్యాషన్



ఆర్గంజా అదరహో...

రాజసంగా, హుందాగా కనిపించాలంటే ఆర్గంజా డ్రస్ ఎంచుకోవాలి. తేలికగా, పలుచగా, స్టైలిష్‌గా ఉండే ఆర్గంజా డ్రస్‌లు అన్ని వేడుకలకూ నప్పుతాయి. ఈ మెటీరియల్‌తో తయారయ్యే చుడీదార్‌లు ఇవే!

బుట్టబొమ్మలా కనిపించాలనుకుంటే వాల్యూమ్ పెంచే మెటీరియల్ ఎంచుకోవాలి. అలాంటి వాటిలో చెప్పుకోదగినది ఆర్గంజా. నైలాన్, పాలియెస్టర్ లాంటి సింథటిక్ ఫైబర్లతో తయారవుతున్న ఆర్గంజా, వన్నె తగ్గకుండా ఎక్కువ కాలం మన్నుతుంది. రకరకాల డిజైన్లలో రూపొందే ఆర్గంజాను వేర్వేరు మోడల్ దుస్తుల తయారీ కోసం ఉపయోగిస్తూ ఉంటారు. వాటిలో ప్రత్యేకించి చుడీదార్ల కోసం ఫ్లవర్ డిజైన్లను ఎంచుకుంటూ ఉంటారు. లేత గులాబీ, నీలం, పసుపు... ఇలా ముదురు రంగులకు బదులుగా హాయిగొలిపే లేత రంగుల ఫ్లవర్ డిజైన్లు తాజా ఫ్యాషన్.



వినూత్నమైన వెరైటీల్లో...

ఆర్గంజా సహజసిద్ధ మెరుపును కలిగి ఉంటుంది. కాబట్టి ఈ దుస్తులను ఈవినింగ్ పార్టీ వేర్‌గా ఎంచుకోవచ్చు. ఆర్గంజా డ్రస్ వెడ్డింగ్స్‌కు కూడా సూటవుతుంది. ఈ మెటీరియల్‌లో రకాలు కూడా ఉంటాయి. మిర్రర్, శాటిన్, క్రష్డ్, షాట్, ఎంబ్రాయిడర్డ్ ఆర్గంజాలలో డిజైన్ చేసే దుస్తులను బట్టి అందుకు నప్పే మెటీరియల్‌ను ఎంచుకోవాలి. సిల్క్, శాటిన్‌లతో కలిపి ఆర్గంజాను డిజైన్ చేసుకోవచ్చు.

శాటిన్‌తో జోడీ కట్టి...


ఆర్గంజాకు వెలుగును ప్రతిఫలించే స్వభావం ఉంటుంది. కాబట్టి లాంగ్ గౌన్స్, చున్నీ కలిగి ఉండే చుడీదార్స్ కుట్టించుకోవచ్చు. మరింత హుందాగా కనిపించడం కోసం శాటిన్ లైనింగ్ సెలెక్ట్ చేసుకోవాలి. హైహీల్స్, మెటల్ జ్యువెలరీలు ఈ రకం దుస్తులకు మ్యాచ్ అవుతాయి.




చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వరదనీరు

చెన్నపట్నానికి పెద్దకష్టం

నిజానికి ఏటా తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాలు వార్షిక వర్షపాతంలో ఈశాన్య రుతు పవనాల వల్ల 60 శాతం వరకు పొందుతాయి. ఈ కారణంగానే తూర్పు తమిళనాడు, పుదుచ్చేరి తరచుగా వరదలకు గురవుతున్నాయి. చెన్నై మహానగరం 1943 నుంచి 2016 మధ్య కాలంలో ఆరు అతి భారీ వరదల్ని చవిచూసింది. ముఖ్యంగా 1943, 1978, 2005, 2015 నాటి వరదలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. 2010లో వచ్చిన జల్ తుఫాన్, 2012లో వచ్చిన నీలం తుఫాన్ అక్టోబరు, నవంబరు మాసాల్లో సంభవించినవే. ఆయా తుఫాన్‌లతో చెన్నపట్నం భారీగా నష్టపోయింది. 2016లో సంభవించిన 'వరదా' తుఫాన్ కారణంగా నగరంలో సుమారు 20 మంది చనిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2015 నవంబరు-డిసెంబరులో కురిసిన కుండపోత సమయంలో మహానగరం పూర్తిగా మునిగిపోయింది.



1891 నుంచి 1950 వరకు అక్టోబరు నుంచి డిసెంబరు వరకు తూర్పుతీరంలో తీరం దాటిన తుఫాన్‌లు

దక్షిణాన్ని ముంచెత్తే 'ఈశాన్యం'

చలికాలంలో తమిళనాడుకు వాన గండం!

- భౌగోళిక పరిస్థితుల కారణంగా అక్టోబరు-డిసెంబరు మధ్య కుంభవృష్టి
- 1991 నుంచి 2023 వరకు 48 వాయుగుండాలు/తుఫాన్లు
- ఏటా మునుగుతున్న చెన్నై మహానగరం

చెన్నై, విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశం ఉత్తర ప్రాంతం చలికాలానికి సిద్ధమయ్యే తరుణంలో దక్షిణ భారతదేశంలోని తూర్పుతీరం మాత్రం తుఫాన్ హెచ్చరికలతో తల్లడిల్లుతూ ఉంటుంది. అక్టోబర్ వచ్చిందంటే చాలు తీరప్రాంతంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతూ ఉంటారు. ఏ తుఫాన్ చుట్టేస్తుందో, ఎంత పెద్ద వరద ముంచేస్తుందోనని ప్రజలు భయపడుతూ ఉంటారు. ఇక ఏటా అక్టోబర్, డిసెంబర్ మధ్య చెన్నై నగరం కష్టాలు చెప్పనలవి కాదు. ఇంతకీ ఎందుకిలా..? అంటే.. ఈశాన్య రుతుపవనాలతో పాటు భౌగోళిక పరిస్థితులే కారణం. సాధారణంగా భారతదేశానికి నైరుతి రుతుపవనాలతో ఎక్కువ వర్షపాతం ఉంటుంది. ఇవి జూన్‌తో మొదలై అక్టోబర్ తొలి వారం వరకు పశ్చిమ-ఉత్తర రాష్ట్రాలకు విస్తరించి వర్షాలు కురిపిస్తాయి. పశ్చిమ కనుముల వల్ల నైరుతి రుతుపవనాలు తమిళనాడు తూర్పు తీరానికి విస్తరించలేవు. దేశం మొత్తం వర్షాలు కురిసే సమయంలో తమిళనాడు తూర్పు తీరంలో పొడి వాతావరణం ఉంటుంది. ఇక నైరుతి రుతుపవనాలు అక్టోబర్‌లో హిమాలయాలను తాకి వెనుదిరుగుతాయి. అప్పుడు వీటిని ఈశాన్య రుతుపవనాలు అని పిలుస్తారు.

ఆగ్నేయంలో బలపడి.. వాయవ్యంగా పయనించి

నైరుతి రుతుపవనాలు నిష్క్రమణతో దేశంలో కొనసాగే ఇంట్రా ట్రోపికల్ కన్వర్జెన్సీ జోన్ (ఐటీసీజడ్) దక్షిణాది వైపు వచ్చేస్తుంది. దీంతో బంగాళాఖాతంలోని ఉత్తర ప్రాంతంలో వాతావరణం పొడిగా మారుతుంది. దీనికి తోడు ఈశాన్య రుతుపవనాలు బంగాళాఖాతం మీదుగా పయనించేటప్పుడు ఉత్తర ప్రాంతంలో జలాలు చల్లగా మారతాయి. ఇంకా భూభ్రమణ దిశను అనుసరించి భూమధ్యరేఖకు 5 డిగ్రీల అక్షాంశంపైన అంటే ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు బలపడి వాయవ్యంగా పయనించి ఏపీ కోస్తా, తమిళనాడు తీరం దిశగా వస్తుంటాయి. ఇంకా ఈ సీజన్‌లో సముద్రంలో ఏర్పడే మేఘాలు సమీకరణ అవుతాయి. అదే నైరుతి రుతుపవనాల సమయంలో మేఘాలు విచ్ఛిన్నానికి గురవుతుంటాయి. అందువల్ల ఈ సీజన్‌లో తుఫాన్‌లు/వాయుగుండాలు బలపడేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని ఏయూ వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు ఓ ఎస్ఆర్‌యూ భానుకుమార్ తెలిపారు.


చెన్నై పులియాంతోపులో వరద ప్రాంత పర్యటనలో పారిశుధ్య కార్మికులకు స్వయంగా టీ అందజేస్తున్న సీఎం స్టాలిన్

హుద్ హుద్ కూడా ఇదే కాలంలో

భారత వాతావరణ శాఖ వివరాల మేరకు 1991 నుంచి 2023 వరకూ 48 వాయుగుండాలు/తుఫాన్‌లు/తీవ్ర తుఫాన్‌లు/పెనుతుఫాన్‌లు కోస్తాంధ్ర, తమిళనాడులో అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ తీరం దాటాయి. వీటిలో ఒక్క అక్టోబరులోనే 13 ఉన్నాయి. వీటిలో విశాఖను కుదిపేసిన హుద్‌హుద్ పెనుతుఫాన్ కూడా ఉంది. 1891 నుంచి 1991 వరకూ చూస్తే సుమారు 150కుపైగా వాయుగుండాల నుంచి ప్రచండ తుఫాన్‌లు ఉన్నాయి. తూర్పుతీరంలో అత్యంత విషాదాన్ని మిగిల్చిన దివిసీమ తుఫాన్ 1977 అక్టోబరులోనే సంభవించింది. అటువంటి తుఫాన్‌లు తక్కువే అయినా మోస్తరు తుఫాన్‌లు పదుల సంఖ్యలో తూర్పుతీరాన్ని కుదిపేశాయి. దేశంలో మిగిలిన ప్రాంతాలతో పోల్చితే తుఫాన్‌ల వల్ల ఏపీ, తమిళనాడులే ఎక్కువగా నష్టపోయాయి.

నైరుతి నిష్క్రమణ.. ఈశాన్యం ఆగమనం

- ప్రకటించిన భారత వాతావరణ శాఖ

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు దేశం నుంచి మంగళవారం పూర్తిగా నిష్క్రమించాయి. అదే సమయంలో దక్షిణాదిలో ఐదు వాతావరణ సబ్ డివిజన్లలో వర్షాలకు అనుకూలించే ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయని వాతావరణ శాఖ ప్రకటించింది. సాధారణంగా ప్రతి ఏడాది అక్టోబరు 15 నాటికి నైరుతి రుతుపవనాలు దేశం నుంచి పూర్తిగా వైదొలిగి, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. అలాగే ఈ ఏడాది కూడా సరైన సమయానికే వచ్చాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో అక్టోబరు నుంచి డిసెంబరు వరకు కోస్తా, రాయలసీమ, తమిళనాడు/పుదుచ్చేరి, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో వర్షాలు కురిసే వాతావరణం కొనసాగుతుంది. ఈ సమయంలో 1971 నుంచి 2020 వరకూ కురిసిన వర్షపాతం సగటు చూస్తే ఐదు సబ్‌డివిజన్లలో 334.13 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉంది. అయితే ఈ ఏడాది సాధారణం కంటే 15 శాతం ఎక్కువ (దీర్ఘకాలిక సగటులో 115 శాతం) వర్షపాతం నమోదవుతుందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా తమిళనాడులో ఏడాదిలో కురవాల్సిన వర్షపాతంలో ఈ సీజన్‌లోనే 48 శాతం, దక్షిణాదిలోని ఐదు సబ్ డివిజన్లలో 30 శాతం వర్షపాతం నమోదుకావాలి. గతేడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడన ప్రభావంతో తూర్పు/ఈశాన్య గాలులు ప్రారంభం కావడంతో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినట్టు వాతావరణ శాఖ మంగళవారం ప్రకటించింది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దక్షిణ కోస్తా, తమిళనాడులను తుఫాన్‌లు తాకుతుంటాయి. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు 'లానినా'గా మారే అవకాశం ఉన్నా ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు. ఇదిలావుండగా.. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు నెలకొనడంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో మంచి వర్షాలు కురిశాయి. ఉత్తర, ఈశాన్య, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు తప్ప మిగిలిన చోట్ల సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకావడం వ్యవసాయ రంగానికి ఊతమిచ్చిందని, ఈ ఏడాది నైరుతి సీజన్ ముగిసినట్టేనని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

24 గంటలు అందుబాటులో ఎపిడెమిక్ సెల్‌లు

- వాయుగుండం నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తం

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశమున్నందున రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమయిందని ఆరోగ్యశాఖ సంచాలకులు కె.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. సంబంధిత జిల్లాల్లో ఉన్న ఎపిడెమిక్ సెల్‌లు 24 గంటలు అందుబాటులో ఉంచడంతో పాటు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద ఇప్పటికే వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ఎపిడెమిక్ ఫోన్ నంబర్లను ప్రజలకు తెలియజేయాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. రాష్ట్ర ఎపిడెమిక్ సెల్ నంబర్ 9032384168తో జిల్లా అధికారులు సమన్వయం చేసుకోలని సూచించామని తెలిపారు.

చెన్నైలో స్తంభించిన జనజీవనం

- వరద నీటిలో 300 ప్రాంతాలు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం తమిళనాడు రాజధాని నగరం చెన్నైను ముంచెత్తింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన కుండపోత వర్షంతో నగరం నీట మునిగింది. ఎటు చూసినా మోకాల్లోతు వరదనీరు కనిపించింది. జనజీవనం పూర్తిగా స్తంభించింది. నగరంలోని 300 ప్రాంతాలకు పైగా వరదనీటిలో చిక్కుకున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు స్థానిక పెరంబూరు ప్రాంతంలో 16.5 సెం.మీల. వర్షపాతం నమోదైంది. కొళత్తూరులో 15.8 సెం.మీ.లు, అన్నానగర్‌లో 15.2 సెం.మీ.లు అంబత్తూరు 13. సెం.మీలు, బేసిన్ బ్రిడ్జి 12.2 సెం.మీలు, వేళచ్చేరి 12.2 సెం.మీలు, మధురవాయల్, వడపళని, తండయార్‌పేటలో 10 సెం.మీల. చొప్పున వర్షపాతం నమోదైనట్లు స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. భారీ వర్షం కారణంగా పలు విమాన సేవలకు అంతరాయం ఏర్పడగా, మరికొన్నింటిని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక చెన్నైలో ప్రజా రోడ్డు రవాణా వ్యవస్థ కూడా దెబ్బతింది. వాణిజ్య కేంద్రంగా ఉన్న టి.నగర్‌లోని పలు వీధులు వరదనీట మునిగాయి. టి.నగర్ బస్‌స్టేషన్ చుట్టూ మోకాలిలోతున వర్షపు నీరు ప్రవహిస్తోంది. పెరియమేడు, వేప్పేరి, కీల్పాక్, అమ్స్ రోడ్డు, మైలాపూరు, కోట్టూరుపురం, అన్నాసాలై, థౌజెండ్ లైట్స్, ట్రిప్లికేన్, ఐస్‌హౌస్, రాయపురం, అట్టుదొడ్డి, ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, తండయార్‌పేట స్టాన్లీ నగర్, వాషర్‌మెన్‌పేట భోజరాజన్ వీధి, కోనియమ్మన్ నగర్, తిరువొత్తియూరు, మనలి, మాధవరం, వడపెరుంబాక్కం తదితర ప్రాంతాలన్నింటిలోకి వరదనీరు చేరింది. వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో మంగళవారం విద్యాలయాలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం.. ప్రైవేటు కార్యాలయాల వారు ఇంటి నుంచే పని చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రెడ్ అలెర్ట్ హెచ్చరికలు

రాష్ట్రంలో మంగళవారం ఈశాన్యరుతుపవనాలు ప్రవేశించాయని, ఈ పవనాలు భారీ వర్షాలను వెంట తీసుకువచ్చాయని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం దక్షిణ మండల అధికారి బాలచంద్రన్ తెలిపారు. దీనికితోడు బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పవాయుపీడనం బుధవారంలోగా వాయుగుండంగా మారనుండటంతో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణీపేట, తిరువణ్ణామలై, వేలూరు, కడలూరు, విల్లుపురం జిల్లాలకు రెడ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటలకు 40 నుండి 50 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని ఈ నెల 18 వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని, అందువల్ల జాలర్లు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

సహాయక చర్యల్లో మంత్రులు, అధికారులు

చెన్నైలో భారీగా వరదనీరు చేరడంతో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధితో పాటు ఇతర మంత్రులు, అధికారులు మొత్తం రంగంలోకి దిగారు. స్టాలిన్ ఉత్తరచెన్నైలోని ఎలిఫెంట్‌గేట్, పులియాంతోపు, తిరువికనగర్, విల్లివాక్కం తదితర ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలను పురమాయించారు. వరదనీటిలోనే నడుస్తూ పరిస్థితిని సమీక్షించారు. పులియాంతోపులో పనిచేస్తున్న కార్పొరేషన్ కార్మికులతో సీఎం మాట్లాడి, వారందరినీ ఓ టీ దుకాణానికి తీసుకెళ్లి తన సొంత నగదుతో టీ, బిస్కెట్లు ఇప్పించి, వారితో కలిసి టీ సేవించారు. ఇదిలా వుండగా స్థానిక గోపాలపురంలో వున్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఇంట్లోకి వరదనీరు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. ఇంట్లోకి మరింత నీరు చేరకుండా ఇసుక బస్తాలు అడ్డువేశారు. మరోవైపు.. భారీ వర్షాల కారణంగా కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ విద్యాలయాలకు బుధవారంసెలవు ప్రకటించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే పది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపిన ప్రభుత్వం.. 30కి పైగా రాష్ట్ర విపత్తు నివారణా బృందాలను నగర వ్యాప్తంగా సిద్ధంగా ఉంచింది. చెన్నైకి వరద ముప్పు పొంచివుందన్న హెచ్చరికలతో నగరంలోని కార్ల యజమానులు అప్రమత్తమయ్యారు. గత అనుభవాల దృష్ట్యా తమ వాహనాలను మెరకప్రాంతాల్లో పెడుతున్నారు. అధికారులు జరిమానా విధిస్తున్నా పట్టించుకోకుండా ఎక్కడ ఫ్లైఓవర్లు కనిపిస్తే అక్కడ ఓ పక్కగా పార్క్ చేస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు పెద్ద సమస్యగా మారింది.

వారంలోగా డయాఫ్రమ్ డిజైన్లు

- ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయాల్సిందే
- 'మేఘా-బావర్'కు జలవనరులశాఖ స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నిర్దేశించిన లక్ష్యాలమేరకు పోలవరం సాగునీటి ప్రాజెక్టును 2027 మార్చికి పూర్తి చేయాల్సిందేనని కాంట్రాక్టు సంస్థలు మేఘా ఇంజనీరింగ్, బావర్‌లకు రాష్ట్ర జల వనరుల శాఖ స్పష్టం చేసింది. నవంబరు ఒకటి నాటికి పనులు ప్రారంభించేలా మెషనరీ సిద్ధం చేయాలని ఆదేశించింది. వారం రోజుల్లోగా డయాఫ్రమ్‌వాల్ డిజైన్లను .. 14 రోజుల్లోగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్(ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ డిజైన్లను పూర్తిచేసి... కేంద్ర జలశక్తి, కేంద్ర జల సంఘానికి సమర్పించాల్సిందేనని స్పష్టం చేసింది. పోలవరం మెయిన్ డ్యామ్ పనులు తొలిదశలో 41.15 మీటర్ల మేర చేపట్టేందుకు కేంద్రం అడ్వాన్సుగా రూ.2,348 కోట్లను అందించింది. కేంద్రం నుంచి నిధులు ముందస్తుగా విడుదలైనందున.. నిర్దేశిత గడువులోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిందేనని జల వనరులశాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సోమవారం ఆయన పోలవరం పనులపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం. వెంకటేశ్వరరావుతో సమీక్షన నిర్వహించారు. అనంతరం మంత్రి నిమ్మల, సాయిప్రసాద్, వెంకటేశ్వరరావు... పోలవరం చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి, మేఘా-బావర్ ప్రతినిధులతో అదే రోజు రాత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. పోలవరం చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి మాట్లాడుతూ.. డయా ఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు వచ్చే నెల ఒకటో తేదీన ప్రారంభించి .. 2025 నవంబరు నాటికి పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేసినట్లుగా మంత్రికి వివరించారు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యాచరణను సిద్ధం చేసినట్లుగా వెల్లడించారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ఒప్పందాన్ని ఖరారు చేసుకోవాలంటూ మేఘా-బావర్‌లకు గడచిన రెండు నెలలుగా సూచిస్తున్నట్లుగా వెల్లడించారు. ప్రస్తుతం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 17 మీటర్ల మేర గోదావరి జలాలు ఉండటంతో.. గ్రౌండ్ క్లియరెన్సుకు సమయం పడుతుందని మేఘా-బావర్ వెల్లడించాయి. దీనిపై సాయిప్రసాద్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాము రెండునెలలుగా సన్నద్ధతతో ఉండాలంటూ చెబుతూనే ఉన్నామన్నారు. వచ్చే నెల ఆరోతేదీకి బదులుగా ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ దాకా డిజైన్లపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని.. ఆ లోగా గ్రౌండ్ క్లియరెన్సుకు వీలుగా పంపింగ్ పనులు పూర్తి చేయాలని బావర్-మేఘాను మంత్రి ఆదేశించారు.

3 మెడికల్ కాలేజీలకు రూ.241 కోట్లు విడుదల

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు మెడికల్ కాలేజీల్లో నిర్మాణాల పూర్తి, వైద్య పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వం రూ.241 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వం ఫేజ్-1 కింద విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టింది. అయితే ఇప్పటికీ కొన్ని కాలేజీల్లో నిర్మాణాలు పూర్తి కాలేదు. వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో కూటమి ప్రభుత్వం మూడు కాలేజీల్లో నిర్మాణాలు, ఇతర అవసరాల నిమిత్తం రూ.241 కోట్లు విడుదల చేసింది.

జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలును సమీక్షించి, పర్యవేక్షించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులను నియమించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఈ బాధ్యతల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళానికి కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం మన్యం, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు అచ్చెన్నాయుడు, విజయనగరానికి వంగలపూడి అనిత, విశాఖకు డోలా బాలవీరాంజనేయ స్వామి, అల్లూరి సీతారామరాజు జిల్లాకు గుమ్మిడి సంధ్యారాణి, అనకాపల్లికి కొల్లు రవీంద్ర, కాకినాడకు పొంగూరు నారాయణ, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాలకు నిమ్మల రామానాయుడు, ఏలూరుకు నాదెండ్ల మనోహర్, పశ్చిమ గోదావరి, పల్నాడు జిల్లాలకు గొట్టిపాటి రవికుమార్, ఎన్టీయార్ జిల్లాకు సత్యకుమార్, కృష్ణాకు వాసంశెట్టి సుభాశ్, గుంటూరుకు కందుల దుర్గేశ్, బాపట్లకు కె.పార్థసారథి, ప్రకాశంకు రామనారాయణరెడ్డి, నెల్లూరుకు ఫరూఖ్, నంద్యాలకు పయ్యావుల కేశవ్, అనంతపురానికి టీజీ భరత్, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాలకు అనగాని సత్యప్రసాద్, కడపకు ఎస్.సవిత, అన్నమయ్యకు బీసీ జనార్దన రెడ్డి, చిత్తూరు జిల్లాకు మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని నియమించారు.

వాయు'గండమే'!

- బలపడిన తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉన్న తీవ్రఅల్పపీడనం మరింత బలపడి మంగళవారం రాత్రికి వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు ముప్పు పొంచి ఉంది. బుధవారం ఆ ఆరు జిల్లాల్లో అక్కడక్కడా కుంభవృష్టిగా, మరికొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. నెల్లూరు, చిత్తూరు, కడప, తమిళనాడులోని చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాలకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఆకస్మిక వరదలు సంభవిస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి రాత్రికి వాయుగుండంగా బలపడింది. మంగళవారం సాయంత్రానికి చెన్నైకు 500 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, నెల్లూరుకు 590 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి 17వ తేదీ ఉదయం నెల్లూరు, పుదుచ్చేరి మధ్య తీరం దాటనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఇది తుఫాన్‌గా మారుతుందని రెండు రోజుల క్రితం పలు మోడళ్లు సూచించాయి. అయితే తుఫాన్‌గా మారే అవకాశం లేదని, వాయుగుండంగానే తీరం దాటుతుందని, తరువాత దక్షిణ భారతం మీదుగా పయనించి అరేబియాసముద్రంలో ప్రవేశిస్తుందని తాజాగా అంచనా వేశారు. ఇదిలావుండగా దక్షిణ కోస్తాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆవరించిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. దీనికితోడు మంగళవారమే ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించడంతో బంగాళాఖాతం నుంచి తేమ మేఘాలు తీరం వైపు రావడంతో దక్షిణకోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లా విద్యానగర్‌లో 80.75, ఏర్పేడులో 68.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పెరగనున్న వర్షాలు

తీవ్ర అల్పపీడనం నుంచి తీరం వైపు వస్తున్న మేఘాల ప్రభావంతో మంగళవారం రాత్రి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురవనున్నాయి. బుధ, గురువారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ ఎలర్ట్ ప్రకటించింది. అలాగే బాపట్ల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. వాయుగుండం తీరం దాటే సమయంలో అంటే గురువారం నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వాయుగుండం తీరం దాటే సమయంలో దక్షిణకోస్తా తీరం వెంబటి గంటకు 40నుంచి 60కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మత్స్యకారులు ఈ రెండు రోజులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించింది.



పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

నెల్లూరు, తిరుపతి, అనంతపురం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కాస్తా బలపడి తీవ్ర అల్పపీడనంగా మారడంతో వర్షాలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా నెల్లూరు నగరాన్ని రెండు రోజులుగా వర్షాలు కుదిపేస్తున్నాయి. అత్యధికంగా జలదంకి మండలంలో 173 మి.మీ వర్షం కురిసింది. బుధవారం కూడా పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి దాకా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వాకాడు మండలంలోని లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. తిరుమల ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో టీటీడీ ప్రత్యేక నిఘా ఉంచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు మొదలు మోస్తరు వర్షాలు కురిశాయి. కాగా, తుఫాన్ నేపథ్యంలో దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సహాయ చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు.

బీసీ బిడ్డల అభివృద్ధే బాబు లక్ష్యం

- సీడ్ పథకంతో సంచార జాతుల అభివృద్ధికి పెద్దపీట
- హాస్టళ్లు, గురుకులాల్లో సీసీ కెమెరాలు
- బీసీల సంక్షేమానికి నిధుల కొరత రానివ్వం: మంత్రి సవిత

విజయవాడ లీగల్, అక్టోబరు 15: బీసీల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి ఎస్.సవిత అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన 'బీసీ సంక్షేమ శాఖలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు'పై వర్క్ షాపులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. 'బీసీ-ఏలో ఉన్న సంచార జాతుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో సీడ్ పథకం అమలు చేస్తున్నాం. బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంచార జాతులకు మెరుగైన జీవనాన్ని అందించడానికి సీడ్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ముందుగా వారికి స్థిర నివాసాలు ఏర్పాటు చేయడానికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నాం. సంచార జాతుల మహిళలతో స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేయించి రుణాలు మంజూరు చేయనున్నాం. సంచార జాతుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ప్రోత్సహించాలి. సంచార జాతుల్లో అక్షరాస్యత పెరిగితే వారిలో పేదరికాన్ని సులభంగా పారద్రోలవచ్చు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించేందుకు 100 హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం. బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల ఆరోగ్యంపైనా, విద్యా ప్రగతిపైనా సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై రికార్డులను నిర్వహించాలి. విద్యార్థుల విద్యా ప్రగతికి సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టును కూడా డ్యాష్ బోర్డులో పొందుపర్చాలి. వార్డెన్లు రాత్రి సమయాల్లో తప్పనిసరిగా హాస్టళ్లలోనే ఉండాలి. అన్ని జిల్లా కేంద్రాల్లోను బీసీ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేస్తాం. అమరావతిలో సివిల్ సర్వీసు అభ్యర్థుల కోసం శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కేంద్ర ప్రభుత్వ పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్‌లు ఎప్పటికప్పుడు ఇచ్చేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. బీసీ సంక్షేమ శాఖలో నిధుల కొరత అనే మాటకు తావేలేదు' అని మంత్రి సవిత అన్నారు.



బీసీ చట్టంపై నేడు మంత్రుల భేటీ

బీసీలకు మేలు చేసేలా సీఎం చంద్రబాబు మరో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా అమరావతిలోని సచివాలయం ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఎనిమిది మంది బీసీ మంత్రులు అమరావతిలోని సచివాలయం ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉద్యోగులపై పెండింగ్ కేసుల వివరాలివ్వండి

▸ అన్ని శాఖలకు సీఎస్ ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై నమోదైన క్రమశిక్షణా కేసుల వివరాలను తనకు పంపాలని సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఆదేశాలిచ్చారు. ఉద్యోగులపై నమోదైన కేసులను సంబంధిత శాఖగానీ, కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌గానీ 3 నుంచి 6 నెలల వ్యవధిలో విచారణ పూర్తి చేయాలని 2022లో ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను అధికారులు పాటించడం లేదని, అందుకే ఉద్యోగులు కోర్టును ఆశ్రయిస్తున్నారని, ఇప్పటి వరకు ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని సెప్టెంబరులో హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అన్ని శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు, జిల్లాస్థాయి అధికారులంతా ఉద్యోగులపై నమోదైన కేసులను తక్షణమే సమీక్ష చేయాలని, పెండింగ్ కేసుల వివరాలతో ఒక నోట్‌ను తనకు పంపాలంటూ సీఎస్ అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు మెమో జారీ చేశారు.

బరితెగింపు వద్దు బ్రదర్!

'కట్టు' తప్పుతున్న తమ్ముళ్లకు గట్టి సంకేతం

18న ఎమ్మెల్యేలు, ఎంపీలతో చంద్రబాబు భేటీ

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఈ నెల 18న ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ సమావేశానికి రావాల్సిందిగా ఎంపీలు, ఎమ్మెల్సీలకు మంగళవారం సమాచారం వెళ్లినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలు కానుంది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు పలువురు ఎమ్మెల్యేల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటన్నింటిపైనా అధినేత దృష్టి సారించనున్నట్టు తెలిపాయి. ముఖ్యంగా, ఇసుక దందా, మద్యం షాపుల దరఖాస్తులో నడిచిన సిండికేట్ వ్యవహారాల్లో అక్కడక్కడ కొందరు ఎమ్మెల్యేలు బెదిరింపులకు పాల్పడినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈ వ్యవహారాలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయింది. ఇలాంటి నేతలను గుర్తించి ఇప్పటికే అధిష్ఠానం వారికి గట్టి సంకేతాలు అందించింది. జిల్లాల్లో కొందరు ఎమ్మెల్యేల తీరుపై టీడీపీ కార్యకర్తలు సైతం అసంతృప్తితో ఉన్నారు. వారిని కట్టడి చేయాలంటూ చంద్రబాబుకు మొరపెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేలు, ఎంపీల భేటీ ఏర్పాటు అయినట్టు, ఈ భేటీలో అందరికీ అధినేత దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా.. పార్టీ కట్టుబాట్లకు కట్టుబడి ఉండాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేయనున్నారు. అక్రమ, అవినీతి, అధికార దుర్వినియోగానికి సంబంధించిన వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు వారి కుటుంబసభ్యులూ ఎక్కడా తల దూర్చడానికి వీల్లేదని గట్టిగా చెప్పనున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి అప్రతిష్ఠను తెచ్చే పనులు చేసినట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని, నాయకుడి నుంచి కార్యకర్త వరకు... అందరికీ ఇదే వైఖరి వర్తిస్తుందని చంద్రబాబు తేల్చిచెప్పనున్నారు. ఏ కొద్దిమందికో కాకుండా అందరినీ ఒకే హాలులో కూర్చోబెట్టి చంద్రబాబు మాట్లాడతారు. అయితే, తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్న కొందరు ఎమ్మెల్యేలను మాత్రం విడి విడిగా ఒక్కొక్కళ్లను పిలిపించి మాట్లాడతారు. పద్ధతి మార్చుకోవాలని, బరితెగింపును సహించేది లేదని వారికి స్పష్టం చేస్తారు. కాగా, దీని కొనసాగింపుగా శనివారం,పంతొమ్మిదో తేదీన కూడా మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేలుగా లేని నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో ఈ సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయా నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితి, సభ్యత్వ నమోదుకు సంబంధించిన అంశాలను ఈ భేటీలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నాయి.

'స్కిల్' కేసులో ఈడీ చర్యలు

▸ ఢిల్లీ, ముంబై, పుణేలలోని సీమెన్స్ స్థిరాస్తులు, డిపాజిట్లు.. 23.54 కోట్లు జప్తు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీమెన్స్ సంస్థపై ఈడీ చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న డిజైన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీమెన్స్. ప్రాజెక్టు నిధులు మళ్లించాయని ఆరోపిస్తూ ఏపీ సీఐడీ గతంలో కేసు నమోదు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆ రెండు సంస్థలకు చెందిన వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, సౌమ్యాద్రి శేఖర్ బోస్‌తోపాటు వారి బినామీలు ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ తదితరుల సాయంతో నిధులు మళ్లించినట్టు ఈడీ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా సీమెన్స్‌కు చెందిన ఢిల్లీ, ముంబై, పుణేలోని స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొత్తం రూ.23.54 కోట్లను అటాచ్ చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలోని కోర్టుకు ఈడీ అధికారులు తెలిపారు. ఇదిలావుంటే ఈ వ్యవహారంలో సీఎం చంద్రబాబుకు ఏ సంబంధం లేదని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు తాము చేసిన దర్యాప్తులో ఆయన పాత్ర ఎక్కడా కనిపించలేదన్నారు. అదేవిధంగా గత టీడీపీ ప్రభుత్వ పాత్ర కూడా లేదని, అవినీతి, అక్రమాలకు సంబంధించిన వ్యవహారాలను ముఖ్యమంత్రితో ముడిపెట్టడం సరికాదని ఈడీ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రస్తుతం జరిగిన అటాచ్‌మెంట్ దర్యాప్తులో భాగంగా రొటీన్‌గానే జరిగిందని, ముఖ్యమంత్రికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

కష్టాలు నిజమే



(మొదటి పేజీ తరువాయి)

ఉత్పన్నం అవుతున్నాయి. స్వయంగా రాష్ట్ర ప్రజలు రీచ్ లెవల్లో తమకు ఎదురయిన కష్టాలను కాల్‌సెంటర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. స్పందన రావడం లేదని సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. అందులోని నిజనిజాలేమిటో గనుల శాఖ అధికారులు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. అందుకు భిన్నంగా సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని, ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఉచిత ఇసుక అమలులో ఏ సమస్య లేదని పునరుద్ఘాటించారు. సరిగ్గా రెండు నెలల వ్యవధిలోనే ఇదే అధికారులు ప్లేటు ఫిరాయించారు. ఉచిత ఇసుక అమలులో ఎన్నో సమస్యలు ఉంటే ఎందుకని తన దృష్టికి ఎందుకు తీసుకురావడం లేదు? అంటూ సీఎం చంద్రబాబు...అధికారులను గట్టిగా నిలదీయడమే దీనికి కారణం. ఇప్పుడు వారు నేలమార్గం పట్టారు. 'నిజమే.. కష్టాలు ఉన్నాయి' అంటూ వరుస బెట్టి అనేక అంశాలను సీఎంకు నివేదించారు. మరి ఇన్నాళ్లు ప్రభుత్వ కళ్లకు గంతలు ఎందుకు కట్టారు? నిజాలను ఎందుకు దాచారు? అన్న ప్రశ్నలకు గనుల శాఖే బదులివ్వాలి. ఇటీవల ఉచిత ఇసుకలో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలను టీడీపీ నేతలు, తటస్థులు... ఆధారాలతో సహా చంద్రబాబుకు తెలిపారు. వాటిని పరిశీలించిన సీఎం....అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ సమస్యలు లేవంటూ ఎందుకు దాటవేస్తున్నారంటూ మండిపడినట్లు తెలిసింది. తక్షణమే సమస్యల పరిష్కారం కోసం 11న సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ భేటీకి గనుల శాఖ ఓ నివేదిక ఇచ్చింది. అందులో ఉచిత స్కీమ్‌లోని సకల సమస్యలను ప్రస్తావించింది.

నివేదికలోని అంశాలు

1. ఇసుక అత్యవసరంగా కోరుకున్నవారికి బుక్ చేసుకున్న వెంటనే ఇవ్వలేకపోతున్నాం. బుకింగ్ విధానంలో ఉన్న పరిమిత ఆప్షన్లతో ఈ సమస్య ఉంది. అసలు స్టాక్ ఎంత ఉందనే లభ్యత వివరాలపై స్పష్టత ఉండటం లేదు. దీంతో వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

2. కొన్ని జిల్లాల్లో ఇసుక అందుబాటులో లేదు. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, ప్రకాశం, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో రీచ్‌లు లేవు. దీంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతూనే పక్క జిల్లాల నుంచి ఇసుక తెప్పించుకుంటున్నారు. దీనివల్ల రవాణా ఖర్చుల భారం పడుతోంది. దీంతో కొంత వ్యతిరేక ప్రచారం జరుగుతోంది.

3. ఉచిత పాలసీలో భాగంగా ఇసుక తీసుకెళ్లిన వారు బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. దీనివల్ల ప్రజలు ధరల భారాన్ని ఎదుర్కొంటున్నారు. ఉచిత ఇసుక దారి మళ్లడం వల్ల సామాన్య వినియోగదారులకు దొరడకం లేదు.

4. బ్లాక్ మార్కెటింగ్‌తో ప్రజలు అధిక రవాణా చార్జీల భారం మోయాల్సి వస్తోంది. అలాగే, కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. సొంత వాహనాల ద్వారా ఇసుకను తీసుకెళ్తున్న కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. రవాణా కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేసినా పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు.

5. ఉచిత ఇసుకపై తప్పుడు ఫిర్యాదులు, సమాచారం ప్రచారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో ఒక విధమైన గందరగోళం, భయాందోళనలు నెలకొన్నాయి. ఉచిత ఇసుక పాలసీపై ప్రజల్లో ప్రతికూల అవగాహనలు నెలకొన్నాయి.

ప్రైవేటు భాగస్వామ్యం

ఇసుక రీచ్‌ల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని గనుల శాఖ ప్రతిపాదించింది. ఇసుక కొరతను అధిగమించేందుకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రైవేటు రీచ్‌లు తెరవాలని ప్రతిపాదించింది. ఈ రెండింటికి సీఎం ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఇసుక అందుబాటులో లేని జిల్లాల్లో ప్రత్యేకంగా నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఏ జిల్లాలో ఎంత ఇసుక అవసరమో ముందే అంచనావేసి ఆ మేరకు నిల్వలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. బ్లాక్‌మార్కెట్‌ను అధిగమించేందుకు ఇసుక బుకింగ్‌లో ఓటీపీ విధానం ప్రవేశపెట్టాలని గనుల శాఖ కోరింది. ఆన్‌లైన్ బుకింగ్ సమయంలో ఒకరు ఒక రోజున ఒకటి కంటే ఎక్కువసార్లు బుకింగ్ చేయకుండా ఐపీ అడ్రస్‌ను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. సొంత వాహనాలను నియంత్రించి, ప్రభుత్వం వద్ద రిజిస్టర్ అయిన వాహనాల ద్వారానే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు ఇసుక ధరలపై ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించేలా సోషల్‌మీడియా ప్రచారం చేపట్టాలని ప్రతిపాదించారు.

అధ్యయనానికి కమిటీలు

ఇసుక పాలసీలో ఉన్న ఐదు ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ, అధికారులు కొన్ని పరిష్కారాలను ప్రతిపాదించారు. క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకునేందుకు ఓ సమగ్ర అధ్యయనం జరగాలని పేర్కొన్నారు. ఇందుకోసం నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ స్థాయిలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

మంగళగిరిలో జెమ్స్ & జువెలరీ పార్కు

▸ విశాఖలో నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్

▸ ప్రతి విద్యార్థికీ ఉద్యోగం రావడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి లోకేశ్



నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్, అధికారులు

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో జెమ్స్ అండ్ జువెలరీ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగం లభించేలా పాఠ్య ప్రణాళికను ప్రక్షాళన చేయాలని నిర్దేశం చేశారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు రావాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యక్రమాలు ఉండాలన్నారు. మంగళవారం ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి శాఖపై ఆయన సమీక్షించారు. ప్రతి విద్యార్థికీ ఉద్యోగం వచ్చేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రాధాన్యాలకు అనుగుణంగా కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశంలో బయో ఫ్యూయల్, గోదావరి జిల్లాల్లో ఆక్వా, పెట్రో కెమికల్స్, ఉత్తరాంధ్రలో ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాలపై ప్రభుత్వం దృష్టి పెడుతున్నామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గంలో 63,966 ఇళ్లలో 1,12,680 మందికి నైపుణ్య గణన పూర్తయిందని అధికారులు తెలిపారు. నెలాఖరులోగా నియోజకవర్గంలో నైపుణ్య గణన పూర్తిచేయాలని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్త గణనకు శ్రీకారం చుట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే మంగళగిరిలో జెమ్స్ అండ్ జువెలరీ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పగా.. ఉడిపిలోని జెమ్స్ అండ్ జువెలరీ సెంటర్‌ను అధ్యయనం చేశామని, త్వరలో ఆ సంస్థ అధికారులను ఇక్కడికి ఆహ్వానించి వారి సూచనలు తీసుకుంటామని అధికారులు బదులిచ్చారు.

లోకేశ్‌తో అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు భేటీ: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ రామ్‌జీ రాఘవన్, సభ్యులు ఎం.అంజనేయులు, ముకుంద్ జగన్నాథ్, సీఎస్ సురేశ్ తదితరులు మంగళవారం మంత్రి లోకేశ్‌ను కలిశారు. విద్యార్థులకు క్రియేటివ్ లెర్నింగ్, ఇన్నోవేషన్‌పై అనుసరించబోయే విధానాలను వివరించారు.

'అయ్యబాబోయ్'పై సీఎంవో సీరియస్

▸ ఆ ఐటీ శాఖ కన్సల్టెంట్‌కు భారీ జీతంపై వివరాలు తెప్పించుకున్న కార్యాలయం

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఐటీ శాఖలోని ఓ కన్సల్టెంట్... అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు డేటా చౌర్యానికి పాల్పడ్డారంటూ కావాలని ఫిర్యాదు చేశారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో సదరు కన్సల్టెంట్‌కు భారీగా వేతనాలు పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం సీఎంవోను కదిలించింది. 'అయ్యబాబోయ్' పేరిట మంగళవారం సంచికలో వచ్చిన ఈ కథనంలోని వివరాల గురించి ఐటీ శాఖ ఉన్నతాధికారులను సీఎంవో ఆరా తీసినట్టు సమాచారం. టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్యకాలంలో పౌరుల డేటా చౌర్యానికి పాల్పడిందని 2019లో అప్పటి సీఎం జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబుపై వేధింపులకు రంగం సిద్ధం చేశారు. వైసీపీ పన్నిన ఈ కుట్రకు అప్పట్లో ఐటీ విభాగంలోకి దూరిన కన్సల్టెంట్ ఇచ్చిన ఫిర్యాదును పట్టుకుని సీఎం జగన్, వైసీపీ నేతలు రెచ్చిపోయారు. దీనిపై అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో సభా సంఘం నియమించారు. నిజంగానే డేటా చౌర్యం జరిగిందో లేదో ధ్రువీకరణ లేకుండా.. ఖచ్చితమైన సమాచారం లేకుండానే హడావుడి చేశారు. డేటా చోరీ కేసు నిగ్గు తేల్చేస్తామంటూ శాసనసభలో నాటి సీఎం జగన్, భూమన, వైసీపీ మంత్రులు హూంకరించారు. కానీ డేటా చౌర్యానికి గురికాలేదంటూ అప్పట్లో ఐటీ శాఖలో పని చేసిన అధికారులు సభాసంఘం ఎదుట స్పష్టం చేశారు. ఈ కుట్రకు సహకరించిన కన్సల్టెంట్‌కు భారీగా జీతాలు పెంచుతూ ఐటీశాఖలో ఫైల్ సిద్ధమైంది. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' బయటకు తీసుకువచ్చింది. ఈ కథనంపై సీఎంవో అప్రమత్తమైంది. ఈ ఘటనలో ఎంతమంది ఉన్నారనే సమాచారం సేకరించింది. ఐటీ శాఖ తీరుపై సీరియస్ అయినట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో దీనిపై గట్టి చర్యలే ఉంటాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అండతో నిరుద్యోగులకు టోకరా!

▸ 54 మంది నుంచి రూ.14 కోట్ల వసూళ్లు

▸ విష్ణు ఓవర్సీస్ సంస్థ నిర్వాకంపై జనవాణిలో బాధితుల ఫిర్యాదు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఫారిన్ కన్సల్టెన్సీ పేరు చెప్పి, బ్రిటన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి లక్షలు వసూలు చేశారని విష్ణు ఓవర్సీస్ సంస్థ నిర్వాహకులపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జనసేన జనవాణిలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దాదాపు 54 మంది మంది బాధితులు విచ్చేసి, విష్ణు ఓవర్సీస్ సంస్థ చేసిన మోసాన్ని రామకృష్ణకు వివరించారు. కన్సల్టెన్సీ నిర్వాహకులు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచరులు కావడంతో అప్పట్లో ఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా ఫలితం లేకపోయిందని, గత ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో కూడా వారికి సన్నిహిత సంబంధాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 54 మంది దాదాపు రూ.14 కోట్లు మేర ఇచ్చి మోసపోయామన్నారు. సంస్థ నిర్వాహకులు సూరాబత్తుని చైతన్య, లక్ష్మీశెట్టి జయరాంలపై చర్యలు తీసుకుని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు విన్నవించారు. ఆ విషయాలను రామకృష్ణ వెంటనే హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు.

జగన్ ప్యాలెస్ గేట్లకు 12.85 కోట్లు: పట్టాభిరాం

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్ గేట్ల కోసం గత ముఖ్యమంత్రి జగన్ ప్రజాధనం రూ.12.85 కోట్లను దుర్వినియోగం చేశారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పేదలకు దక్కాల్సిన సొమ్మును ఇష్టానుసారంగా తినేసి.. సొంత ఖజానాకు చేర్చుకున్నారని, మిగిలింది తన విలాసాల కోసం ఖర్చుచేశారని ఆరోపించారు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ భారీ ఎత్తున ఇనుపకంచెను పెట్టుకున్నారని, ఈ విధంగా ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా, దేశ ప్రధాని అయినా, దేశ అధ్యక్షుడైనా నిర్మించుకున్నారా? అని ప్రశ్నించారు. జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం వల్ల ఎంతో మందికి నష్టం జరిగిందన్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఫర్నిచర్‌ను తిరిగి ఇవ్వమంటే చెక్కు రాసిస్తానని జగన్ అంటున్నారని, అయితే.. రూ.5వేల కోట్లకు చెక్కు రాయాలని పట్టాభి సవాల్ విసిరారు.

సౌత్ జోన్ కౌన్సిల్ సభ్యులుగా పయ్యావుల, కందుల

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జోనల్ కౌన్సిల్ ఫర్ సౌత్ జోన్ సభ్యులుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌లను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సౌత్ జోన్ రాష్ట్రాల సమస్యలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి సౌత్‌జోన్ రాష్ట్రాల నుంచి సభ్యులు హాజరవుతారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తాం: పల్లా

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలోనే ఖరారు చేసి ప్రకటిస్తామని, కూటమిగా పనిచేసి ఈ స్థానాన్ని గెలుస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం గోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ... 'ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానం గురించి మేం ఇంకా చర్చించలేదు. వామపక్షాలు, ఇతరులు తమకు మద్దతివ్వాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అభ్యర్థిని ప్రకటించేలోపు పట్టభద్రుల ఓట్లను నమోదు చేయడంపై దృష్టిపెట్టాం' అని తెలిపారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి పలువురు దాతలు మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి, విరాళాల చెక్కులు అందజేశారు. తాడేపల్లిగూడెం కూటమి నేతలు, ప్రజల భాగస్వామ్యంతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.83లక్షలు, ఏపీ మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రూ.5లక్షలు, పత్తికొండ టీడీపీ పరిశీలకులు కేసీ హరి రూ.2.23 లక్షలు, శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ రూ.2లక్షలు, వీఆర్‌ఆర్ వైభవ్ ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ రూ.2.50లక్షలు, ఎన్టీఆర్ జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ రూ.1.72లక్షలు, డబ్ల్యూఐ ఫౌండేషన్ ట్రస్ట్ నెల్లూరు రూ.లక్షన్నర, అక్కినేని నాగేశ్వరరావు కాలేజ్ (గుడివాడ) రూ.1.16 లక్షలు, కేవీ సుబ్బారెడ్డి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ రూ.1.16 లక్షలు అందజేశారు.

జోడెడ్ల బండి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసిన పౌర సరఫరాల అధికారులు దీపావళి రోజున ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి కార్యాచరణ ప్రణాళికతో నివేదికను రూపొందించారు. ఈ నివేదికపై మంత్రుల సబ్ కమిటీ చర్చించి పలు సిఫార్సులు చేసింది. దాంతో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో కమిషనర్ జి.వీరపాండియన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ అమూన్ తదితర ఉన్నతాధికారులతో మరోసారి సమావేశమయ్యారు. మంత్రుల కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుంటూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి తుది నివేదికను సిద్ధం చేశారు. దీనిపై బుధవారం రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

అందరికీ ఇస్తారా?

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వల్ల పేదలకు మేలు జరుగుతుంది. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తే ఒక్కో కుటుంబానికి రూ. 2,482.50 చొప్పున లబ్ధి చేకూరుతుంది. రాష్ట్రంలో మొత్తం 1,55,84,270 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికీ 3 సిలిండర్లను ఉచితంగా అందిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.4 వేల కోట్ల వరకు భారం పడుతుంది. జనరల్ కనెక్షన్లు మినహాయించి, 75 లక్షల బీపీఎల్ కుటుంబాలకు మాత్రమే అందిస్తే దాదాపు సగం భారం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం అన్ని కుటుంబాలకూ ఉచిత సిలిండర్లు ఇస్తారా? లేక బీపీఎల్ కుటుంబాలకే అందజేస్తారా? అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 'దీపం' కనెక్షన్లను 'ఉజ్వల' స్కీంలో విలీనం చేయాలని కూటమి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ఈ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదిస్తే, ఈ మొత్తాన్ని మూడు ఉచిత సిలిండర్ల పథకానికి వినియోగించుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ. 540 కోట్ల ఆర్థిక భారం తగ్గుతుంది.

జాబ్ ఫస్ట్ పాలసీలు..

రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగాలు సృష్టించే దిశగా ఐదారు రంగాల్లో కొత్త విధానాల ఖరారుకు రంగం సిద్ధమైంది. నేడు కేబినెట్ సమావేశంలో ఈ పాలసీలపై చర్చించి ఆమోదించనున్నారు. ఐదేళ్లలో ఇరవై లక్షల మందికి ఉద్యోగం లేదా ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సీఎం చంద్రబాబు కూడా పలు మార్లు ఆయా శాఖల అధికారులతో సమావేశమై ఈ పాలసీల రూపకల్పన వేగంగా జరిగేలా చూశారు. జాబ్ ఫస్ట్ (ఉద్యోగం లేదా ఉపాధి కల్పన అన్నింటి కంటే ముందు) అన్న లక్ష్యంతో ఈ పాలసీలను సిద్ధం చేశారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలకు అదనంగా పది శాతం ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా పెట్టారు.

నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీల్లో ఒకటైన నూర్‌బాషా(దూదేకుల ముస్లిమ్స్) ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసి, ఆర్థిక శాఖకు పంపారు. ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ రాగానే దీనికి సంబంధించిన ఫైల్ సీఎం ఆమోదానికి వెళ్లే అవకాశం ఉంది. సీఎం ఆమోదం పొందిన తర్వాత కార్పొరేషన్ ఏర్పాటు అంశం క్యాబినెట్ ముందుకు వచ్చే అవకాశం ఉంది. నూర్‌బాషాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని, ప్రతి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని గత ఎన్నికల ముందు చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఆ హామీ నెరవేర్చడానికి మైనార్టీ సంక్షేమ శాఖ వడివడిగా అడుగులు వేస్తోంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన నూర్‌బాషాలకు భరోసా ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు కసరత్తును కూటమి సర్కారు మొదలుపెట్టింది. కాగా, రాష్ట్రంలో నూర్‌బాషా జనాభా 20 లక్షల వరకు ఉంటుందని దూదేకుల ముస్లిం సంఘాలు చెబుతున్నాయి.

హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 26గా ఉంది. తాజాగా సిఫారసు చేసిన ముగ్గురి నియామకంతో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరనుంది. కాగా, వారిలో జస్టిస్ జి.నరేందర్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఏపీ హైకోర్టులో 37 మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉంది.

కుంచం మహేశ్వరరావు

కుంచం మహేశ్వరరావు 1973 ఆగస్టు 12న తిరుపతిలో కె.సుశీలమ్మ, కోటేశ్వరరావు దంపతులకు జన్మించారు. తండ్రి కోటేశ్వరరావు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు. తిరుపతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించిన మహేశ్వరరావు.. 1998 ఫిబ్రవరి 2న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. అనంతపురం జిల్లా కోర్టులో ప్రాక్టీస్ అనంతరం హైకోర్టుకు వచ్చి సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్ వద్ద జూనియర్‌గా చేరారు. ఆ తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించి.. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ సంబంధిత కేసులను వాదించడంలో ప్రావీణ్యం సంపాదించారు. ప్రస్తుతం హైకోర్టు ప్యానల్ అడ్వకేట్‌గా, భారత బార్ కౌన్సిల్, ఎఫ్‌సీఐ, పలు బీమా సంస్థలకు న్యాయవాదిగా సేవలందిస్తున్నారు.

చంద్ర ధనశేఖర్

తూట చంద్ర ధనశేఖర్ 1975 జూన్ 10న శైలజ, చంద్రశేఖరన్ దంపతులకు జన్మించారు. ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా, సత్యవేడు. తండ్రి జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేశారు. నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించిన ధనశేఖర్ 1999లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ చేశారు. 2019లో ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై వాణిజ్య పన్నులశాఖ తరఫున వాదనలు వినిపిస్తున్నారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, భూసేకరణ చట్టాలకు సంబంధించిన కేసులు వాదించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది.

చల్లా గుణరంజన్

చల్లా గుణరంజన్ 1976 జులై 12న చల్లా చంద్రమ్మ, నారాయణ దంపతులకు జన్మించారు. ఆయన స్వగ్రామం ఉమ్మడి అనంతపురం జిల్లా, తాడిపత్రి. గుణరంజన్ తండ్రి నారాయణ కూడా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. గుణరంజన్ 2001 మార్చి 21న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. తన సోదరుడు విశ్రాంత న్యాయమూర్తి చల్లా కోదండరామ్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. సుప్రీం కోర్టు, ఏపీ, తెలంగాణ హైకోర్టులు, వివిధ ట్రైబ్యునళ్లలో రెండు దశాబ్దాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. విద్యుత్, పర్యావరణ, సివిల్, క్రిమినల్, ట్యాక్స్ సంబంధిత కేసులు వాదించడంలో అపార అనుభవం గడించారు.

లడ్డూ కల్తీపై సిట్‌కు త్రిపాఠీ, జెట్టి

▸ సజ్జల రామకృష్ణారెడ్డిపై లుక్ అవుట్ నోటీస్ ఉంది

▸ అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది: డీజీపీ



అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీంకోర్టు అభిశంసించలేదని డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. స్వతంత్ర దర్యాప్తు జరగాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నామని సుప్రీంకోర్టు చెప్పిందని వివరించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర పోలీస్ అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నుంచి ఒక అధికారితో ఈ సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించిందన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులైన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, డీఐజీ గోపీనాథ్ జెట్టిల పేర్లను సిట్ సభ్యులుగా పంపామని తెలిపారు. అది స్వతంత్ర విచారణ బృందం అని, అందులో రాష్ట్ర పోలీసుల జోక్యం ఉండదని చెప్పారు. అలాగే, వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డిపై లుక్ అవుట్ నోటీసు(ఎల్‌వోసీ) ఉందని డీజీపీ స్పష్టం చేశారు. ఆయనకు ఒక కేసులో గుంటూరు ఎస్పీ ఎల్‌వోసీ జారీ చేశారని, ఆ కేసుకు సంబంధించి అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసు, గన్నవరంలో దాడి కేసు, కాదంబరి జెత్వానీ కేసుతోపాటు మరో కేసును సీఐడీకి బదిలీ చేశామని డీజీపీ తెలిపారు. రఘురామకృష్ణంరాజు కేసు చాలా ముఖ్యమైన కేసు అన్నారు. మదనపల్లె దస్త్రాల దహనం కేసుతోపాటు మరికొన్ని కేసులను సీఐడీ విచారణ చేస్తుందని డీజీపీ వెల్లడించారు.

రాణా, గున్ని ముందస్తు బెయిల్ విచారణ వాయిదా

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్ని, ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వీరు దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు నివేదించారు. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సుబ్రహ్మణ్యం శ్రీరామ్, వినోద్‌కుమార్ దేశ్‌పాండే స్పందిస్తూ.. కేసు దర్యాప్తును సీఐడీకి ఎందుకు అప్పగించాల్సి వచ్చిందో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కౌంటర్ దాఖలుకు సమయం ఇస్తూ విచారణను ఈనెల 23కి వాయిదా వేశారు.

రవాణా కమిషనర్ సిన్హాను తొలగించాలి

▸ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, జాయింట్ కమిషనర్ రమ్యశ్రీపై చర్యలు తీసుకుని, తక్షణం ఆ పోస్టుల నుంచి వారిని తొలగించాలని ఏపీ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణాశాఖ కార్యదర్శికి వినతి పత్రాలు అందజేసినట్లు జేఏసీ అధ్యక్షుడు డి.శ్రీనుబాబు తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కమిషనర్ తమ పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నారని, కోర్టు తీర్పులో లేని అంశాలను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై రుద్దుతున్నారని మండిపడ్డారు.

సాయిబాబా మృతి పట్ల మావోయిస్టు పార్టీ సంతాపం

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమ నేత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. పౌర హక్కుల పరిరక్షణకు ప్రజల తరఫున గొంతెత్తి పోరాడిన ప్రొ. సాయిబాబాను బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు రాజ్యం పథకం ప్రకారం హత్య చేసిందని ఆరోపించింది. ఈ మేరకు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో మీడియాకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏబీవీకి భారీ ఊరట

- నిఘా పరికరాల కొనుగోళ్ల కేసుల నుంచి విముక్తి
- రెండు కేసులు మూసివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- మరో కేసు ఫైల్ సీఎం చంద్రబాబు టేబుల్‌పై!



అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు భారీ ఊరట లభించింది. చెయ్యని తప్పునకు ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయన ఎట్టకేలకు వాటినుంచి బయటపడ్డారు. ఏబీవీపై ఉన్న కేసుల్లో రెండింటిని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈమేరకు మంగళవారం ఉత్వర్వులు జారీ చేసింది. మరో కేసుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిఘా పరికరాల కొనుగోళ్లలో అవినీతి జరిగిందంటూ జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఏబీవీని వేధించింది. అసలు కొనుగోలు చేయని పరికరాల్లో అవినీతి ఎక్కడుందని అన్నందుకు హద్దులు మీరారని, సాక్షులను బెదిరిస్తున్నారని ఆయనపై కేసుల మీద కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసింది. ఏబీవీని సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలంటూ కేంద్రానికి ప్రతిపాదించింది. 2019 నుంచి ఐదేళ్లపాటు సస్పెన్షన్లు, కేసులు, క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటూనే న్యాయపోరాటం చేసిన వెంకటేశ్వరరావు సరిగ్గా పదవీ విరమణకు ఒక్కరోజు ముందు పోస్టింగ్ దక్కించుకున్నారు. క్యాట్ ఆదేశాల మేరకు ఈ ఏడాది మే 30న ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా బాధ్యతలు స్వీకరించి ఆ మరుసటి రోజు 31న రిటైరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం తనను వేధించిన తీరు, చేయని తప్పులకు విధించిన సస్పెన్షన్లు, తప్పుడు కేసుల నుంచి విముక్తి కోసం ప్రభుత్వానికి ఏబీవీ విన్నవించుకున్నారు.

కక్షపూరితంగా అభియోగం

ఏబీ వెంకటేశ్వరరావు గత టీడీపీ ప్రభుత్వంలో నిఘా విభాగం అధిపతిగా పనిచేశారు. అప్పట్లో ఇజ్రాయెల్ నుంచి నిఘా పరికరాల కొనుగోళ్లకు ఆకాశ్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే సంస్థకు 2018 అక్టోబరు 31న రూ.35లక్షలు చెల్లించినట్లు వైసీపీ ప్రభుత్వం అభియోగాలు మోపింది. ఏసీబీ విచారణకు ఆదేశించింది. రూపాయి ఖర్చు చేయలేదని చెబుతున్నా.. అవినీతి జరిగిందంటూ 2020 మార్చి 7న ఏబీవీని సస్పెండ్ చేసింది. దీంతో న్యాయపోరాటానికి దిగిన ఏబీవీ... క్యాట్ ఆదేశాలతో రెండేళ్ల తర్వాత 2022లో పోస్టింగ్ దక్కించుకున్నారు. ఆ సమయంలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తనపై కుట్రపూరితంగా కొందరు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అవకాశంగా ప్రభుత్వ చర్యలపై బహిరంగంగా మాట్లాడినందుకు ఆలిండియా సర్వీస్ రూల్స్ ప్రకారం జగన్ ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు సిద్ధపడింది. అప్పట్లో కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ ఆర్పీ సిసోడియా ముందు హాజరైన ఏబీవీ... తనను కుట్రపూరితంగా ఇరికించేందుకు ఎవరెవరు ఫోర్జరీ పత్రాలు సృష్టించారో వివరించారు. ఆలిండియా సర్వీస్ నిబంధనలు అతిక్రమించలేదని స్పష్టం చేశారు. అయినా సంతృప్తి చెందని జగన్ సర్కారు, సాక్షులను బెదిరిస్తున్నారంటూ మరోమారు ఏబీవీని సస్పెండ్ చేసింది. కాగా, మీడియాతో మాట్లాడారని ఏబీవీకి గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన రెండు చార్జి మెమోలను ప్రస్తుత ప్రభుత్వం ఉపసంహరించుకుంది. సర్వీసు నిబంధనల ప్రకారం గత ప్రభుత్వం విచారణ అధికారిని నియమించకుండా కాలయాపన చేసింది. వాటిని జారీచేసి ఏడాది పూర్తికావడంతో ఆ ఉత్వర్వులు నిరర్థకంగా మారాయి. ఈ నేపథ్యంలో చార్జిమెమోలను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

ఇంట్లో కూర్చొనే పని చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న ఏడుగురు ఐఏఎస్‌లు వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, వాణీప్రసాద్, రొనాల్డ్ రోస్ (తెలంగాణ); సి.హరికిరణ్, లోతేటి శివశంకర్, జి.సృజన(ఏపీ) తమకు కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లిపోవాలని క్యాట్ స్పష్టం చేసింది. ఐఏఎస్ అధికారులు ఇళ్లలోనే కూర్చొని సేవ చేస్తామంటే కుదరదని వ్యాఖ్యానించింది. ఈ నెల 16న ఎక్కడి అధికారులు అక్కడికి వెళ్లిపోవాలంటూ డీవోపీటీ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి క్యాట్ నిరాకరించింది. ఈ ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు ఏపీకి.. ఏపీలో పనిచేస్తున్న వారు తెలంగాణకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. తాము ఎక్కడ పనిచేస్తున్నామో అక్కడే ఉంటామని.. డీవోపీటీ ఇచ్చిన ఆర్డర్‌ను కొట్టేయాలని పేర్కొంటూ ఏడుగురు ఐఏఎస్‌లు హైదరాబాద్ క్యాట్‌లో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై లత బస్వరాజ్ పాట్నే, శాలినీ మిశ్రా బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది. ఐఏఎస్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు జి.విద్యాసాగర్, కేఆర్‌కేవీ ప్రసాద్, వి.మల్లిక్, కె.లక్ష్మీనర్సింహ తదితరులు వాదనలు వినిపించారు. క్యాడర్ విభజన కోసం 2014లో ఏర్పాటైన ప్రత్యూష్ సిన్హా కమిటీ సీనియారిటీని నిర్ణయించకుండానే విభజన చేయడం వల్ల సీనియారిటీకి విరుద్ధంగా ఏపీకి కేటాయించారని.. సదరు కేటాయింపు చెల్లదని, తెలంగాణలోనే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని రోనాల్డ్ రోస్ తరఫు న్యాయవాది కోరారు. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా డీవోపీటీ వ్యవహరించిందని.. వ్యక్తిగతంగా వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వలేదని, ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడానికి ఏర్పాటైన ఏకసభ్య కమిటీ రిపోర్ట్ తమకు అందజేయలేదని వాకాటి కరుణ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. తెలంగాణ స్థానికత ఉన్నప్పటికీ ఏపీకి కేటాయించడం అక్రమమన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన అన్ రిజర్వుడు కోటా ఐఏఎస్‌లకు పరస్పర అంగీకారంతో బదిలీ (స్వాపింగ్) అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమని ఆమ్రపాలి తరఫు న్యాయవాది తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఉన్నత విద్య వరకు తాను తెలంగాణలోనే ఉన్నప్పటికీ తన పేరును ఏపీ స్థానికత జాబితాలో పెట్టడం చెల్లదని వాణీప్రసాద్ న్యాయవాది వాదించారు. తాము ఏపీకి చెందిన వారమని, తమ స్థానికతను తప్పుగా చూపారని సృజన, శివశంకర్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. తాను ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అయినప్పటికీ జనరల్ కోటాలో ఎంపికయ్యానని, తనను ఎస్టీ కోటాలో చూపడం చెల్లదని హరికిరణ్ న్యాయవాది పేర్కొన్నారు. డీవోపీటీ ఉత్తర్వులను కొట్టేయడంతోపాటు 16న రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. డీవోపీటీ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల ప్రకారమే ఐఏఎస్ అధికారుల రిప్రజెంటేషన్లపై చట్టబద్ధంగా అన్ని అంశాలు విచారించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏకసభ్య కమిటీని నియమించి రిపోర్ట్ సైతం తీసుకున్నామన్నారు.

ప్రస్తుతానికి ఆ రిపోర్ట్ అందుబాటులో లేదని, దాంతోపాటు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇది కేంద్రం, పిటిషనర్ల మధ్య సమస్య కావడంతో తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల న్యాయవాదుల వివరణను క్యాట్ తీసుకోలేదు. వాదనలు నమోదు చేసుకున్న బెంచ్.. ఐఏఎస్‌ల తీరును తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. "ఐఏఎస్ అధికారులు ఇళ్లలోనే కూర్చొని సేవ చేస్తామంటే కుదరదు. సరిహద్దుల్లో సమస్యలు వస్తే అక్కడికి వెళ్లి పనిచేయరా? విజయవాడ వంటి ప్రాంతాల్లో భారీ వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి చోట్లకు వెళ్లి ప్రజలకు సేవ చేయాలని లేదా? ఎక్కడికీ కదలబోమంటే కుదరదు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు దేశం కోసం పనిచేయరా? ఈ పిటిషన్లన్నీ మేము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయి. ముందు ఏ రాష్ట్రం వాళ్లు అక్కడ రిపోర్ట్ చేయండి. తర్వాత తుది విచారణ చేపడతాం. స్థానికత, స్వాపింగ్, ఇతర అన్ని అంశాలతో కేంద్రం కౌంటర్ దాఖలు చేయాలి. ఈ పిటిషన్లను అడ్మిట్ చేసుకున్నాం. కేంద్రానికి నోటీసులు ఇస్తున్నాం" అని పేర్కొంది.

క్యాట్ తీర్పుపై హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్లు..

క్యాడర్ వివాదంలో ఉన్న ఐఏఎస్ అధికారులు గురువారం తమ తమ రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డీవోపీటీ స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొంది. మంగళవారం క్యాట్‌లో సైతం ఎలాంటి ఊరట లభించకపోవడంతో తప్పనిసరిగా రిపోర్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే క్యాట్ తీర్పుపై హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో అత్యవసరంగా పిటిషన్‌లు దాఖలు చేస్తామని ఐఏఎస్ అధికారులు పేర్కొన్నారు. హైకోర్టులో తీర్పు ఆధారంగా.. ఆయా రాష్ట్రాల్లో రిపోర్ట్ చేసే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. క్యాట్ తీర్పు అంశాన్ని పలువురు ఐఏఎస్‌లు తెలంగాణ సీఎస్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ఏంచేయాలనేదానిపై చర్చలు జరిపినట్లు తెలిసింది.

హైకోర్టులో ఊరట లభించకపోతే

హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీలు తప్పవా? అంటే.. తాజా పరిణామాలు అవుననే అనిపిస్తున్నాయి. క్యాడర్ వివాదంలో ఐదుగురు ఐఏఎస్‌లు గురువారం ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందేనని క్యాట్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ తీర్పుపై బుధవారం అధికారులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్లు వేయాలని నిర్ణయించారు. హైకోర్టులో ఊరట లభించకపోతే తప్పనిసరిగా ఏపీకి వెళ్లిపోవాల్సిందే. అప్పుడు రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది. కొన్ని కీలకమైన పోస్టులను తప్పకుండా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఐఏఎస్‌లు వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ సోమవారం క్యాట్‌ను ఆశ్రయించారు. ఏ రాష్ట్ర క్యాడర్ ఐఏఎస్ అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లాల్సిందేనంటూ మంగళవారం క్యాట్ తేల్చి చెప్పింది. ముందు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని, తర్వాత తుది విచారణ చేపడతామని తెలిపింది. హైకోర్టులో బుధవారం అనుకూలంగా తీర్పు వస్తే వారంతా ఇక్కడే ఉంటారు. లేకపోతే తెలంగాణను వీడాల్సిందే.



అన్నమయ్య జిల్లా కదిరినాథునికోట పంచాయతీలోని కనుగొండ అటవీ ప్రాంతంలోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని దుండగులు ధ్వంసం చేశారు. తొలుత ఆలయాన్ని రిగ్గులతో పేల్చేందుకు కుట్ర చేశారు. వర్షానికి రిగ్గులు పేలకపోవడంతో.. సమ్మెటలతో కొట్టడంతో ఆలయం పక్కకు ఒరిగిపోయింది. - ములకలచెరువు

ఆర్టీఈ చట్టం ఉల్లంఘనకే జీవో 24

- అవసరమైన చోట స్కూళ్లు పెట్టడం ప్రభుత్వం బాధ్యత
- దానిని విస్మరించి 'ప్రైవేటు'పై మోపడం వైఫల్యమే: హైకోర్టు

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 26న ఇచ్చిన జీవో 24ను హైకోర్టు రద్దు చేసింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను కేటాయించాలని ఈ జీవో నిర్దేశించింది. ఈ జీవో విద్యా హక్కు చట్టం ఉద్దేశాలను నీరుకార్చేలా ఉందంటూ హైకోర్టు అభిప్రాయపడింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ ఏడాది జూన్ 24న తీర్పు ఇచ్చారు. తాజాగా ఈ తీర్పు ప్రతి అందుబాటులోకి వచ్చింది. ఈ జీవోను సవాల్ చేస్తూ యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ చైర్మన్ గొల్లపూడి, ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోగంటి శ్రీకాంత్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యాలపై వాదనలు ముగిశాయి. 'విద్యాహక్కు చట్టం ఉద్దేశాలకు అనుగుణంగా ప్రభుత్వం పాఠశాలలను మ్యాపింగ్ చేయలేదు. అవసరమైనచోట ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయలేదు. విద్యార్థికి అయ్యే ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లించే విషయంలో నిబంధనలు పాటించినట్లు నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు కోర్టు ముందుంచలేదు. ఆర్టీఈ చట్టం ఉద్దేశాలను ఉల్లంఘించేందుకే జీవో 24 జారీ చేసినట్లు కనిపిస్తోంది. అవసరమైనచోట పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న చట్టబద్ధ బాధ్యతను ప్రైవేటు పాఠశాలలపై మోపడం ప్రభుత్వ వైఫల్యమే' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.